చైతన్య సాహితి

వ్యాస సంపుటి

- ఇవి సంపాదకీయ వ్యాసాలు.

ఇవి గణపతిని గురించి చెబుతాయి; చరిత్రతో మేళవిస్తాయి.

- ఓంకారాన్ని వివరిస్తాయి; వ్యక్తిని ఆధ్యాత్మిక శిఖరాలకు తీసుకు వెళతాయి.
- శివరాత్రి గురించి చెబుతాయి; సత్యశివసుందర సమాజాన్ని ఆకాంక్షిస్తాయి.
- మనోవిగ్రహమవసరమంటాయి; వ్యక్తికి సంస్కార పథాన్నిచూపిస్తాయి.
- వాల్మీకిని, వ్యాసుణ్ణి, ఆదిశంకరులను, బసవేశ్వరుణ్ణి, వివేకానందుణ్ణి, అరవిందుణ్ణి గురించి వివరిస్తాయి. భారతీయాత్మను దర్శించుమంటాయి.
- వేదాలనూ ఉపనిషత్తులనూ, రామాయణ, భారత, భాగవతాలను స్పృశిస్తాయి; వికసించండని పిలుపునిస్తాయి.
- గీతాతత్త్వాన్ని విప్పి చెబుతాయి; అధర్మాన్ని ఎదిరించి నిలువుమంటాయి.
- జాతీయతా తత్త్వాన్ని ప్రస్తావిస్తాయి; విదేశీ ఇజాల విషదంష్ట్రల్లో ఇరుక్కోవద్దంటాయి.
- స్వదేశీ మార్గంలో నడుపుమంటాయి; విదేశీ మతసామ్రాజ్యవాద దురహంకారాన్ని ఎండగట్టు మంటాయి.
- ప్రజాస్వామ్యభారతంలో హైందవీ శక్తుల ఏకతకు పిలుపునిస్తాయి; అఖండ భారతదృక్పథంతో అడుగులు వేయుమంటాయి.
- శ్రీరాముణ్ణీ, శ్రీకృష్ణుణ్ణీ, శివాజీని ఆదర్శంగా తీసుకొమ్మంటాయి; విజయ పథాన పురోగమించు మంటాయి.

కార్యదర్శి, జాతీయ సాహిత్య పరిషత్, భాగ్యనగర్ శాఖ.

CHAITANYA SĀHITI
-A collection of Essays

Rs. 30/-

చైతన్య సాహితి

వ్యాస సంపుటి



- డా॥ కసిరెడ్డి

చైతన్య సాహితి

(వ్యాస సంపుటి)

డా॥ కసిరెడ్డి

రి.నెం. 250/75

ప్రచురణ

జాతీయ సాహిత్య పరిషత్

భాగ్యనగర్ శాఖ, ఆం.ప్ర.

చైతన్య సాహితి

(వ్యాస సంపుటి)

- డా॥ కసిరెడ్డి

ప్రథమ ముద్రణ : 1997 డిసెంబర్

ప్రతులు : 500

కసిరెడ్డి స్వర్ణోత్సవ సాహితీ ముద్రణ : 5

జాతీయ సాహిత్య పరిషత్ ప్రచురణ సం : 46

ప్రచురణ :

జాతీయ సాహిత్య పరిషత్, భాగ్యనగర్ శాఖ

ప్రతులకు :

సాహిత్య నికేతన్

3-4-852, బర్కత్‌పుర, హైదరాబాదు - 500 659

రచయిత

17-1-473/31/B/N, కృష్ణ నగర్, హైదరాబాదు - 500 659.

ముద్రణ :

కర్షక్ గ్రాఫిక్స్, విద్యానగర్, హైద్రాబాద్. ఫోన్ : 7618261.

మూల్యం : 30/- రూ॥లు.

అంకితం



శ్రీ శ్రీ శ్రీ నిత్యశుద్ధానందగిరి స్వాముల వారికి

మహర్షి సద్గురు మలయాళస్వామిమార్గాన్ని అనుసరిస్తూ

సాధునగర్ మలయాళ స్వామి ఆశ్రమ అధ్యక్షులై

ఆశ్రమంలో అఖండ రామనామ గానం కొనసాగిస్తూ

శ్రీరామకోటి జపయజ్ఞ గీతా జ్ఞాన యజ్ఞాలకు ఆధ్వర్యం వహిస్తూ

గభీర తాత్త్వికాంశాల్ని సరళ సుబోధంగా ప్రవచిస్తూ

బ్రహ్మజ్ఞాన ప్రచారం నిమిత్తం బ్రహ్మవిద్యాపాఠశాల నిర్వహిస్తూ

అద్వైత తాత్త్వికాంశాలనూ సామాజికంగా అన్వయిస్తూ

శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రాన్ని సులభోదాహరణలతో వివరిస్తూ

కర్మ జ్ఞాన భక్తి యోగాల ప్రాశస్త్యాన్ని ప్రబోధిస్తూ

నిత్యచైతన్య శీలియై పయనించే శ్రీ శ్రీ శ్రీ నిత్యశుద్ధానందగిరి స్వాముల వారికి

ఈ చైతన్య సాహితి హృదయ పూర్వకంగా అంకితం

- డా॥ కసిరెడ్డి

ధన్యవాదాలు

శ్రీరామకోటి జపయజ్ఞ గీతాజ్ఞాన యోగ సమాచార్ ఆధ్యాత్మిక మాస పత్రికలో గత ఏడు సం॥ గా వ్రాసిన సంపాదకీయాల్లో కొన్నిటిని "చైతన్య సాహితి" పేరిట అందిస్తున్నాను. ఇందులో ఒకటి రెండు ధర్మసారథి మాస పత్రికకు వ్రాసిన సంపాదకీయాలు కూడా ఉన్నాయి. ఈ గ్రంథాన్ని సాధునగర్ మలయాళస్వామి ఆశ్రమాధిష్ఠాత సద్గురు వర్యులు శ్రీశ్రీశ్రీ నిత్యశుద్ధానందగిరి స్వామి వారు అంకితంగా స్వీకరించినందుకు ఆనందంగా ఉంది. పత్రికకు సంస్థాపకులైన వారు ఈ సంపాదకీయాల సంపుటిని గ్రహించడం బంగారానికి పరిమళం అబ్బినట్లుగా భావిస్తున్నాను.

ఈ గ్రంథం పాలమూరు జిల్లా కలువకుర్తిలో జరిగే ౧౦౮ వ (ద్వితీయ) శ్రీరామకోటి జపయజ్ఞ గీతాజ్ఞాన యజ్ఞంలో, ౧౭వ వేదాంత విజ్ఞాన మహాసభలో ఆవిష్కరింపబడుతున్నది. ఈ యజ్ఞ నిర్వాహకులైన శ్రీ జూలూరి చంద్రమౌళి గుప్తగారికి, కలువకుర్తి భక్త బృందానికి, మిత్రులూ సమాజసేవకులు డా॥ దామోదర్ రెడ్డిగారికి, సాధునగర్ ఆశ్రమబంధు బృందానికి, ఈ గ్రంథాన్ని ఏ మాత్రం లాభాపేక్ష లేకుండా ప్రచురించి ఇచ్చిన కర్షక్ ప్రింటర్స్ అధినేత శ్రీ జగన్మోహన రెడ్డిగారికి, పత్రికలో సంపాదకీయాలు చదివి అప్పడప్పడు తమ అభిప్రాయాలు వ్రాసిన పాఠక బంధువులందరికి వందనాలు.

ఈ సంపాదకీయాలు ౧౯౯౨ నుండి ౧౯౯౭ వరకు వ్రాసిన వాటిలో కొన్ని మాత్రమే. ఈ పత్రికవీ, మాతృ అర్చనవి, సాధన పత్రికవి కలిపి మరో నూట పాతిక పైచిలుకు సంపాదకీయాలుంటాయి. వీటిని అధ్యయనం చేసేప్పడు "దేశం-కాలం-పరిస్థితులు" దృష్టిలో పెట్టుకోవల్సిన అవసరముంటుంది. ఇందులో తాత్కాలిక సందేశాలుంటాయి. శాశ్వత సత్యాలుంటాయి. ప్రపంచంలో తాను, తన దేశం, తన ధర్మం, తన జాతి, తన సంస్కృతి అస్తిత్వం ఉండాలని కోరుకొనే స్వాభిమానులెవరైనా వీటిని చదివి స్పందిస్తారని, హర్షిస్తారని ఆశిస్తున్నాను.

ఈ వ్యాస సంపుటి భాగ్యనగర్ జాతీయ సాహిత్య పరిషత్ శాఖ ప్రచురించింది. ఆ శాఖ అధ్యక్షకార్యదర్శులకు కార్యవర్గానికి ధన్యవాదాలు.

భాగ్యనగర్ **రచయిత**
తేది : ౬ డిసెంబర్, ౧౯౯౭

విషయ సూచిక

1. శ్రీగణేశాయనమః

వర్ష ఋతువు ప్రారంభమయింది. భూమి వెచ్చదనం నుండి పచ్చదనం పుట్టుకొని వచ్చింది.

జీవకోటి సంరక్షణ కాలమిదే అని సర్వజీవులూ భావించాయి. మానవులూ భావించారు.

హిందూ జాతికి ఈ కాలం ఎప్పుడూ సంతోషదాయకమయ్యిందే. పదిమందిని కలిపి నిలిపే పండుగ రావడం, సామూహిక ఉత్సవాలు నిర్వహించుకోడం సంఘటనకు దోహదం చేయడంగా ఈ జాతి భావించింది.

అందుకే శ్రీ గణేశాయనమః అంటూ ఉత్సాహంతో గణపతి నవరాత్రి ఉత్సవాలు జరుపుకొంటున్నది. లోకమాన్య తిలక్ కంటే పూర్వం నుండే గణపతి పూజ దేశంలో ఉన్నా దీనికొక సామాజిక చారిత్రక ప్రాధాన్యం మాత్రం ఆయన వల్లనే కలిగింది.

గణపతి సర్వజీవ గణములకు పతి. కాని ఆ భగవానుణ్ణి భారతీయ జనగణపతిగా తీర్చిదిద్దిన వారు లోకమాన్యులు.

"సర్వ విఘ్నోపశాన్తయే" - అనేది మహామంత్రమయ్యింది. భారతీయులకు సర్వవిఘ్నాలు కలిగించింది - కలిగిస్తున్నది విదేశీయులే. ఆ విదేశీయులకు ఇక్కడ విలాస జీవితం గడపాలని ఉంది; అధికారం చలాయించాలని ఉంది. ఈ ప్రజలకు మేలు చేయాలనేది ఓ బూటకం - ఓ నాటకం.

పైకి గోముఖం - లోనిది వ్యాఘ్రం. ఇలాంటి వారి వల్ల ఇక్కడ పుట్టి, ఇక్కడ పెరిగి, ఈ దేశాన్నే దైవంగా భావించే ప్రజానీకానికి ఒరిగేదేం లేదు. అందుకే వారిని శాశ్వతంగా సాగనంపాలి.

అనాడు గణపతి, తల్లి చుట్టు తిరిగి అన్ని లోకాలు తిరిగి వచ్చానన్నాడు. ఈనాటి భారతీయుడు దేశమాత చుట్టూ తరగాలి. తల్లిని సంరక్షిస్తానని దీక్ష తీసుకోవాలి.

జాతీయోద్యమంలో శ్రీ గణేశాయనమః అంటూ లోకమాన్యుడు గణపతి ఉత్సవాల్ని ఇటువైపు మళ్లించాడు.

ఈ విదేశీయులు హిందువులనూ, హిందుత్వాన్ని, హిందూ ధర్మాన్ని, హిందూ సంస్కృతిని, హిందువుల ఆచార వ్యవహారాల్ని సంరక్షించాలనే దృక్పథంతో లేరు. దీనిని అణగద్రొక్కాలనే వారి ఉద్దేశ్యం. అందుకే వారు స్వాతంత్ర్య సమర వీరుల్ని, దేశభక్తుల్ని అణగద్రొక్కివేస్తున్నారు. అటువంటి విదేశీయులను ఇక్కడి నుండి సాగనంపితేనే సర్వ విఘ్నాలుపోతాయి. ఇందుకొరకే గణపతి నవరాత్రి ఉత్సవాలను ఉపయోగించుకొన్నారు లోకమాన్యులు.

ఇవాళ కూడా దేశంలో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. విఘ్నాలు కలిగించేవారిని గురించి స్వతంత్ర భారత పౌరులూ ఆలోచించవలసి ఉంది. **శ్రీ గణేశాయనమః** అంటూ సర్వవిఘ్నాల ఉపశాంతికి ప్రతి హిందువూ నడుం బిగించాల్సి ఉంది.

2. ఓమ్ - అర్థం గ్రహించండి - ఆచరించండి!!

అ-ఉ-మ్ అనే ఈ అక్షరాలతో "ఓం" కారమేర్పడింది. ఓంలోని ఈ మూడక్షరాలు ఈశ్వర-జీవ - ప్రకృతులు. ఇవి అనాదులు - సృష్టికే పునాదులు. 'అ' నుండి ఈశ్వరుణ్ణి, 'ఉ' నుండి జీవాత్మను, 'మ్' నుండి మాయ (ప్రకృతి) అనే అర్థాల్ని గ్రహిస్తున్నాం. అ, ఉ, మ్ కలిస్తే 'ఓం' అయిన విధంగానే ఈశ్వర - జీవ - ప్రకృతులతో విశ్వ రచన జరుగుతున్నది. 'ఓం' రచనలో 'అ-మ్'లకు మధ్య చరించే జీవాత్మ ఉన్నది.

'అ-ఉ' అనే ఈ రెండక్షరాలు స్వరాలు (అచ్చులు) 'మ్' మాత్రం వ్యంజనం (హల్లు) స్వరాలు స్వతంత్రాక్షరాలు. వ్యంజనాక్షరాలు స్వరాల మీద ఆధారపడి ఉచ్చారణ శక్తిని పొందుతాయి. అంటే వ్యంజనాక్షరాలలో స్వరం లేకుంటే అది పలుకబడదన్న మాట.

విశ్వంలో కూడా పరమేశ్వర జీవాత్మలు ఈ రెండూ స్వతంత్రాలు. ఇవి తమ సత్తాతో చేతనత్వంతో స్వయంగా ప్రకాశిస్తాయి. కాని కారణ రూప ప్రకృతిలో ఈశ్వరేచ్ఛ గానీ జీవాత్మ గానీ ప్రవేశించకపోయినట్లయితే అది కార్య రూపంతో ఏనాటికి కూడా ప్రకటితం కాదు. అంటే ఈశ్వరేచ్ఛ జీవాత్మల ప్రమేయం లేకపోయినట్లయితే ప్రకృతి (మాయ) కదలనే కదలదన్నమాట.

అ+మ్ = మ అవుతుంది: ఉ+మ్ = ము అవుతుంది. అ-మ్‌ల మధ్యవర్తి ఉ. 'ముఖము' అనే పదంలోని రెండు 'ము'లలో ఉఉ ఉన్నది. 'ము-'ను చూస్తే మన కేమనిపిస్తున్నది. 'ఉ' క్రిందబడి ఉంది. వ్యంజనం - శక్తిహీనమూ అయిన 'మ్' దాని తలపై కెక్కి ఉన్నది. విశ్వ రచనలో కూడా ఈ భావాన్నే స్వీకరించాలి. 'ఉ' అనే జీవాత్మ నెత్తిన ప్రకృతి (మాయ) ఎక్కి ఉన్నదన్న మాట.

స్వరాక్షరం స్వతంత్ర జీవాత్మే. అయితే అది అవిద్యావశం వల్ల పరమాత్మను మరచిపోయింది. ఈ లోకాన్నే సమస్తమనుకొన్నది. అప్పుడు ఈ మాయ అనే వ్యంజన 'మ్' జీవాత్మ అయిన 'ఉ' తలపైకెక్కి తన దాసునిగా చేసుకొన్నదన్న మాట. అంతేకాదు. జన్మ జన్మాంతరాల ఉచ్చనీచ సంబంధి నానావిధాల నటనలను నటింప జేస్తుందన్న మాట.

వీటిని ఇంకా ఇలా అర్థం చేసుకోండి! ఏకాగ్రతతో మరీ మరీ చదవండి!

అకార - ఉకార మధ్యస్థమైన ఉకారాక్షరం 'అ'-లో కలిసిపోయిందనుకోండి! అప్పుడా రెండు 'ఓ'-గా మారిపోతాయి. ఏకరూపాన్ని ఏక స్వరాకృతిని పొందినాయన్న మాట. అప్పుడు 'ఓ' దగ్గరకు వ్యంజనమైన 'మ్' వచ్చినా అది 'అ'లో కలిసి ఉన్న 'ఉ' కారాన్ని తాకలేదు. 'ఓ'- లేదనుకోండి. 'మ్' అనే ఆ వ్యంజనం బిందువై (అనుస్వారమై) ఒంటరిగానే ఉండిపోతుంది. ఓ-ను సమీపించి ఉంటే 'ఓం' కారమవుతుంది.

ఈ విధంగానే జీవాత్మ (ఉ) పరమాత్మ (అ) దేవ ఉపాసన చేసి పరమాత్మ ప్రాప్తి పొందినప్పుడు, అతని స్వరూపం పరమాత్మ గుణాలతో పూర్ణమైపోతుంది. ఆ విధంగా పరమానందంలో (పరమాత్మలో) లీనమైన ఆత్మను (జీవాత్మను) ఎంత మాత్రమూ మాయ బంధింపలేదు; కనీసం తాకను గూడ తాకజాలదు. 'ఓ'ను చేరని వ్యంజనం (మ్) అనుస్వారం వలె శక్తిహీనమైపోతుంది. ఏమీ చేయలేనిదవుతుంది.

'అ'కారాక్షరం 'మ్' హల్లులో కలిసిపోతే దాని రూపం 'మ' వలె అవుతుంది. 'మ్' లో కలసిన ఉకారం స్పష్టంగా కనిపిస్తుంది గాని అకారం అట్లా కనిపించదు. కన్నులకు ఆకారం కాదు కనిపించాల్సింది. అందువల్ల అదియేదో (అ) మనస్సు చేత, బుద్ధిచేత మాత్రమే గుర్తించబడుతుంది. ఇందుకో ఉదాహరణం.

'రామ' శబ్దంలోని 'మ'లో అకారముంది. అదే రీతిగా పరమేశ్వరుడు 'మ'లోని అకారం వలె ప్రతి అణువణువులోనూ పరమాణువులోనూ ఇమిడి పోయి ఉన్నాడు. అందుకే ఆ పరమేశ్వరుడు ఇంద్రియాతీత గోచరుడని పిలువబడుతున్నాడు. అంటే ఇంద్రియాలు ఆయన్ని గ్రహించ లేవనే కదా అర్థం. భక్తులు - ముముక్షువులు తమ జ్ఞాన, శ్రద్ధ, విశ్వాసాల వల్లనే ఈశ్వరాధిపత్యాన్నీ - ఉనికినీ సర్వత్ర విద్యమానమవుతున్నట్లు గానే తెలుసుకొంటారు; తెలుసుకోవడమే కాదు భావన చేస్తారు.

"ఓం" అక్షరం పరమాత్మ వాచకం. సర్వత్రారమించే చేతనశక్తి. జ్ఞానశక్తి, ఆనందపూర్ణ శక్తి దీనికి వాచ్యం; అదే ఓం. సచ్చిదానంద స్వరూప పరమాత్మే ఓంకారానికి అర్థం.

జలము అనంగానే ద్రవీభూతమైన పలుచని పదార్ధమని గ్రహిస్తాం కదా! దానికి శీతల స్పర్శ ఉంటుందని కూడా అవగాహనమవుతుంది కదా! అట్లే 'ఓం' అనంగానే గుర్తుకు వచ్చేది బ్రహ్మమే.

వాచ్య - వాచకాలకు, శబ్దార్థాలకు నిత్య సంబంధముంటుంది. గుణము - గుణిలో ఉంటుంది.; వాచ్యం వాచకంలో ఉంటుంది; అర్థం శబ్దంలో ఉంటుంది. అగ్నిలో రూపమూ ఉష్ణ స్పర్శ ఉంటుంది. జలంలో రసమూ శీతల స్పర్శ ఉంటుంది; ఇవన్నీ నిత్యం - సత్యం. అట్లే 'ఓం' వాచకంలో దాని వాచ్యం, దాని అర్థం, నిత్యంగా సత్యంగా ఉంటాయి. అవి యేనాటికీ వేరుగావు. భక్తి భావ పరిపూర్ణ హృదయులైనవారు ఈ విషయాన్ని అచంచలంగా భావిస్తారు; తపిస్తారు; నిరంతరం జపిస్తారు.

మరి ఆ ఓంకార వాచ్య పరమాత్మ సర్వ వ్యాపి సర్వపూర్ణుడు. మన అంత:కరణంలో ఎప్పుడూ విద్యమానుడయ్యే ఉన్నాడు. మన బుద్ధిలో కూడా ఆ పరమేశ్వర ప్రకాశమే ఉన్నది.

ఏ మనోమందిరంలో 'ఓమ్'ను జపిస్తామో, ఏకంఠం ద్వారా 'ఓమ్' కారధ్వనిని బహిర్గతం చేస్తామో, ఏ నాలుకపైన 'ఓమ్' నామం విరాజిల్లుతుందో, ఏ చెవిలో 'ఓమ్' నామానికి సంబంధించిన ప్రతిధ్వని పడుతుందో ఆయంగాలన్నింటిలో పరమాత్ముడే పరిపూర్ణ రూపంతో నిలిచి ఉంటాడు. మన అస్థికల్లో, మజ్జాలో, రోమ రోమంలో, రక్త నాళాల్లో, అణువణువులో నిండి ఉంటాడు. 'ఓమ్' శబ్దంలో, 'ఓమ్' ధ్వనిలో కూడా పరమాత్మ పరిపూర్ణుడై ఉన్నాడు.

మరి అలాంటి 'ఓమ్' అక్షరజపం, 'ఓమ్' అక్షర చింతనం నిరంతరం చేయాలి; లేదా నియతకాలంలో చేయాలి. అలా చేయడం వల్ల చిత్తమేకాగ్రమవుతుంది. పరమేశ్వర ప్రీత్యర్థమే సర్వకర్మలు నిర్వహించే అభ్యాసం కలుగుతుంది. ఈ విశాల విశ్వమంతటా పరమాత్మే కనిపించే దృష్టి ఏర్పడుతుంది. ప్రణవజపం ప్రణవార్థ చింతనం వల్ల భక్తి కలుగుతుంది. ధర్మమార్గంలో పయనించే నిష్ఠ ఏర్పడుతుంది.



3. మాతృశక్తి రక్షణావశ్యకత

"మాతా పృథ్వీ పుత్రో౽హం పృథివ్యాః" - ఈనేల నా తల్లి ఈ నేలకు నేను పుత్రుణ్ణి. ఇది పుత్రరూపి సమాజం. ఈ సృష్టి అంతా మాతృరూపం.

ఇది హిందువు భావన. ప్రపంచంలో తమ దేశాన్ని మాతగా భావించిన జాతులు తక్కువ. చాలా వాటికి ఫాదర్‌ల్యాండులున్నాయే గాని మదర్‌ల్యాండులు లేవు. కొన్ని జాతులకైతే భూమి భోగించదగిందే, జయించదగిందే తప్ప అర్చించదగింది కాదు.

కాని హిందువుకు భూమి అర్చించదగిందే! నిద్ర నుండి లేచిన వెంటనే హిందువు ఇలా అంటాడు.

కరాగ్రే వసతేలక్ష్మీ - కరమధ్యే సరస్వతీ,
కరమూలేతు గోవింద : - ప్రభాతేకరదర్శనమ్॥

సముద్ర వసనేదేవీ - పర్వతస్తన మండలే,
విష్ణుపత్నీ నమస్తుభ్యం - పాదస్పర్శం క్షమస్వమే ॥

హిందువు తన పాదాలు భూమి మీద మోపుతూ, తన కన్నివిధాలా ఆధారమైన ఆ తల్లిని క్షమించవలసిందని కోరుకోవడం ఆ తల్లి మీద గౌరవానురాగాల వల్లనే. ఆమెనే భూమాతగా పిలువబడుతున్నది. ఆ భూమాతను ఏ పుణ్య కార్యం చేసినా మనం ఆవాహనం చేస్తాం; అర్చిస్తాం.

"జంబూ ద్వీపే, భరతవర్షే, భరతఖండే....." అని సంకల్పం చెప్పుకొంటాం. ఇంతా చెప్పి మనం ఆ ఈ నేల మీద ఎక్కడున్నామో ఏం చేస్తున్నామో వివరించుకొంటాం. తర్వాత కర్మ క్షేత్రంలో కాలుపెడతాం. కొందరికీ సంకల్పం నైమిత్తిక కార్యాల వరకే పరిమితం కావచ్చు గాక! కొందరికైతే నిత్యకార్యాల్లోనూ ఈ మంత్రం తప్పదు.

హిందువుకు ఈ మట్టి మీద, ఈ మాతృమూర్తి మీద ఎందుకంత పవిత్రభావన! ఇది కేవలం కృతజ్ఞతకు సంబంధించిన భావన కాదు. ఇది ఒకానొక అద్వైత స్థితి. నిరంతర

స్మరణం చేత ఆ తల్లిని ఈ నరక ప్రదూషిత, ఈ అంధకార దుర్గంధ పరివేష్టిత దుస్థితి నుండి కాపాడాలనే శక్తి ఈ జాతిలో పెరుగుతుందనే, అలా పెరగాలనే - సంకల్ప మంత్రాల్లో భారతమాతను ఆ విధంగా సంస్మరించడం జరుగుతున్నది.

అంతేకాదు హిందువుకు వేదం ఒక గ్రంథం కాదు; వేదం వేదమాతే. ఈ వేద విజ్ఞానాన్ని అప్పుడెప్పుడో సోమకుడు అపహరించాడు. మత్స్యమూర్తి వాడిని సంహరించి వేదాలు తెచ్చిచ్చాడు. ఈనాడు ఈ పుత్రులు కూడా వేదమాత సంరక్షణకు అదే విధంగా పూనుకోవాలనే సందేశమే అది. తల్లిని కాపాడని తనయులు తమను తాము ఎలా కాపాడుకొంటారు; తమ పిల్లల్ని ఏవిధంగా కాపాడుకొంటారు! అందుకే వేదాన్ని వేదమాతగా హిందువు సంభావిస్తాడు.

ఆ తర్వాత జలాన్ని గంగామాతగా అర్చించే సంస్కృతి హిందువుది. జీవకోటికి జలమే జీవనాధారం. మనం ఉంటున్న ఈ భూగోళం మట్టి గుట్టలు వనాలతో ముప్పయి శాతమే ఉంది. మిగతా డెబ్బయి శాతం నీరే నీరు. జాతులన్నీ నదీ పరీవాహక ప్రాంతాల్లోనే వికసించాయి. అందువల్ల సరస్వతీ నాగరికత, సింధూ నాగరికత అనే పేర్లు స్థిరపడ్డాయి. పైగా నీటినీ అపహరించే జాతులు తయారయ్యాయి. ఆ కారణంగా కూడా గంగామాతను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. అందుకే ఇంటా బయటా ఎక్కడ స్నానం చేసినా, "గంగేచ యమునేచైవ....." అంటూ నదులన్నింటిని స్మరించుకోడం పరిపాటి అయ్యింది. అన్ని రకాల కర్మకాండల్లో (Rituals) జల తర్పణం, జలమోచనం తప్పనిసరిగా అనుసరించే ఆచారం ఏర్పడింది. గంగామాతను పవిత్రంగా అర్చించడం వెనుక కూడా ఆ తల్లిని అన్ని విధాలా రక్షించాలనే తపనే కనిపిస్తుంది.

ఇక గోవును గోమాతగా భావిస్తాడు హిందువు. మనది వ్యావసాయిక దేశం. అందరికి అన్నం పెట్టే కర్మయోగంలో మనమున్నాం. పాడీ పంటకు గోవృషభ మహిషాలన్నీ కావాలి. వీటిని సాదాలి; అభివృద్ధి పొందేట్టు చేయాలి. కాని మాంసాశనులు తయారయ్యారు.ఏ యజ్ఞాల్లోనూ మనం గోవుల్ని కానీ, అశ్వాల్ని కానీ, మేకల్ని కానీ చంపలేదు. విదేశీ పండితులకు వైదిక సంస్కృతార్థాలు తెలియక, యజ్ఞాల్లో పశువధ ఉన్నట్టుగా అర్థాలు తీసి ప్రచారం చేశారు. వేదం జీవహింసను తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఇందుకు అంతర్గత సాక్ష్యాలు వేదంలోనే ఉన్నాయి. అందుకే మనం గోవును కాపాడాలనే ప్రచారం చేశాం. పైగా మనది గోధర్మం అన్నాం. ఉమామహేశ్వర పండితులు హిందూ శబ్దానికి అర్థం చెబుతూ, హిం అంటే

గోవు అని, దు అంటే ఇచ్చునవి పాలు అనీ. హిందూ అంటే గోవుపాలు అని అన్నారు. గోవు పాలు శక్తినిస్తాయి: జ్ఞానాన్ని ఇస్తాయి. ఈ జ్ఞాన శక్తులతో గోమాతను కాపాడాలని ఎందరో వివరించారు. గోవును కాపాడుకోవడం వల్ల ఉన్న లౌకిక పారమార్థికాంశాల్ని గుర్తించిన మహామహులందరు గోరక్షాదీక్షా కంకణులయ్యారు. పరీక్షిత్తు దగ్గరి నుండి శివాజీ వరకు అందరూ గోమాతను కాపాడిన వారే. వ్యవసాయమే ధ్యేయంగా లేని దేశాల వారి వల్లనే మాంసాశన రాక్షసత్వం ఈ దేశంలో వ్యాపించింది. డబ్బుకూ - పెట్రోలుకూ బానిసలై సంతృప్తీకరణ విధానం అనుసరించే నిర్వీర్య ప్రభుత్వాల్ని బుట్టలో వేసుకొని యంత్రవధశాలలను నిర్మించి రోజూ వేలకొలది గోవులను ఇప్పుడు చంపుతున్నారు. పాశ్చాత్య దేశాలకు మంచు డబ్బాల్లో పెట్టి మాంసాన్ని పంపుతున్నారు. మున్ముందు కేవలం ఆయిల్ యంత్రం మీదనే ఆధారపడి ఈ దేశం వ్యావసాయిక ఉత్పత్తుల్ని ఇంతగా సృష్టిస్తుందా! అన్నపూర్ణగా నిలుస్తుందా!

"ఓం కారమూల మంత్రాఢ్య: - పునర్జన్మ దృఢాశయః।
గోభక్తో భారత గురు : - హిందూ హింసన దూషకః॥"

-అని మాధవ దిగ్విజయమ్ గ్రంథమంటున్నది. హిందువు గోభక్తి ఇవాళ డబ్బుకూ, పెట్రోలుకు, ఓట్ల సంతృప్తికి కుదువ బెట్టబడింది. 'గోభక్త ః శ్రుతిమాతృకః" అని మున్ముందు కూడా చెప్పుకోవాలంటే గోమాత సంరక్షణకు హిందువు పూనుకోకతప్పదు.

భూమాత, గంగామాత, గోమాతల పరిరక్షణమే కాదు, "మాతృవత్ పరదారేషు" - అన్న నియమాన్ని సద్గుణాన్ని అలవరచుకొని మాత నిర్మాతగా భావించి రక్షించాలి: మహిళలు తమను తాము రక్షించుకొనే విధంగా తర్ఫీదునివ్వాలి. పల్లెటూళ్లలో ఆదిశక్తి రూపాలైన మైసమ్మా, ఎల్లమ్మ, గంగమ్మ, మాంకాలమ్మ, పాలేరమ్మ, ఈదమ్మ, చౌడమ్మ దేవతల్ని ఈనాటికీ పూజిస్తుంటారు. ఈ తల్లులందరూ శక్తి దేవతలే - మాతలే. ఈ శక్తులు పుత్రరూపి మానవ సమాజానికి శక్తిని ప్రసాదిస్తాయి. చెడును నిర్మూలించుమంటాయి; మంచిని ప్రస్థాపించుమంటాయి.

దేశంలో భిన్నభాషలున్నా, భిన్న ప్రాంతాలున్నా మాతృశక్తి విషయంలో ఏకత ఉంది. ఇదంతా కలిపి ఈనాడు భారత మాతృశక్తిని సంభావించడం జరుగుతున్నది. ఆ శక్తి నుండి పొందే శక్తితో ఆ మాతను రక్షించే పవిత్ర కర్తవ్యానికి అనుక్షణం మనం సమాయత్తమైనపుడు మనముంటాం: హిందుత్వముంటుంది; హిందూ దేశముంటుంది. మరి మన ఉనికిని నిలుపుకోడానికి మనమందరం మాతృశక్తి పూజారులమవుదాం.

4. ఏకాత్మవాదం సమాదరణీయం

"సాంఘిక హక్కుల విషయంలో మనుధర్మ శాసనాలను మించిన అఘాయిత్యపు దుష్ట శాసనాలు ప్రపంచంలో మరెక్కడా లేవు. ప్రపంచంలో సాంఘిక దురన్యాయాలు ఎక్కడైనా జరిగి ఉంటే, అట్టి ఉదంతాలు ఈ మనుధర్మ శాసనం ముందు గడ్డిపరకలు. అంతటి అప్రతిష్ఠాకరమైనట్టిది మను స్మృతి......"

హిందూ సమాజంలోని అంటరానితనాన్ని కూకటివేళ్లతో పెళ్లగించాలని జీవితాంతం తపించిన మహా మేధావి డా॥ అంబేడ్కర్. స్వామి వివేకానంద, మహర్షిదయానంద, సద్గురు మలయాళస్వామి, స్వాతంత్ర్య వీర సావర్కర్, గాంధీజీ తమ తమ పద్ధతులలో ఈ అంటరానితనాన్ని నిర్మూలించే ప్రయత్నం చేశారు. చాతుర్వర్ణ వ్యవస్థ కారణంగానే కులాలు పెరిగాయనీ, త్రైవర్ణికులు (బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు) శూద్రులను అణగదొక్కారని అంబేడ్కర్ ఆవేదన.

"ఆత్మవత్సర్వభూతాని, మమాత్మా సర్వభూతాత్మా" అని విశ్వసించిన హిందూ జాతి కులాల పట్టింపులతో జీవించడం నిజంగా హేయాతి హేయం. కులాలు వృత్తుల నుండి వచ్చాయన్న సత్యాన్ని విస్మరించి పుట్టుకను కులాల గుర్తుగా భావించే దౌర్భాగ్యం హిందూజాతిని బలహీనంగా తయారు చేసింది.

మనుస్మృతిలో మానవుల మధ్య అసమానతలు సృష్టించే అంశాలనన్నిటిని ప్రక్షిప్తాల క్రింద వదలివేస్తే ఎన్నో మంచి అంశాలు అందులోనూ ఉన్నాయి. ఆయా దేశ కాల పరిస్థితులను బట్టి మనుస్మృతిలో కొన్ని తాత్కాలికాంశాలు (వికృతులు) చొప్పించిన వారున్నారు. వాటిని ఇప్పుడు వదలివేయాలి. అప్పుడందులోని మంచే మనకళ్లకు కనిపిస్తుంది.

"మనిషి మానసికంగా - శారీరకంగా పవిత్రుడు కావాలంటారు మనువు. అలా పవిత్రుడు కావాలంటే అహింస పాటించాలి; మధురంగా భాషించాలి. దు:ఖంలో ఉన్నా ధర్మాన్ని నిందించరాదు. ఇతరులకు ద్రోహాన్ని తలపెట్టరాదు. మద్యమాంసాలను వదలివేయాలి. జూదం ఆడరాదు. అర్థం లేని వాక్కలహాన్ని నివారించాలి. అసత్యం పలకరాదు; పరులను నిందించరాదు. మైథునేచ్ఛతో స్త్రీల వైపు చూడరాదు." - ఈ భావాలన్నీ మనుస్మృతిలోనివి; మూలశ్లోకాలు చూడండి !

అహింసయైవ భూతానాం కార్యం శ్రేయోనుశాసనమ్।
వాక్షైవ మధురా శ్లక్ష్ణా ప్రయోజ్యా ధర్మ మిచ్ఛతా ॥

యస్య వాఙ్మనసీ శుద్ధే సమ్యగ్గుప్తేన సర్వదా।
సవై సర్వ మవాప్నోతి వేదాంతోప గతం ఫలమ్ ॥
వర్జయేన్మధు మాంసంచ గంధం మాల్యం రసాన్ స్త్రియః
ద్యూతంచ జనవాదంచ పరివాదం తథానృతమ్ ॥
స్త్రీణాంచ ప్రేక్షణాలంభ ముపఘాతం పరస్యచ ॥"

మంచి మనిషి నిర్మాణానికి మనువుపైన చెప్పిన భావాలన్నీ ఇవాళ అవసరమే. ఇవి సార్వకాలీనాలు; కాదనే వారెవరు! స్త్రీల విషయంలో మనువు చెప్పిన భావాలు ఏ నాటికైనా శిరోధార్యాలే.

"యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః
యత్రైతాస్తు నపూజ్యంతే సర్వాస్తత్రా ఫలాః క్రియాః॥
శోచంతి జామయో యత్ర వినశ్యత్యాశు తత్కులం।
నశోచంతితు యత్రైతాః వర్ధతే తద్ధి సర్వదా॥
తస్మాదేతాః సదా పూజ్యాః భూషణాచ్ఛాద నాశనైః॥"

స్త్రీలు గౌరవం పొందే స్థలంలో దేవతలు ఆనందంతో నిలుస్తారు. స్త్రీలను అగౌరవ పరచేవారికి ఏ పనులలోనూ మంచిఫలితాలు లభించవు. ఏ స్త్రీలు ఏ వంశంలో దు:ఖిస్తూ ఉంటారో ఆ వంశం నాశనమైపోతుంది. నిజానికి వారి సంతోషమే వంశోన్నతికి మూలం. ఎప్పుడూ వారికి అన్నం - వస్త్రం తదితర సామగ్రి అందే విధంగా వ్యవహరించాలి.

భార్యాభర్తల విషయంలోనూ మనువు చెప్పిన మాట అక్షరసత్యం. వారిరువురు జీవితంలో ఎప్పుడూ సంతుష్టాంత రంగులై ఉండాలట.

"సంతుష్టో భార్యయా భర్తా - భర్త్రా భార్యా తథైవచ।
యస్మిన్నేవకులే నిత్యం - కల్యాణం తత్రవై ధ్రువమ్"॥

భార్యా భర్తలు ఎల్లప్పుడు సంతుష్టులై ఉండాలి. ఆ వంశం కల్యాణకరంగా ఉంటుంది. ఇది నిశ్చయం. గృహస్థ ధర్మం అంటే కుటుంబ ధర్మం అన్నిటికన్నా శ్రేష్ఠమైనదని మనువన్నాడు.

ఇలా ఎన్నో మంచి మాటలు మనువు చెప్పారు. ఇందులో భాగంగానే చాతుర్వర్ణాలను సమర్థించారు. మనువు కన్నా ముందు నుండే ఇవి ఉన్నాయి తప్ప ఆయనే ఈ వర్ణ నిర్మాతకారు.

ఒక విద్యా సంస్థలో ప్రధానాచార్యులు, ఆచార్యులు, కర్మచారులు, గుమస్తాలు, విద్యార్థులు ఉన్నట్లే సమాజంలోనూ మేధాసంపన్నులు (బ్రాహ్మణులు), రక్షకులు (క్షత్రియులు), వైశ్యులు (ఉత్పత్తిదారులు - పంపిణీదారులు) శూద్రులూ (సేవ చేసేవారు) ఉంటారని భారతీయ సమాజం భావించింది. మనువు దాన్ని పునరుక్తం చేశాడంతే. అయితే అటువారిటు, ఇటువారటు పోగూడదన లేదు. తన శక్తి యుక్తులను బట్టి ఎవరు ఏ వర్ణికులైనా కావచ్చు. మనసులు కలసినప్పుడు రక్త సంబంధం ఎవరికి ఎవరితో నన్నా ఏర్పడవచ్చు. హైందవ సమాజానికి మొదటి నుంచి ఇంత స్వేచ్ఛాలోచనే ఉంది.

మధ్యయుగాల్లో కొందరి ఆంక్షల బిగింపుల కారణంగా జాతి వికాసానికి ఆటంకాలేర్పడ్డాయి. కొందరు అణచబడ్డారు; అస్పృశ్యులుగా చూడబడ్డారు. 800 సంవత్సరాల ముస్లింల పరిపాలనలోనూ, 200 సం॥ల బ్రిటిషువారి పరిపాలనలోనూ ఈ అనాచారాలు దూరం తరమలేకపోయారు. పైగా వీటినింకా పెంచి పోషించి, హిందూ సంస్కృతిని మరీ మరీ వక్రీకరించి, ఎందరినో మతం మార్చి తమ సంఖ్య పెంచుకొని దేశాన్ని శాశ్వతకాలాల పాటు తమ గుప్పిట్లో పట్టుకొనే ప్రయత్నమే చేశారు వారు. అందువల్ల వికృతులే స్మృతులని భ్రమపడే పరిస్థితి ఏర్పడింది.

ప్రస్తుత వాస్తవిక దృష్టితో హిందూ సమాజంలోని అందరూ సమానులనీ, ఏకాత్మ సిద్ధాంతం సర్వోన్నతమనీ, ఇప్పుడు అక్కరకురాని ప్రాచీన గ్రంథ గతాంశాలను వదలి వేయాలనీ, వాటిలోని మంచి మాత్రమే మనం గ్రహించాలనీ పదిమందికి చెప్పాలి. మనల్ని మనం తిట్టుకొంటూ కూచునే దౌర్భాగ్యం నుండి బయటపడాలి. సంఘటిత శక్తితో ముందడుగు వేయాలి.

★★★★★

5. ధర్మపాలనే కావాలి

1996 ఏప్రిల్ - మే మాసాల్లో భారతదేశ 11వ లోకసభ ఎన్నికలు జరిగాయి. ఎన్నికలకు ముందు ఈ పర్యాయం ధర్మ బలమున్నవారే పరిపాలనలోకి వస్తారని భగవాన్ సాయిబాబా, శ్రీశ్రీశ్రీ చిన్న జియ్యర్ స్వామి, శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతులవారు అన్నారు. కాని దేశంలోని కొన్ని కులవాద పార్టీలు, కొన్ని నాస్తిక పార్టీలు, కొన్ని విదేశీ ఇజాలను నమ్మి వామపక్షాల లేబిల్లు తాడుక్కున్న వర్గ ద్వేష సిద్ధాంత ప్రేరక పార్టీలు ధర్మ రహిత పరిపాలనే కావాలని మొత్తుకొంటున్నాయి. ధర్మం లేకుండా పరిపాలన చేయడమంటే - అధర్మంతో అనే అర్థం వస్తుందన్న కనీస జ్ఞానం కూడా ఈ అధికారతాపత్రయ వాదులకు లేదు.

ధర్మమంటే ఒక జీవన విధానం. సూర్యుడు, చంద్రుడు, భూమి, ఋతువులు తమ ధర్మాన్ని వీడకుండా వ్యవహరిస్తున్నాయి. మనిషి కూడా అలా వ్యవహరించాలనే ఉద్దేశ్యంతోనే అనేక ధర్మశాస్త్రాలు ఈ దేశంలో పుట్టుకొని వచ్చాయి. అయితే అధర్మంగా నడిచేవారు ఎప్పటికీ పుట్టుకొని వస్తూనే ఉన్నారు. మహాభారత కర్త వేదవ్యాస మహర్షి తన కాలంలోనే ధర్మం తప్పుతూ వ్యవహరిస్తున్న వారిని గుర్తించి ఇలా అన్నారు.

ఊర్ధ్వ బాహు విరౌమ్యేష - నచ కశ్చిత్ శ్రుణోతిమే ।
ధర్మాదర్థశ్చ కామశ్చ - సధర్మః కిం నసేవ్యతే ॥"

నేను రెండు చేతులు పైకెత్తి అరుస్తున్నాను. ధర్మమే అర్థం ఇస్తుందని చెబుతున్నాను. ధర్మమే భోగం సమకూరుస్తుందంటున్నాను. అయినా ధర్మాన్ని గురించి పట్టించుకోరేమిటి! నా మాట వినిపించుకోరేమిటి!

సమాజాన్ని శాసించగల సత్తా ఉన్న మహానుభావులే సమాజ పరివర్తన నిమిత్తం ఇంత తాపత్రయపడుతుంటే, ధర్మాన్ని అనుసరించిన సామాన్యుడెంత బాధపడ్డాడో అర్థం చేసుకోవచ్చు. కనీసం ఆయన అరువనన్నా అరిచారు; నేను మాత్రం ఏమీ చేయలేకపోతున్నా అని సామాన్యుడు కుమిలిపోయి ఉంటాడు. అప్పుడూ ఇప్పుడూ సామాన్యుని స్థితే ఇది.

అయితే సామాన్యుడు సంఘటితుడైతే, అధార్మికులం:కపు తోక ముడుస్తారు. సర్పం సంఘటితమైన చలిచీమలకు లొంగిపోవాల్సిందే. కదా! అందుకే ధర్మానికే ఏనాటికైనా విజయం సిద్ధిస్తుందని గ్రహించాలి.

"ధర్మేణ హీనా: పశుభిస్సమానా:" అని కదా ఆర్యోక్తి. చాణక్యుడిలా అంటాడు.

సుఖస్య మూలం ధర్మః = ధర్మమే సుఖానికి మూలం

ధర్మస్య మూల మర్థః = అర్థం ధర్మానికి మూలం

అర్థస్య మూలం రాజ్యం = రాజ్యం సంపదకు మూలం

రాజ్యస్య మూల మింద్రియజయః = ఇంద్రియజయం రాజ్యానికి మూలం.

ఇంద్రియ జయం కలగాలంటే ధర్మబద్ధుడై వ్యక్తి నడవాలి. అందుకే మన పూర్వీకులు చతుర్విధ పురుషార్థాలను ప్రతిపాదించారు. ధర్మబద్ధమైన అర్థాన్నీ, ధర్మబద్ధమైన కామాన్ని, పొందినప్పుడే బంధాల నుండి మనిషి విముక్తునిగా ఉంటాడు. మోక్ష మంటే ఇదే. ధర్మ వ్యతిరేకమైన ప్రతికార్యం మనిషిని పాపకూపంలోనే పడవేస్తుంది.

సజీవతి గుణోయస్య - ధర్మోయస్య సజీవతి ।
గుణధర్మ విహీనోయః - జీవితం తస్య నిష్ఫలమ్ ॥

- సుగుణుని జీవితమే జీవితం; ధర్మపరుని జీవితమే జీవితం. గుణధర్మాలు లేనివాని జీవితం నిష్ప్రయోజనం.

మనిషిది మనుష్య గుణం, మనిషిది మానవ ధర్మం. మానవధర్మం అతిసనాతనధర్మం. ఈ ధర్మ జీవనమే వేదం చెప్పింది; ఉపనిషత్తులు చెప్పినవి; స్మృతులు చెప్పినవి, దర్శనాలు చెప్పినవి. వీటినే పురాణాలు కథలుగా చెప్పినవి.

వీటన్నింటిలోని నీతులు గ్రహించి మత ప్రక్తలు ప్రచారం చేశారు. సనాతనాన్ని వదలి పెట్టి మత ప్రవక్తల పేరిట మతాన్ని పట్టుకొని కొందరు వారి అనుయాయులయ్యారు. ఇక్కడే కుహనా లౌకిక వాదులు పొరబడి ధర్మం, మతం ఒక్కటనుకొంటున్నారు. మతం వ్యక్తిచెప్పిందనీ, దానిని అనవసరంగా ఈశ్వరునికి అంటగట్టారని గుర్తించలేకపోతున్నారు. మతం వేరు; ధర్మం వేరు.

హిందుత్వం మతం కాదు; అది జీవన విధానం; మానవ ధర్మం; సనాతన ధర్మం.

మత రాజ్యాన్ని ఏ నాడూ హిందువు ఆహ్వానించలేదు. ధర్మ రాజ్యాన్నే హిందువు ఆహ్వానించాడు. క్రైస్తవ - ఇస్లాంలు రెండు మతం పునాదుల మీద నిలబడ్డ రాజ్యాలు. హిందుత్వం ధర్మం పునాదిగా నిలిచింది. ధర్మమే ఆధారంగా లేకపోతే శైవ - వైష్ణవ - సౌర - గాణాపత్య - శాక్తేయ - కాపాలికాది మత రాజ్యాలుగా ఈ దేశం విడిపోయి ఉండేది. ఈ దేశం ధర్మ స్వభావం తెలువక మతవాదం అని అరిచేవారు ఇంకా కళ్లకు గంతలు కట్టుకొన్నారనే గ్రహించాలి. క్రైస్తవ ఇస్లాంలు మతం లేకుండా మనలేవు. హిందుత్వానికి మతంతో సంబంధం లేదు. దేశంతో, సంస్కృతితో, ధర్మంతో, జీవనంతో మాత్రమే సంబంధం ఉంది.

పోనీ, భారత రాజ్యాంగం ప్రకారంగా సెక్యులర్ అంటే ధర్మరహితమని కాదు; సర్వమత సమరసమని అర్థం. ధర్మ పదాన్ని అనవసరంగా భ్రష్ట రాజకీయ వాదులు భ్రష్టు పట్టిస్తున్నారు.

ధర్మముంటే రాజు అక్కరలేదు; రాజ్యానికో పేరు అక్కరలేదు; దండితుడూ లేడు; దండించేవాడు లేడు, ధర్మమే ప్రజలను నిలుపుతుంది; నడుపుతుంది అని ప్రాచీనోక్తి.

అందుకే మన సాధువులు కోరినట్లు, మహాత్ములాదేశించినట్లు మనల్ని ధర్మమే పరిపాలించాలి గాని అవకాశవాదులు, అర్థవాదులు, అధికారవాదులు, భోగవాదులు పరిపాలించరాదు. ఈ దిశలో సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి పూనుకొందాం మరి!

౬. గురుపూజ - గురువు లక్షణాలు

ఆషాఢ పౌర్ణమి నాడు దేశమంతటా గురుపూర్ణిమ నిర్వహించే సంప్రదాయం అనాదిగా కొనసాగుతుంది. వేద వ్యాసులీ పూర్ణిమనాడు జన్మించిన కారణంగా ఈ పూర్ణిమకెంతో ప్రాముఖ్యం వచ్చింది. ఈ రోజే వ్యాస జయంతి, గురుపూజ నిర్వహించుకొనే సంప్రదాయం ఏర్పడింది.

"ఓం గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః - గురుర్దేవో మహేశ్వరః।
గురుస్సాక్షాత్ పరబ్రహ్మః - తస్మై శ్రీ గురవేనమః ॥"

- గురువు బ్రహ్మ; గురువు విష్ణువు; గురువు మహేశ్వరులు; గురువు సాక్షాత్తుగా పరబ్రహ్మ; అలాంటి గురువుకు నమస్కారం.

నీలో మంచిని సృష్టించే గురువు బ్రహ్మ. నీలో మంచిని నిలిపే గురువు విష్ణువు. నీలోని చెడును నాశనం చేసే గురువు మహేశ్వరుడు. ఈత్రిమూర్త్యాత్మకమైన గురువే సాక్షాత్తుగా పరబ్రహ్మ.

గురువును గురించి అనేక గ్రంథాలు లక్షణాలనిచ్చినై. అలాంటి వాటిలో కొన్ని శ్లోకాలను పరిశీలిద్దాం.

"అవిద్యా హృదయ గ్రంథి - బంధమోక్షోభ వేద్యతః
తమేవ గురురిత్యాహు - ర్గురు శబ్దార్థవేదినః॥

- అవిద్యా హృదయ గ్రంథి తొలగించే వారు, బంధమోక్షం కలిగించే వారే గురువు. ఆమహానుభావుడే గురువని గురు శబ్దార్థం తెలిసిన పెద్దలు చెబుతున్నారు.

"గు శబ్ద స్త్వంధకారః స్యాత్ - రుశబ్ద స్తన్నిరోధకః
అంధకార నిరోధిత్వా - ద్గురిత్యభిధీయతే ॥"

- 'గు' అను శబ్దానికి అంధకారమని అర్థం. 'రు' శబ్దం దానిని నాశనం చేసే తేజస్సు. అంధకారమనే అజ్ఞానాన్ని జ్ఞానమనే వెలుగు ద్వారా నిరోధించే వారే గురువు. ఈ విషయాన్ని ఈ క్రింది శ్లోకం ఇంకా బాగా వివరిస్తున్నది.

"గుకారశ్చాంధ కారోహి - రుకార స్తేజ ఉచ్చతే।
అజ్ఞాన గ్రాసకం బ్రహ్మా - గురురేవ న సంశయః॥

అజ్ఞానమనే తమస్సును మ్రింగువారే గురువు. వారే బ్రహ్మం - ఇందులో సంశయం లేదు. నామరూప గుణాతీత బ్రహ్మమును తెలుపు వారే గురువనిఈ క్రింది శ్లోకతాత్పర్యం.

"గుకారశ్చ గుణాతీతో - రూపాతీతో రుకారకః
గుణ రూప విహీనత్వా - ద్గురురిత్యభి ధీయతే॥"

- గుకారం గుణాతీతం; రుకారం రూపాతీతం; నామ రూప గుణ రహిత బ్రహ్మాన్ని తెలుపువారే గురువని అంటారు. మరో శ్లోకం చూడండి!

"చాతుర్యవాన్ వివేకీచ - అధ్యాత్మ జ్ఞానవాన్ శుచిః
మానసం నిర్మలం యస్య - గురుత్వం తస్య శోభతే ॥"

చాతుర్యముండాలి; వివేకముండాలి; అధ్యాత్మ జ్ఞాన సంపన్నుడు కావాలి. బహిరంతర శుద్ధి ఉండాలి. మనస్సు పవిత్రంగా ఉండాలి. అలాంటి వారికే గురుశబ్దం శోభిస్తుంది.

"గురవో నిర్మలాశ్శాంతాః - సాధనో మిత భాషిణః
కామక్రోధ వినిర్ముక్తాః - సదాచారా జితేంద్రియాః॥"

గురువు నిర్మలునిగా, శాంతునిగా, సాధన చతుష్టయ సంపత్తి గలవానిగా, మితభాషిగా ఉండాలి. కామక్రోధాలను వదలిన వారై ఉండాలి. సదాచార ప్రవర్తకులై ఉండాలి. జితేంద్రియులై ఉండాలి. - గురువు విషయంలో ఈ క్రింది శ్లోకార్థాన్నీ గుర్తించండి!

"ఆచార్యో వేద సంపన్నో - విష్ణు భక్తో విమత్సరః।
యోగజ్ఞో యోగనిష్ఠశ్చ - సదాయోగాత్మక శ్శుచిః॥"

- వేద సంపన్నుడై, పరమ భక్తుడై, విమత్సరుడై, యోగజ్ఞుడై, యోగనిష్ఠుడై, సదాయోగాత్మ స్వరూపుడై,. బహిరంతరాలలో శుచిగలవాడై ఆచార్యులుండాలి.

మంచి గురువు దొరకడం శిష్యుల అదృష్టం. మంచి శిష్యుడు దొరకడం కూడా గురువు అదృష్టమే. గురుశిష్యులకు గుర్తుగా రామకృష్ణ వివేకానందులనే చెప్పుకోవాలి.

"అయితే లోకంలో బోధ గురువులకు మారుగా అప్పుడప్పుడు బాధ గురువులూ తటస్థపడతారు. వారు శిష్యహృత్తాపహారకులు కారు; శిష్య విత్తాపహారకులవుతారని అంటారు, సద్గురు మహర్షి మలయాళస్వాముల వారు.

గురవో బహవస్సంతి - శిష్యవిత్తాపహారకాః।
తమేకం దుర్లభం మన్యే - శిష్య హృత్తాప కారకమ్॥"

శిష్యుల ధనాన్ని అపహరించే గురుస్వాములెందరో ఉన్నారు. శిష్యుల హృదయతాపం పోగొట్టే గురువులు దొరకడం కష్టం.

మంచి శిష్యుణ్ణి గురువు అన్వేషించిన విధంగానే, మంచి గురువును శిష్యుడు అన్వేషించాల్సి ఉంది. గురుపూజ సందర్భంగా అందరూ తమ తమ గురువులు చెప్పిన బాటలో నడవాలని దీక్ష తీసుకోవడమేనేడు గురుపూజగా భావించాలి. ●

7. పురుషుడంటే మగవాడు కాడు- ఆత్మ

ఆధునిక కాలంలో "పురుష పదం" ఎడాపెడా వాడబడుతున్నది. లౌకిక ప్రపంచంలో స్త్రీ పురుషులున్నప్పుడు మగవాడనే అర్థంలోనే స్త్రీవాదులు సామాజిక న్యాయం జరగాలని ఉద్యమిస్తున్నారు. అందరూ తమతమ హక్కులూ బాధ్యతలు గుర్తించి ప్రవర్తించాలని బల్లగుద్ది వాదిస్తున్నారు.

"ఆత్మవత్సర్వభూతాని" అన్న సిద్ధాంతాన్ని పాటించకపోతే అన్నీ అనర్థాలే. అసమానతలూ పెరుగుతాయి. మహిళలు వేరే జాతి, మగవారు వేరే జాతి అనే అభిప్రాయాలు నాటుకుపోతాయి. దాని కారణంగా ద్వేషభావాలు విస్తరిస్తాయి. అందుకే పురుష పదాన్ని జాతి వాచకంగా వాడకుండా ఆత్మ వాచకంగా వాడవలసిన అవసరముంది. పురుష సూక్తంలో ఈ పదం దైవ వాచకంగానే వాడడం జరిగింది. భాగవతంలో కూడా ఆత్మార్థంలోనే పురుష పదం కనిపిస్తుంది.

"పాంచ భౌతికమైన భవనంబుదేహంబు,
పురుషుండు దీనిలో పూర్వకర్మ
వశమున నొకవేళ వర్తించు దీపించు,
తరియైన నొక వేళ తలగిపోవు,
చెడునేని దేహంబు చెడు, గాని పురుషుండు
చెడడాతనికినింత చేటు లేదు
పురుషునికిని దేహపుంజంబునకు వేరు,
గాని యేకత్వంబు గానరాదు
దారువుల వెలుంగు దహనునికైవడి
కాయముల చరించు గాలి భంగి
నాళలీనమైన నభము చాడ్పున వేరు
తెలియ వలయు దేహి దేహములకు"

(భాగ, 7వస్కం, 51వ పద్యం)

పృథ్వి. అప్పు (నీరు). తేజస్సు (అగ్ని). వాయువు. ఆకాశాలనే అయిదు భూతాలతో నిర్మితమైన భవనం ఈ దేహం. పురుషుడు (ఆత్మ) దీనిలో తాను పూర్వం చేసుకొన్న కర్మలను బట్టి వర్తిస్తాడు: ప్రకాశిస్తాడు. అది ఏదో ఒక సమయంలో (ఒకవేళ) అలా ఉంటాడు. కాలం సమీపించిన సమయంలో అందులో నుండి తొలగిపోతాడు. చెడితే దేహం చెడుతుంది గాని పురుషుడు (ఆత్మ) చెడిపోడు. (పాడైపోడు, శిథిలమైపోడు). ఆతనికి ఎంత మాత్రం చేటు లేదు. పురుషునికి (ఆత్మకు) దేహ సమూహాలకు భిన్నత్వమున్నది గాని ఏకత్వం కనిపించదు. కట్టెల్లో ప్రకాశించే అగ్నిలాగా శరీరాల్లో చరించే గాలిలాగా ఆత్మ ఉంటుంది. తూడులో (నాళంలో) లీనమై ఉన్న నభంలాగా (శూన్యం వలె) ఆత్మ శరీరం (దేహి దేహం) వేరువేరని గ్రహించాలి.

భవనం శిథిలమవుతుంది: దేహం శిథిలమవుతుంది. ఆత్మ శిథిలం కాదు. ఆ భవన శరీరం నుండి అది వెళ్లిపోతుంది అంతే. అందులోకి రావడానికి కాలం రావాలి; వెళ్లి పోవడానికి కాలం రావాలి. దీనినే కాలధర్మ మంటారు. అయితే కాలధర్మం పదానికి మరణం అనే పదమే రూఢిపడింది. కొన్ని పదాలు వాడుకవల్ల ఇలా రూఢిపడతాయి. పురుష పదం కూడా ఇంతే.

"ఉద్యోగం పురుష లక్షణం" - అనే సామెత విషయంలో కూడా ఇలాగే వక్రభాష్యం జరిగింది. స్త్రీ లక్షణం ఎందుకు కాదు అని ప్రశ్నించేంత వరకు వెళ్లింది. పురుషుడంటే జీవాత్మ అనే అర్థం తీసుకొంటే ఇలాంటి విపరీత వ్యాఖ్యానాలు వచ్చేవి కావు.

ఇప్పటికైనా ముఖ్యంగా వేదాంత విజ్ఞాన ప్రచారంలోనైనా పురుషపదం ఆత్మ వాచకంగా ఉపయోగించాల్సిన అవసరముంది. లేకుంటే ప్రాచీన భాగవతాది గ్రంథాల్లోని వేదాంత విషయాలకు సరియైన అర్థం లభించని పరిస్థితు లేర్పడతాయి.

"చెడునేని దేహంబు చెడుగాని పురుషుండు చెడడు....." అనే భావం ఎంత సరళంగా కూర్చబడిందో చూడండి! **"నైనం ఛిందంతి శస్త్రాణి, నైనం దహతి పావకః"** - (శస్త్రాలు ఛేదించ జాలవు, అగ్ని కాల్చలేదు) అన్న గీతా వాక్యం ఈ సందర్భంలో ఎవరికైనా గుర్తుకువస్తుంది. భగవద్గీతలోని సర్వలక్షణ సూత్రాలకూ సరిపోలిన సంఘటనలు (లక్ష్యాలు) మహాభాగవతంలో

కనిపిస్తాయి. అందుకే భగవద్గీతను లక్షణ శాస్త్రమంటుంటారు; భాగవతాన్ని లక్ష్య గ్రంథ మంటుంటారు.

కట్టెలో అగ్ని ఉంది: అగ్ని కనిపించదు. అవసరమను కొన్నప్పుడే కనిపిస్తుంది. కట్టె వేరు - అగ్ని వేరు. దేహం వేరు - దేహి వేరు. కాయంలో గాలి ఉంది; గాలికీ రూపం ఉందని చెప్పలేం. కాయం వేరు - గాలి వేరు. శరీరం వేరు - ఆత్మ వేరు. నాళంలో ఆకాశం ఉంది. నాళం వేరు: నాభం వేరు; స్థూలం వేరు; సూక్ష్మం వేరు.

కొందరు కట్టెనే అగ్ని అనుకొంటారు; దేహాన్నే దేహి అనుకొంటే తప్పేకదా! అదే విధంగా కాయం గాలి కాదు; నాళం ఆకాశం కాదు.

ఒకటి జగత్తు: మరొకటి బ్రహ్మం
జగత్తేమోమిథ్య: బ్రహ్మమేమో సత్యం
రెండూ ఒకటే అనుకొంటే మిథ్యాజ్ఞానంలో ఉన్నట్లే

అందుకే ఆత్మమయునిగానే ఆపరమాత్మను తెలుసుకోవాలి. ఆ ఆత్మ లేదా ఆ పురుషుడు సర్వశక్తిమంతుడు; సర్వసృష్టి అతని వల్లనే కలుగుతున్నది.

"ఎవ్వడు సృజించు ప్రాణులనెవ్వడు రక్షించు. త్రుంచు నెవ్వడనంతుం
డెవ్వడు. విభుడెవ్వడు వాడివ్విధమున మనుచు పెనుచు హేలారతుడై"

అతడే పురుషుడు; అతడే ఆత్మ. ఈ ఆత్మే ప్రాణం. ఈ ప్రాణమే పరమాత్మ. అంతటా ఆత్మ ఉంది; అంటే అంతటా పరమాత్ముడున్నాడనే అర్థం.

ఇంత విశాలార్థం పురుష పదానికుంది. ఆధ్యాత్మిక శాస్త్రంలోని ఈ పదం ఎంతగా కుంచించుకుపోయిందో గుర్తించి, వేదాంత విజ్ఞానాన్ని ప్రాథమికంగా అధ్యయనం చేసేవారు సరిగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. అప్పుడే ప్రయోగాల్లోని పరమార్థం సుబోధమవుతుంది.

8. వాల్మీకి జయంతి సందేశం

ప్రతి సంవత్సరం ఆశ్వయుజ పౌర్ణమినాడు వాల్మీకి జయంతి దేశంలో నిర్వహించుకొనే సంప్రదాయముంది. ఈ మధ్య వాల్మీకులు (బోయలు, శబరులు) ఊరేగింపులతో ఈ జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

వాల్మీకి అందరివాడు. ఆయన జయంతిని సాహిత్య సాంస్కృతిక సంస్థలు దేశంలోని భిన్న స్థలాల్లో నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా శ్లోక పఠనపోటీలు, రామాయణ పద్య పఠన పోటీలు నిర్వహిస్తున్నారు. సంస్కృత భాషలో రామాయణ ప్రాశస్త్యాన్ని గూర్చి ఉపన్యాసాలిప్పిస్తున్నారు. రామాయణ సందేశాన్ని వాడవాడలో వినిపించే ప్రయత్నం చేస్తున్నారు. వాల్మీకి పటంబెట్టి పూజలూ చేస్తున్నారు. ప్రపంచ భాషల్లో వచ్చిన అనేక రామాయణాల మీద సంస్కృత ఆదికావ్యమైన రామాయణ ప్రభావాన్ని పరిశీలిస్తున్నారు. రామాయణంలోని అనేక అంశాలను జీవితంలోకి తెచ్చుకోవాలని ప్రచారం చేస్తున్నారు.

శ్లో॥ యావత్ స్థాస్యంతి గిరయస్సరితశ్చ మహీతలే,
తావద్రామాయణ కథా లోకేషు ప్రచరిష్యతి ॥

ఈ భూమండలం మీద ఎంత కాలం కొండలుంటాయో, నదులు ప్రవహిస్తుంటాయో అంతకాలం శ్రీమద్రామాయణ కథ లోకంలో ప్రచారంలో ఉంటుంది.

ఇక్కడొక ప్రశ్న! మనదేశంలో దినదినం కుహనా సెక్యూలరిజం పెరిగిపోతున్నది. భారతీయ ధర్మ సిద్ధాంతాలను విశ్వసించిన వారిని మతోన్మాదులనే ముద్ర వేసి అవమానిస్తున్నారు. విదేశీ ఇజాలకూ మతాలకూ తందాన తాన అంటూ వారి ఓట్ల కొరకు నీచాతి నీచంగా వ్యవహరిస్తూ, మెజారిటీ ప్రజానీకమైన హిందువుల మనోభావాలను కాలరాస్తూ, అయోధ్యలో శ్రీరామ చంద్ర ప్రభువు ఆలయ నిర్మాణానికే అనేకాటంకాలు కల్పిస్తూ అర్థం - అధికారం, భోగం అనే ఈ మూడింటికే నిత్యార్చనలు కొనసాగిస్తూ, నీచ రాజకీయాలు నడిపేవారున్న ఈ దేశంలో శ్రీమద్రామాయణ కథ శాశ్వతంగా ఉంటుందా!

అంటే ఉంటుంది!

ఎలా !

వాల్మీకి రామాయణంలోని పై శ్లోకం భూమండలాన్ని గూర్చి చెప్పింది; కొండలను గూర్చి చెప్పింది: ఈ కుహనా సెక్యులరిస్టుల గూర్చి చెప్పలేదు. అవి ఎప్పటికీ ఉంటాయి. కాబట్టి ఈ శ్రీమద్రామాయణ కథ ఎప్పటికీ ఉంటుంది. మరి విదేశీ అక్రమ దురాక్రమణ

దుష్టులు ఈ భారత భూమండలాన్ని, ఈ కొండల్ని, ఈ నదుల్ని, నమిలేస్తే - మింగేస్తే - త్రాగేస్తే అప్పుడు కూడా ఉంటుందా! దీనికి సమాధానం మీరే చెప్పుకోండి.

సార్వకాలికం - సార్వజనీనం శాశ్వతమైన ఆది కావ్య మహాగ్రంథాన్ని ప్రపంచానికి అందించిన వాల్మీకి జీవన మహా ప్రస్థానాన్ని ఒక్కసారి అధ్యయనం చేయండి!

ఎక్కడి రత్నాకర చోరుడు!

ఎక్కడి వాల్మీకి మహర్షి !

దారులు కొట్టే దొంగ, దారులు చూపే మహర్షి ఎలా అయ్యాడు? భోగి కూడా యోగి కాగలడనీ, కాముడు కూడా రాముడు కాగలడని భారతీయ సంస్కృతి నిరూపించినట్లే కదా!

అది మహారణ్యం. ఆ అరణ్యంలో రత్నాకరుడనే బోయవాడు. అడవిలో ఆ కులలాలు తింటూ, వెటాడుతూ లభించిన దాన్ని ఆహారంగా స్వీకరిస్తూ కాలం గడిపే అతనికి భార్యాబిడ్డల పోషణ భారమై దొంగతనాలకు మరిగాడు.

కండబలమున్నది: గుండె బలమున్నది. చేతిలో విల్లమ్ములున్నాయి. దారిన వెళ్లే వారిని దోస్తున్నాడు. వారి దగ్గర దొరికిన దానితో ఇల్లు నడుపుతున్నాడు. ఇలా జీవితం నడుస్తున్నది. ఏండ్లూ పూండ్లూ గడిచిపోయినై.

ఒకరోజు సప్తర్షులు ఆ మహారణ్య పథంలో నడుస్తూ వస్తున్నారు. భీకరంగా అరుస్తూ వారి ముందుకు దూకాడు రత్నాకరుడు. వారి దగ్గర ఉన్నవన్నీ ఇచ్చి వేయుమన్నాడు. వారి దగ్గరేమున్నాయి.... కట్టుకున్న నారచీరలూ కమండలోదకాలు తప్ప !

అయితే వారు రత్నాకరుణ్ణి నివారించి నిలిపి ఒక ప్రశ్న వేశారు.

'నాయనా! రత్నాకరా! నీవు దొంగతనాలు చేసి ఇతరులను బాధిస్తున్నావు. ఇది పాపం.... మహాపాపం. ఈ పాపపు సొమ్ము నీవొక్కడవే తినడం లేదు. నీతో పాటు నీ భార్యాబిడ్డలు కూడా తింటున్నారు. నీవు తెచ్చిచ్చిన సొమ్ములో ఆహారంలో వారు భాగస్వామ్యం స్వీకరిస్తున్నట్లే నీవు చేస్తున్న ఈ పాపాన్ని కూడా పంచుకొంటారేమో అడిగిరా' అన్నారు.

"పాపాన్ని పంచుకోడమా" ఆశ్చర్యంతో చూశాడు రత్నాకరుడు.

"అవును నాయనా! నీవు లోకం నడవడికి భిన్నంగా నడుస్తున్నావు. లోకం నడవడి అంటే ఎవరి వృత్తి ధర్మాన్ని వారు నిర్వర్తించాలి. అంటే ఎవరు ఏ పనిని ఎన్నుకొంటారో ఆ పనిని తప్పకుండా చేయాలి. ఆ పని వల్ల ఉత్పత్తి వస్తుంది. ఉత్పత్తి అంటే పని వల్ల వచ్చిన ఫలితమన్నమాట!

ఆ ఫలితాన్ని మాత్రమే స్వీకరించాలి. అదే సంపాదన. ఆ సంపాదన కష్టించినవాడు తింటాడు: అతని మీద ఆధారపడిన ముసలి తల్లిదండ్రులు తింటారు: చిన్న పిల్లలు తింటారు. భార్య కూడా తాను సంపాదించవచ్చు: లేదా వృద్ధులైన అత్తమామలను, తన చిన్న పిల్లలను చూచుకోవచ్చు. అది ప్రేమతో కూడిన సేవాధర్మం. అయితే ఆమె కూడా శ్రమచేస్తున్నదనే భావించాలి. ఆ శ్రమకు ఫలితం రాకపోవచ్చు. సేవాధర్మం చాలా గొప్పది. ఆ గొప్ప ధర్మం నిర్వర్తించే వారికి అన్నం పెట్టడం పనిచేసేవారి కనీస కర్తవ్యం కూడా.

అందువల్ల నీవు సంపాదించిన ధనాన్ని ఆమె అనుభవిస్తున్నది: నీ పిల్లలూ అనుభవిస్తున్నారు. నీవేమి పాపం చేసి సంపాదిస్తున్నావు.

నీ సంపాదనలో భాగం అనుభవిస్తున్నట్లే నీ భార్యా పిల్లలు నీ పాపంలో కూడా భాగం అనుభవిస్తారా!

"ఇదీ మా ప్రశ్న" అన్నారు సప్తర్షులు.

"నేనిప్పుడే ఇంటికి వెళ్లి అడిగివస్తా" అన్నాడు రత్నాకరుడు.

కాని తాను వచ్చేవరకు ఈ సప్తర్షులుంటారా! వారెక్కడికైనా పారిపోతే అనుకొన్నాడు. అందుకే ఆ ఏడుగురిని చెట్లకు కట్టివేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఇంటిదగ్గరున్న భార్యనూ పిల్లలనూ అడిగాడు.

"నేను దొంగతనం చేస్తున్నాను. సొమ్ము తెస్తున్నాను. అది పాపపు సొమ్ము. ఆ సొమ్ము మీరు తింటున్నారు. దొంగతనం నేను చేస్తున్నారు. కాబట్టి నాకు పాపం తగులుతుంది తప్పదు! మరి ఆ పాపపు సొమ్ము తింటున్న మీరు కూడా నా పాపంలో సగం గానీ కొంతగాని అనుభవిస్తారా లేదా".

ఇదీ అతను తన భార్యా పిల్లల నడిగిన ప్రశ్న.

అప్పుడు వారేమన్నారో చూడండి!

"అయ్యా! నీవు సొమ్ముదారులు కొట్టి తెస్తున్నావో! ధర్మంగా తెస్తున్నావో! దానం గ్రహించి తెస్తున్నావో! కష్టపడి తెస్తున్నావో మాకు తెలువదు. తినడమే మా వంతు గానీ నీ పాపంలో సగం మేం తీసుకోలేం...." అన్నారు వారు కచ్చితంగా.

అయితే తానీ పాపం చేస్తున్నది ఎవరి కొరకు! (లంచాలు తీసుకొన్నవారు, వ్యాపారంలో మోసాలు చేసినవారు, కంట్రాక్టు పనిని కల్తీ చేసిన వారు, తన లాభం కొరకు

దేశాన్ని చివరకు తల్లినైనా అమ్మేవారు, వ్యభిచార గృహాలు, జూద గృహాలు నడిపేవారు అందరూ ఈ ప్రశ్న వేసుకోండి!!)

ఈ సంపాదన ఎవరి కొరకు! ఈ పాపం ఎవరి కొరకు! ఆలోచిస్తూ సప్తర్షుల సన్నిధికి చేరాడు రత్నాకరుడు.

వారికట్లు విడిచాడు. అందరికీ పాదప్రణామం చేశాడు.

రత్నాకరునిలో ఈ పరివర్తననే వారు ఆశించింది! వారు అతనికి రామ నామ తారక మంత్రోపదేశం చేశారు. (శ్రీరామ కోటి జపయజ్ఞం నిర్వహించే మన ఆశ్రమం కోటానుకోట్ల మందికి ఈ మంత్రమే చెబుతున్నది).

రామ నామమూ రత్నాకరుని నోట పట్టకున్నది; నాలిక తిరుగకున్నది.

రెండు మఱ్ఱి చెట్ల మధ్య రత్నాకరుణ్ణి కూచో బెట్టారు సప్తర్షులు. "ఆ మఱ్ఱి మఱ్ఱి" అని జపించుమన్నారు, వెళ్లిపోయారు.

రత్నాకరుడు "ఆ మఱ్ఱి మఱ్ఱి" అనిజపించడం ప్రారంభించాడు. అదే "రామ - రామ"గా పరివర్తన చెందింది. ఆ రామనామ జపం కోటానుకోట్లుగా దాటిపోయింది. రత్నాకరుని చుట్టూరా వల్మీకాలు పెరిగాయి. ఆ పుట్టల్లో (ఆ వల్మీకాల్లో) ఆయన మునిగిపోయారు.కాలం ప్రసన్నమయింది. నారదాగమనం జరిగింది. వల్మీకం నుండి వాల్మీకి బయటపడ్డారు. రాముని గుణ గుణాలు విన్నారు. బ్రహ్మ సాక్షాత్కరించారు. సరస్వతీ దేవీ సాక్షాత్కరించింది. వేద విజ్ఞానమంతా ఆయన మనోఫలకం మీద రామాయణ రూపంలో ముద్రితమయ్యింది.

ఆ మహర్షి తమసానదీ (చీకటినది, తామస మనే నది) తీరానికి వచ్చారు. వెంబడి శిష్యులున్నారు. అక్కడొక సంఘటన జరిగింది. ఓనిషాదుడు క్రౌంచ పక్షుల జంటల్లో మగపక్షిని కొట్టిచంపాడు. ఆడ పక్షి భర్త రక్తం మడుగులో విల విలకొట్టుకొని ప్రాణాలు విడిచింది. ఇదంతా క్షణాల మీద జరిగింది.

ఏం జరిగింది !

ఎందుకు జరిగింది!

ఎట్లా జరిగింది!

తప్పెవరిది! కిరాతునిది!

అధర్మం ఎవరు చేశారు! కిరాతుడు!

తన తిండికొరకు మరో ప్రాణిని చంపవచ్చునా!

చంపరాదు!

తన భోగ సౌఖ్యాల కొరకు మరొకరి భార్యను అపహరించవచ్చునా! - అపహరించరాదు!

చంపితే ఏమవుతుంది!

అపహరిస్తే ఏమవుతుంది!

అధర్మం తాండవిస్తుంది!

అశాంతి ప్రళయ నృత్యం చేస్తుంది!

అక్రమం - అన్యాయం జడలు విరబోసి ఆడుతాయి.

ఏమిటీదంతా! విధి ధర్మం ఎందుకు తారుమారవుతుంది! ఎవరి వల్ల తారుమారవుతుంది!

ఆ తారుమారు చేసే భోగి, రోగి, అధికారదాహి శిక్షార్హుడు అవుతాడు కదా!

అవును అవుతాడు! అందుకే రామాయణం అవతరించింది. అందుకే వాల్మీకి జయంతి నిర్వహించుకొంటున్నాం. రామాయణ మహాధర్మం గురించి చెప్పుకొంటున్నాం.

మానిషాద! ప్రతిష్ఠాంత్వ మగమశ్శాశ్వతీస్సమాః।
యత్క్రౌంచ మిథునాదేక మవధీః కామమోహితమ్॥

ఓరీకిరాతా! క్రౌంచ పక్షుల జంట కామపరవశమై ఉన్నది. అందులో ఒక (మగ) పక్షిని చంపితివి కదా! నీవు శాశ్వత కాలాలపాటు జీవింపకుందువు గాక!

ఇది శాపం!

ఇది ధర్మం!

ఇది న్యాయం!

ఇదే "లోకాస్సమస్తా స్సుఖినోభవంతు" అంటూ ఆదేశిస్తున్న శాసనం.

ఇదే వాల్మీకి జయంతి సందేశం.

++++++

9. భారతీయ చైతన్యాత్మ శ్రీ అరవిందులు

(15వ ఆగష్టు శ్రీ అరవిందుల జయంతి)

విప్లవ యోగి శ్రీ అరవిందులు భారత దేశ అఖండత్వాన్ని దర్శించిన క్రాంతదర్శి. ఆ మహర్షి 1872 ఆగష్టు, 15వ తేదీన కలకత్తాలో జన్మించారు. ఆ రోజే భారతదేశం స్వాతంత్ర్యాన్ని సాధించడం విధి నిర్ణయం - యాదృచ్ఛికం అని కొందరు భావిస్తే, అరవిందుల ఆదర్శానికి సాకారరూపం ఇవ్వడానికే ఆరోజు స్వాతంత్ర్యం వచ్చిందని మరికొందరు భావిస్తారు.

అరవిందుల ప్రవచనాలు, వ్యాసాలు, కవితలు అన్నీ ఇరవై పైచిలుకు సంపుటాలుగా వచ్చినై. ఆయన దర్శించిన అఖండ భారత స్వరూపాన్ని తొలగించి, ఆ గ్రంథాలు ముద్రించాలని కుహనా సెక్యులరిస్టు ప్రభుత్వాలు ప్రయత్నించినప్పుడు, అరవిందాశ్రమంవారు, ముఖ్యంగా శ్రీమాత, అరవిందుని అనుయాయులు తీవ్రంగా వ్యతిరేకించారు. అరవిందుల ఆత్మకు ద్రోహం చేసే సెక్యులరిజం బురఖా కప్పుకొన్న పిరికి ప్రభుత్వం సహాయం మాకు అక్కర లేదని త్రిప్పికొట్టారు.

అరవిందులు జాతీయ మహోద్యమంలో పాల్గొని ఉద్వేగభరితమూ. సంయమ సంశీలమూ అయిన ఉపన్యాసాలివ్వడమే కాకుండా, భౌతికాధ్యాత్మికతలకు అనుసంధానం చేస్తూ అనేక గ్రంథాలు వ్రాశారు. అంతేకాకుండా వందేమాతరం, కర్మయోగి, ఆర్య పత్రికల ద్వారా (ఇందులో రెండు అరవిందులు స్థాపించినవే) తమ భావాలు దేశమంతటా వ్యాప్తమయ్యేట్లు వ్యవహరించారు.

అలీపూరు బాంబు కుట్ర కేసులో బ్రిటిషు ప్రభుత్వం అరవిందుణ్ణి ఇరికించింది. ఉగ్ర జాతీయవాదులైన యువకులు బాంబు విసరి 'కింగ్సు ఫోర్డు'ను చంపాలనుకొని పొరపాటున కెనెడీ దంపతులను చంపారు. అరవిందుని తమ్ముడు వారీంద్రుడే ఈ పని చేశాడని బ్రిటిషువారి విశ్వాసం. వారీంద్రుడు దొరకలేదు. అరవిందులను పట్టుకొని నేరం మోపారు. 1908 మే నెల 2వ తేదీన జైలుకు తీసుకువెళ్లారు. 1909 మే 5వ తేదీన నిర్దోషిగా వెలుపలికి వచ్చారు. జైలులో వారికి శ్రీకృష్ణ సందర్శనం జరిగింది. అష్టాదశ యోగ సంభరితమైన భగవద్గీతానంతరం పూర్ణయోగంవైపుగా మానవుడు ప్రగమించాలని ఈ

కారణంగానే అరవిందులు ఆశించి అపూర్వా ధ్యాత్మికాంశాలను ప్రపంచం ముందుంచారు. ప్రపంచ సృష్టి క్రమాన్ని వివరించారు. బ్రహ్మ సత్యమే కాక జగత్తు కూడా సత్యమే అన్నారు. చైతన్యం అంతటా ఉన్నప్పుడు సత్యం అంతటా ఉంటుందని నిరూపించారు. ఏకమగు బ్రహ్మం నుండే సర్వమూ వెలువడిందని అన్నారు. ఈ పరిణామమే ఈ మహద్విశ్వం అన్నారు. పరిణామ మింకా తుది ఘట్టానికి చేరలేదన్నారు. చేతనాభివృద్ధితో పరిణామ వేగం పెరుగుతున్నదన్నారు.

"అన్నిటికీ మూలం ఆత్మ అని భావించి భగవంతుణ్ణి ఓ మూలకు త్రోసి వేయకండి. నీ స్థానమదే మిగతా జీవనమంతా మాదే అని ఏమరపాటు పడకండి. మన సమస్తం అంటే ఈమనః ప్రాణ శరీరములనన్నిటినీ ఆయనకే అర్పితం చేయాలి. ఆత్మను చైత్య పురుషాధీనతకు తేవాలి. ప్రప్రథమంలో చైత్య పరివర్తనం చేయాలి. ఆ తర్వాత మనః ప్రాణ శరీరాల్లో వివిధ దివ్యశక్తులను తమ తమ సంపత్తి ప్రభావాల్ని నెలకొల్పాలి. అవి విస్తృతం చేసే ప్రయత్నం చేయాలి. ఇదే అధ్మాత్మిక పరివర్తనం. ఆధ్మాత్మిక పరివర్తనం పూర్ణమవుతున్నా కొద్దీ జ్ఞానతేజానందశక్తికి సంబంధించిన ప్రత్యక్ష ప్రవర్తనం మనః ప్రాణ శరీరాల్లో ప్రతిష్ఠితమవుతుంది. ఇదే విజ్ఞాన పరమనోపరివర్తనం. ఈ పరివర్తనం పూర్తి అయినా కొద్దీ మనలను ఎదుర్కొంటున్న గడ్డు సమస్యల్ని పరిష్కరించే మార్గం సుశోభితమవుతుంది. జాతి జీవనాన్ని సంస్కరించటం సులభ సాధ్యమవుతుంది."

స్వామి వివేకానందులు "ముక్తి ముక్తి ఆధ్మాత్మికశక్తి" అంటూ జాతిని దేశ స్వాతంత్ర్యం వైపు ఆలోచించే విధంగా ఎలా పునాదులు వేయగలిగారో శ్రీ అరవిందులు ఇంకా లోతుల్లోకి వెళ్లి కూటస్థం నుండి సహస్రారం వైపుగా జీవునిలోని ఆత్మశక్తిని యోగ మార్గంలో పయనింపజేసే దివ్య సందేశాల నందించారు. శ్రీ అరవిందులు తమ యోగం వినూత్నమైంది కాదన్నా వారు మాత్రం వినూత్నంగానే చెప్పారు. మూలతత్వాన్ని నవీన యుగానుగుణంగా అన్వయం చేసి భారత స్వాతంత్ర్యాన్ని, జాతి ముక్తిని, అఖండత్వాన్ని ఆశించిన మహావిప్లవ యోగి శ్రీ అరవిందులు.

వారు ఉన్న కాలంలోనూ, వారి తర్వాతి కాలంలోనూ వారి మార్గాన్ని విస్తృతపరచిన శ్రీమాత శ్రీ అరవిందుల గురించి ఇలా అన్నారు.

"ప్రపంచ చరిత్రలో శ్రీ అరవిందులు ఒక క్రొత్త సిద్ధాంతాన్ని బోధించడానికి రాలేదు. ఒక దివ్య ప్రకాశతత్వాన్ని చాటడానికి కాని అవతరించలేదు. వారి జన్మ పరిణామ క్రమంలో దివ్య మానవా విష్కారానికై పరమాత్మ తనంతకు తాను చేపట్టిన ఒకానొక నిశ్చిత క్రియారూపం మాత్రమే.

పూర్వమున్న తెగలకు పోటీగా వారు అవతరించలేదు. పూర్వమున్న ఉపదేశాలకు స్పర్థగా నూతన ఉపదేశాలు సృష్టించడానికి వారు రాలేదు. గతాన్ని దాటడానికి ఓ పద్ధతిని సూచించారు అంతే. అంతేకాదు ఆవశ్యకమైన సమీప ఉజ్జ్వల భవిష్యత్తుకు మార్గాన్ని సుస్పష్టంగా చూపించడానికే వారు అవతరించారు".

శ్రీమాత పలికిన ప్రతి పలుకు అక్షర సత్యంగా విశ్వసించే వారున్నారు. అరవిందుల ప్రతిపాదన, లోని వెలుగు చూడమనే. లోని వెలుగు చూడంది లోకం ఎలా తెలుస్తుంది! సృష్టిలోని వ్యష్టి, సమష్టి మీదుగా పరమేష్ఠి వైపు పయనం చేయాలంటారు. శ్రీ అరవిందులు. వ్యష్టిలోని మృగాన్ని అంతం చేయాలి. సమష్టిలోని శక్తితో పుంజుకోవాలి. దుర్గుణాల్ని సాత్త్వికశక్తితో అణచివేస్తూ పరమేష్ఠి వైపు పురోగమించాలి. మానవుడు మృగం వైపుగా పతనం చెందకుండా దివ్య మానవుని వైపుగా పురోగమించాలి.

ఒకవైపు దేశ స్వాతంత్ర్య తపన; మరోవైపు జాతి వికాసం; ఇంకొక వైపు వ్యక్తి సంస్కారం - వారి జీవితమంతా ఇలా ముప్పేటగా అల్లుకొని ముందుకు సాగింది.

భారతీయత లుప్తమైపోయిన దేశ స్వాతంత్ర్యాన్ని మాత్రమే వారు చూడగలిగారు. ఇక జాతి వికాసం, వ్యక్తి సంస్కారం ఎంత - ఏ దిశలో జరిగింది - జరుగుతున్నది మన కళ్ల ముందున్నది. నైతికత - ఆధ్మాత్మికత దిన దినమూ బలహీనమైపోతున్న ఈ దిశలో - ఈ దశలో శ్రీ అరవిందుల భవిష్య దర్శనం సాకారం కావాలంటే, వ్యక్తి ఏం చేయాలి! సమాజం ఏం చేయాలి! జాతి ఏం చేయాలి - అందరూ ఆలోచించాలి; అనుష్ఠించడానికి వజ్ర సంకల్పశక్తితో క్రియాశీలురు కావాలి.

10. మనస్సు రోగం

జన వ్యవహారంలో "మన్సురోగం" అని ఒక మాట ఉంది. ఒక పని చేయడానికి శక్తి ఉండి కూడా ఇష్టపడక పోవడమే మనస్సు రోగం.

మనస్సు మనస్సుగా ఉండక మనస్సుకోరోగం పట్టుకొంటుందన్న మాట. ఈ మనసు రోగానికి కారణాలేమిటి?

ఒక చెట్టుంది; దానికి చీడపీడ తగులుతుంది: అలా తగలాలని చెట్టుకోరుకోదు. చెట్టుకు కూడా మనస్సుంది. తాను వెచ్చగా పచ్చగా ఉండాలనే చెట్టు మనస్సు కోరుకొంటుంది.

కాని ప్రకృతి ఒకటుంది. అది తన ప్రభావాన్ని చూపిస్తుంది. నీళ్లం దివ్వదు; సారం అందివ్వదు; ఎండ తీవ్రత హెచ్చెరుగుతుంది. లేదా ఒకటే అతివృష్టితో తన ప్రతాపాన్ని ప్రదర్శిస్తుంది. దీంతో చెట్టు సంచలిస్తుంది. అది క్రుంగిపోతుంది. దాని పూత సరిగారాదు: కాత రాదు: పండు పండదు; చెట్టు ఎండిపోతుంది.

బాహ్య పరిస్థితుల వల్ల ఏర్పడ్డదిందంతా. ఆంతరికంగా చెట్టుకు పూయాలనే ఉంది; కాయాలనే ఉంది; పదిమందికి ఉపకరించాలనే ఉంది. ఈ ఉపకారగుణానికి తగిన దోహదక్రియలు ప్రకృతి చేయాలి. మనిషి చేయాలి.

ఒక దున్నపోతుంది. అది బాగానే తింటుంది. బాగానే ఉంటుంది. కాడి మెడ మీద పెట్టిన వెంటనే పంతుంది. వ్యవసాయదారుడు దబా దిబా బాదుతాడు. ఆభయంతో నాగలి లాగుతుంది; బండి లాగుతుంది. అది బుజ్జగిస్తే వినవే వినదు. మన్సు రోగం గొడ్డంటారు దీన్నే. అయితే ఒక్క దెబ్బ వేసిన వెంటనే కర్మరంగంలోకి దూకుతుంది.

దీన్ని బట్టే "మంచి గొడ్డుకో దెబ్బ - మంచి మన్షికోమాట" అనే సామెత పుట్టింది.

అయితే కొన్ని ఎద్దులూ, దున్నపోతులుంటాయి. అవి మేత సరిగా మేయవు. బక్క చిక్కి ఉంటాయి. పని నిజంగానే చేత కాదు. శరీరంలో సత్తు వున్నప్పుడు చాలా పని చేశాయి. ఇప్పటికీ కాడి మెడ మీద పెట్టంగానే శక్తి కొద్దీ లాగుతాయి. చేతకాక ఒకోసారి నిలబడతాయి. వగరుస్తాయి.

వాటి మనస్సులో పని చేయాలనే ఉంది.కర్మ యోగంలోనే జీవితాన్ని కడతేర్చాలని ఉంది. కాని వాటి భౌతిక శరీరం సహకరించడం లేదు. ఇలాంటి పశువును చూచి వ్యవసాయదారుడు కరగిపోతాడు. నిజంగా అవి నిష్కామ కర్మయోగంలో ఉన్నాయి. జీవితం చరమ దశలో కూడా పని చేస్తూనే వెళ్లిపోతాయి అని వాటితో మమైక్యం చెందుతాడు. తన కంటే భిన్నంగా వాటిని చూడడు.

మనుషుల్లోనూ చేతనయిన వాళ్లూ, చేతకాని వాళ్లూ, మనసు రోగమున్న వాళ్లూ ఉంటారు. మొదటి ఇద్దరి సంగతి సూటిగానే ఉంది. కాని మనసు రోగంవాడి సంగతి! అతనికి చేత నవుతుంది. కానీ చేతకానట్టు నటిస్తాడు; అబ్బ! అమ్మ! అయ్య! అంటాడు; మూల్గుతూ ముక్కుతూ పడుకొంటాడు. తిండికి బండికడతాడు.

మరొకడుంటాడు; అతనికి చేతనవుతుంది; కాని శరీరం కష్టపడడం ఇష్టం లేదు. అయితే పది మంది ముందు పని చేసినట్లు నటించాలని ఉంటుంది. కష్టపడడానికి మారుగా ఆర్భాటం అధికం జేస్తాడు. అంగచాలనం జాస్తి, అరుపులు జాస్తి, పని మాత్రం నాస్తి.

ఒక పెద్ద మనిషి చెప్పగా విన్నాను. ఆ ఊళ్లో కొమ్ము కాశయ్య అని ఒకరున్నారు. ఊపిరిబిగబట్టి అందరికన్నా ఎక్కువ సేపు కొమ్ము ఊదడంలో అతనే ఫస్ట్ అని ఆ ఊరి వారందరూ అనుకొంటారు. అలా అనుకోడానికి కారణమేంటా అని ఈ పెద్ద మనిషి పరిశీలించారు.

ఓ పండుగనాడు పదిమంది కొమ్ములూదుతున్నారు. ఆ పండుగను హిందువులు సామూహికంగా జరుపుకొంటారు, అప్పటికీ పది పర్యాయాలు కొమ్ము ఊదినా అందరి తర్వాత చివర మరికొంత సేపు కొమ్ము ఊదిన కీర్తి కాశయ్యకే దక్కింది.

అతను అందరితో పాటు కొమ్ము ఊదినట్టు నటిస్తున్నాడు. అందరూ అలసిపోయి ఆపే సందర్భంలో తాను ఊదడం ప్రారంభించి - చివరలో ఒక్కడే ఎంతసేపు ఊదాడు అన్న కీర్తి కొట్టేస్తున్నాడు.

ఇది పరిశీలించిన పెద్ద మనిషి కాశయ్యను పిలిచి అడిగాడు. కాశయ్య మొదట ఒప్పుకోలేదు. ఒక్కొక్కరి మధ్య పోటీ పెడతానన్నాడు పెద్ద మనిషి. కాశయ్య అదిరిపోయాడు. తలవంచుకొని అసలు సంగతి ఒప్పేసుకొన్నాడు.

పదిమంది పాలేటి కాళ్లు కలిసి ఓ భూమిని దున్నుతున్నారనుకోండి! అందులో ఒకడు నాగలి మేడి గట్టిగా అణగబట్టడు. అణగబట్టినట్టు నటిస్తాడు. చాలు విడవడు; తన ఎద్దులకు కష్టం కలిగించడానికి ఇష్టపడడు.

'నలుగుట్లో నారాయణ - గుంపులో గోవిందా' అన్నట్లు వ్యవహరిస్తుంటాడు. ఇతను పదిమందిలో పనిచేయక ఒంటరిగా పని చేస్తున్నాడనుకోండి! అప్పుడు చాలా కష్ట పడతాడు. ఇదంతా మనసు రోగం వల్ల జరుగుతున్నదే!

హిందూ సమష్టి కుటుంబాల్లో కొందరు మనసు రోగమున్న కోడళ్ల వల్ల కుటుంబ జీవనం నరకంగా మారిపోయిన నిదర్శనాలున్నాయి. ఓ జానపద గీతం ఇలా ఉంది.

"ఏరేరు సంసార మేనాడు మొగడో
ఏకూలు మాలెస్స వడికింతునా
మర్రికాడి సెల్క మన సేతికేవస్తె
మక్కజొన్నేయించి మంచె మీన కూసోని
మరికొన్ని పుట్లనే పండించనా!"

వెయ్యేళ్లున్నావేరు దప్పదు; ఎవరి పనివారు చేయాలి; ఎంత శక్తో అంత పనిచేయాలి.

శక్తి ఉండి పని చేయక పోవడానికి మనసు రోగం కారణమైతే, శక్తి లేకున్నా పని చేస్తుండడానికి మనసు సుఖమే కారణమవుతుంది.

సుఖకరమైన ఆలోచనలు మనస్సులో నాటుకొనే పద్ధతులను అనుసరించాలి. అందుకు స్వాధ్యాయాన్ని, సత్సంగాన్ని అమలులో పెట్టాలి. మనస్సులోని రోగాన్ని బయటికి నెట్టాలి. దాని నిండా సత్య శివ సౌందర్యాత్మకమైన ఆలోచనలే నింపాలి.

II. శ్రేయస్సు - ప్రేయస్సు

కఠోపనిషత్తులో శ్రేయస్సు - ప్రేయస్సుకు సంబంధించి విపుల వ్యాఖ్యాన సాపేక్షకాలై మంత్రాలున్నాయి. ఏది శ్రేయస్సో ఏది ప్రేయస్సో నచికేతునికి యముడు వివరిస్తాడు.

అన్యచ్ఛ్రేయోఽన్య దుతైవ ప్రేయ
స్తే ఉభే నానార్థే పురుషగ్ం సినీతః
తయోః శ్రేయ ఆదదానస్య సాధుభవతి
హీయతే ఽర్థాద్ య ఉ ప్రేయో వృణీతే

- శ్రేయస్సు వేరు ప్రేయస్సు వేరు. ఈ రెండింటికి భిన్న ప్రయోజనాలున్నాయి. ఈ రెండూ మనిషిని బంధిస్తాయి. వీటిలో శ్రేయస్సును గ్రహించిన వ్యక్తికి మేలు కలుగుతుంది. ప్రేయస్సును వరించిన వ్యక్తికి ప్రయోజనం సిద్ధిస్తుందిగాని, అతను భ్రష్టుడే అవుతాడు.

ఈ శ్లోకం చెప్పక పూర్వమే యముడు నచికేతునికి నానావిధాలైన సిరిసంపదల నిస్తానన్నాడు. లోభాన్ని కలిగించే యత్నం కూడా చేశాడు. నచికేతుడు ఆ ప్రలోభాల్లో పడలేదు. మరణానంతర విషయమే తనకు బోధించాలని ప్రార్థించాడు. ఆధ్యాత్మిక విషయాల మీద నచికేతునికున్న పట్టుదల తెలిసిపోయింది. అందుకే యముడు జ్ఞానోపదేశం చేయాలనే నిశ్చయించుకొన్నాడు. ఆ పరమోపదేశం పై శ్లోకంతోనే ప్రారంభమయింది.

ఓ నచికేతా ! లోకంలో మనిషి నడుచుకోడానికి రెండు విధాల మార్గాలున్నాయి. మొదటిది శ్రేయోమార్గం; రెండవది ప్రేయోమార్గం. శుభ పరంపరలను కలిగించేది మోక్షాన్ని లభింపజేసేది శ్రేయోమార్గం. లౌకిక సుఖాలను కలిగించేది వాంఛలను తీర్చేది ధనాది సౌఖ్యాల నందించేది ప్రేయోమార్గం. ఈ రెండు మార్గాలు పరస్పరం భిన్నంగా ఉంటాయి; విలక్షణంగా ఉంటాయి. శ్రేయస్సును కలిగించే మార్గం మొదట కష్టమనిపిస్తుంది; నీరసంగానూ ఉంటుంది; అయినా చివరలో శాశ్వత సుఖాన్నందించే పరిణామం పరమానందాన్ని కలిగిస్తుంది. ఇక ప్రేయోమార్గం మొదట సుఖవంతంగా ఉంటుంది. పరిణామదశలో చివర దు:ఖాన్ని కలుగజేస్తుంది. అందువల్ల శ్రేయస్సును స్వీకరించే వ్యక్తికి మేలు కలుగుతుంది.

ప్రేయస్సును గ్రహించిన వ్యక్తి పరమోత్తమ ప్రయోజనాన్ని పొందలేనివాడై దుఃఖాన్ని పొందుతాడు.

ఇంతకూ శ్రేయస్సు మోక్షగామి అని, ప్రేయస్సు సంసారగామి అని తేలింది. ఇప్పుడాలోచించవలసి ఉన్నది." ఈ లోకంలోని సంసారగామి అంటే గృహస్థుడు ప్రేయస్సులో ధర్మమార్గానుయాయి అయి శ్రేయస్సు వైపుగా అడుగు వేయలేడా!" అని.

జనకుడు, ధర్మవ్యాధుడు, విదురుడు, వశిష్ఠుడు ఇలా ఎందరో ప్రేయో మార్గం నుండి శ్రేయోమార్గం వైపుగా పయనించిన వారేకదా!

మనది హిందూ ధర్మం. మనకు నాలుగు ఆశ్రమాలున్నాయి. బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్యాస ఆశ్రమాలు. ఇందులో మొదటి రెండు ఆశ్రమాల్లో జ్ఞాన తృష్ణ సంసార తృష్ణ తీరుతుంది. మూడవ ఆశ్రమంలో సతీసమేతంగా, లేదా పతి సమేతంగా దంపతులు శ్రేయోమార్గంవైపుగా ప్రగమిస్తారు. చివరి ఆశ్రమంలో ఎవరికి వారే మోక్షం వైపుగా అడుగులువేస్తారు. సాధనా పథంలో పుటం బెట్టిన బంగారమై ఆ వ్యక్తి నిస్సంగుడై పరమార్థాన్ని ఆశించి, పదిమందికి తన సేవలందిస్తూ తన దర్శనంతో ఆవిశ్వాత్మలో అంతర్లీనమైపోతాడు

అయితే జీవితాంతం ప్రేయస్సులోనే ఉండేవారు, జీవన ప్రారంభంలోనే శ్రేయస్సు నెన్నుకొని ప్రగమించేవారు ఎప్పుడూ ఈ విశ్వంలో ఉంటారు. ప్రేయస్సులో ఉత్పత్తి, వృత్తి రంగాలలో ధర్మ నిష్ఠతో పని చేసి తన కుటుంబాన్ని, తన దేశాన్ని భౌతిక సంపదలతో నింపే వ్యక్తి యోగదానాన్ని మనం తక్కువగా అంచనా వేయరాదు, నీచంగా చూడరాదు. ధర్మ నిష్ఠ ఏ వృత్తిలో ఉన్నవారికైనా తప్పనిసరి. అప్పుడే ప్రేయస్సుకు - శ్రేయస్సుకు అద్వైతం సిద్ధిస్తుంది. సాధకులైన వారి అనుభవాలు ఈ అద్వైత పరమార్థానికి ఏ విధంగా ఉపకరిస్తాయో అధ్యయనం చేయవలసి ఉంది.

12. శ్రావణ ధర్మాలు

శ్రావణాన్ని దాటుతున్నాం; భాద్రపదంలో ప్రవేశిస్తున్నాం. అయితే శ్రావణంలో నిర్వహించాల్సిన పవిత్ర ధర్మకర్మలన్నీ నిర్వహించామా! ఓసారి పర్యాలోచన చేద్దాం. ఈ సంవత్సరం నిర్వహించకపోతే వచ్చే సంవత్సరమన్నా నిర్వహిద్దాం.

శ్రావణమాసం నోములు- తపాలు - వ్రతాలకు ప్రారంభం. ఆషాఢ మాసంలోనే చాతుర్మాస దీక్షలు ప్రారంభమవుతాయి. ఈ మాసంలో మంగళ గౌరీ వ్రతంతో నోములు మొదలవుతాయి. ఆదిశక్తి మంగళ గౌరిని మంగళం కొరకే పూజిస్తారు. ఈ నెలలో వచ్చే మొదటి మంగళ వారమే ప్రారంభిస్తారు. ఆ తర్వాత చెప్పుకోదగ్గవి శ్రావణ శుక్రవారాలు. ప్రధానంగా రెండో శుక్రవారం వరలక్ష్మి వ్రతం చేస్తారు. అష్టోత్తరాలు సహస్రోత్తరాలు కుంకుమ పూజలు జరుగుతాయి. ప్రధానంగా స్త్రీలే పాల్గొంటారు. పాల్గొన్న ముత్తయిదువలకు తమలపాకులు - పళ్లు, పసువు, కుంకుమ ఉపాయనాలుగా ఇస్తారు. ఈ వ్రతం సామూహికంగా నిర్వహిస్తారు. ఒక్కరు చేసినా పది మందిని పిలుచుకొంటారు. సామూహిక వ్రత నిర్వహణ కారణంగా ఎన్నో మంచి ఫలితాలు వస్తాయి. మేమందరం ఒకే ధర్మానికి చెందిన వారమనే అభిప్రాయం బలపడుతుంది.

శ్రావణ పౌర్ణమి సందర్భంగా రక్షాబంధనాలు చేస్తారు. రక్షలు వీరు వారనక ఎవరూ ఎవరికైనా కట్టవచ్చు. గుడిలో పురోహితులు, భక్తులందరికీ కట్టవచ్చు. కాని అక్కా చెల్లెండ్రు అన్నాదమ్ములకే రక్షలు కట్టడం ఆచారంగా స్థిరపడింది. దీనికి కొన్ని కథలు కూడా పుట్టుకొని వచ్చినై. పౌరాణిక చరిత్ర! సాంఘిక సంఘటన లెన్నో ఈ కథలుగా రూపుదిద్దుకొన్నాయి. మురికివాడల్లో ఉన్న వారికి, శారీరకంగా బలహీనంగా ఉన్నవారికి జ్ఞానపరంగా వెనుకబడ్డ వారికి కూడా రక్షలు కట్టివారిని ఉత్సాహపరచాలి.

ఈ మాసంలోనే వచ్చేది శ్రీకృష్ణాష్టమి. అష్టమినాడు పుట్టడం వల్ల శ్రీకృష్ణునికి కష్టాలు వచ్చినాయని, అందరికీ అట్లే కష్టాలు వస్తాయని కొందరి విశ్వాసం. ఈ నమ్మకం

పరియైంది కాదు. శ్రీకృష్ణుని చుట్టుముట్టిన కష్టాలేమీ లేవు అన్నీ మాయలే. కర్మపథంలో నడిచే జ్ఞానికి అష్టకష్టాలు కూడా అష్టయిశ్వర్యాల నందిస్తాయి.

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పిల్లలకు కృష్ణుని వేషాలు వేయాలి. ఆటలాడించాలి. పాటలు పాడించాలి. బాల బాలికల నొక దగ్గర కలిపి బాలగోకులం నిర్వహించాలి.

ఈ మాస ప్రారంభంలోనే వచ్చే నాగులచవితి, నాగులపంచమి వ్రత నిర్వహణ ద్వారా విషజీవులను కూడా ప్రేమించే సద్గుణం హిందూ ధర్మంలో ప్రచారానికి వచ్చింది. విశాలగుణాలు కూడా ఇందువల్లనే అలవడ్డాయి.

అయితే విశాలగుణాలు ఉండాలి; శక్తినీ ఉపాసించాలి. జ్ఞాన ధర్మాల ప్రచారం జరగాలి. ధర్మరక్షణా జరగాలి. అందుకు శ్రావణ ధర్మాలనన్నిటినీ పాటించాలి.

13. హిందూ సామ్రాజ్యదినోత్సవం

1994 జూన్ 21వ తేది జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి. 1674 జూన్ 9వ తేదీన ఆనందనామ సం॥ర జ్యేష్ఠ శుద్ధ త్రయోదశినాడు ఛత్రపతి శివాజీ మహారాజు పట్టాభిషేక మహోత్సవం జరిగింది. ఆ రోజు నుండి ఆ తిథిని హిందూ సామ్రాజ్య దినోత్సవంగా ఈ దేశ ప్ర- జరుపుకొంటున్నది.

విదేశీయ ముస్లింలు ఈ సనాతన ధర్మాన్ని, ఈ హైందవ సంస్కృతిని రాచిరంపాన పెట్టిన తరుణంలో హిందువుల్లో సాతంత్ర్య పిపాసను రగిలించి, మతోన్మాద విదేశీశక్తులను తుక్కు తుక్కుగా కొట్టిన హైందవధర్మ స్వాతంత్ర్య నిర్మాత ఛత్రపతి శివాజి. అందుకే ఆ శివాజి పట్టాభిషేక దినోత్సవాన్ని హిందూ సామ్రాజ్యదినోత్సవంగా జరుపుకోవడం ఎంతో సముచితమైందనే చెప్పాలి. ఈ నాటికీ విదేశీ మతోన్మాదశక్తులు హైందవాత్మను కబళించాలనే ప్రయత్నిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రతి యింటా శివాజీ పుట్టాలని భారతమాత పిలుపునిస్తున్నది.

1627వ సం॥లో శహాజీ జిజియాబాయి దంపతులకు శివనేరీ దుర్గంలో శివాజీ జన్మించారు. దాదాజీ కొండదేవ్ శివాజీకి అస్త్రశస్త్రాది విద్యలు నేర్పిన గురువుకాగా, తల్లి జిజియాబాయే భారత భాగవత రామాయణాది కథల బోధన ద్వారా మొదటి గురువై భారతీయ శౌర్యాన్ని ఉగ్గుపాలతో రంగరించి నేర్పింది. శ్రీరాముని ధర్మవీరం, శ్రీకృష్ణుని రాజనీతి, భీముని భుజశక్తి శివాజీని మహాశక్తిమంతునిగా తీర్చిదిద్దినై. రసపుత్ర వీరుల కథలూ ఆయనకు స్ఫూర్తినందించినై.

ఈ దేశం మీద దండయాత్రలు చేసి, ప్రజలపై హింసోన్మత్త పైశాచిక అత్యాచారాలెన్నో జరిపి, ఈ దేశ ధర్మదేవాలయ సంస్కృతిని విచ్ఛిన్నం చేసి, ఈ దేశీయుల్లో కులాల పేరిట తగాదాలు సృష్టించి, దేశంలోని విభిన్న స్థలాల్లోని సింహాసనాలపై వందల సం॥లు కూచొని పరిపాలించి, అంటరాని తనమనే అఖాతాన్ని కావల్సినంతలోతూ వెడల్పూ చేసి, హిందువులందరూ కలిసి కట్టుగా నడవకుండా శత సహస్రాధిక సక్కజిత్తులన్నీ ఉపయోగించి పరిపాలించిన సైతాన్ సంతతి నుండి ఈ దేశానికి, ఈ ధర్మానికి, ఈ జాతికి, ఈ సంస్కృతికి,

విముక్తి ప్రసాదించడానికే భవానీమాత సాక్షిగా రక్తతిలకం ధరించి, ఖడ్గధారణం చేసి, దీక్షాకంకణబద్ధుడై మహా శౌర్య వీర పరాక్రమాలతో అసహాయ శూరునిగా ముందడుగు వేసిన జాతీయ వీర ధర్మ నిర్మాత, స్వాతంత్ర్యయోద్ధ ఛత్రపతి శివాజీ.

ఆయన మావళావీరుల్ని సంసిద్ధం చేశారు. తోరణ దుర్గానికి విముక్తి కలిగించారు. రాజగడ్‌ను నిర్మించారు. తండ్రికి అండగానిలిచారు. ఢిల్లీ నవాబును ఎదిరించి ముప్పు తిప్పలు పెట్టారు. అఫ్జల్ ఖానును సంహరించారు. బీజాపూరును భయభ్రాంతం చేశారు. తానాజీ, బాజీ, సూర్యాజీ వంటి దేశభక్త వీరుల్ని నిర్మించారు. పూనాలోని విడిది నుండి షయిస్త ఖాన్ పారిపోయేట్టు చేశారు. తండ్రి కోరిక మేరకు బీజాపూర్ నవాబుతో సంధి చేసుకొన్నా స్వాతంత్ర్య పోరాటం కడదాకా కొనసాగించారు. మొగలాయీల చేతుల నుండి అరవై పైచిలుకు దుర్గాలకు విముక్తి కలిగించారు. చివరకు సంధికి అంగీకరించారు. ఔరంగజేబును నమ్మించి మోసం చేసి గృహ నిర్బంధంలో ఉంచినప్పుడు కుయుక్తిని యుక్తితో భేదించి బయటపడ్డారు. మొగలులను ముప్పతిప్పలు బెట్టి ముప్పయి చెరువులనీళ్లు త్రాగించారు. సింహగడాన్ని సాధీనం చేసుకొన్నారు.

అక్కన్న మాదన్నలతో స్నేహం చేసి గోలకొండ ప్రాంత హిందూ ప్రజానికి ధైర్యాన్ని కలిగించారు. గోలకొండ నుండి శ్రీశైలం వరకు పయనించి హైందవ ధర్మవీరజ్యోతి దగద్దగలు దశదిశలా వ్యాపించేట్లు చేశారు. పరిపాలనలో బ్రహ్మాండమైన యంత్రాంగాన్ని - మంత్రాంగాన్ని పటిష్ఠపరచి రాజ్య పరిపాలన చేశారు.

పట్టాభిషేక మహోత్సవం అయిన వెంబడే తన తల మీది కిరీటం తీసి, గురువు రామదాసు కాళ్ల ముందు పెట్టి రాజ్యాన్ని ఆయనకు ధారపోశారు. అప్పుడు గురూప దేశంతో కేవలం ధర్మకర్తగా (ట్రస్టీగా - రక్షకునిగా) రాజ్య పరిపాలన స్వీకరించిన ధర్మవీరుడు ఛత్రపతి శివాజిలేకుంటే యేమయ్యేదో ఆలోచించండి! ఆ శివాజి మళ్లీ ఇంటింటా పుట్టాలని తల్లి భారతి ఎందుకు కోరుకొంటున్నదో ఆలోచించండి! హిందూ సామ్రాజ్యదినోత్సవం ప్రాశస్త్యాన్ని గ్రహించండి!

✣ ✣ ✣

!4. దీపావళిలో దివ్య గీతాతత్త్వం

నరకుని వధ జరిగింది; భూదేవి సంతోషించింది. సత్యాకృష్ణులిద్దరు ఇంకా రథం కూడా దిగలేదు. భూమాత శ్రీకృష్ణుని స్తుతిస్తూ ప్రార్థించింది.

"దేవా ! నీవు లోకంబులు సృజియించుటకు రజో గుణంబును,
రక్షించుటకు సత్త్వ గుణంబును, సంహరించుటకు తమో గుణం
బును ధరియించు కాలమూర్తివి. ప్రధాన పూరుషుండవు, పరుండవు
నీవ. నేనును, వారియు, వహ్నియు, ననిలుడు, నాకాశము,
భూతతన్మాత్రలును, నింద్రియంబులును, దేవతలును, మనంబును,
గర్తయును, మహత్త త్త్వంబును, చరా చరంబయిన విశ్వంబును,
నద్వితీయుండవయిన నీయందు సంభవింతుము"

(శ్రీ మహాభాగవతము, దశమ, 203వ వచనము)

ఆ తల్లి ఈ విధంగా అని నరకాసురుని పుత్రుడైన భగదత్తుణ్ణి కాపాడవలసిందని ప్రార్థించింది. శ్రీకృష్ణుడతనికి అభయమిచ్చాడు. ఎవరిని సంహరించాలో వారిని సంహరించడం, ఎవరిని రక్షించాలో వారిని రక్షించడం పరమాత్ముని కర్తవ్యం; దైవకర్తవ్యం, ఆ కర్తవ్యం నెరవేరింది. నరకం పోయింది. స్వర్గం వంటి ప్రశాంత వాతావరణం ఏర్పడింది. అందుకే భూదేవి కంత తృప్తి.

స్వర్గం నరకం రెండూ భూదేవి పుత్రులే. ఆ తల్లి నరకం చచ్చి పోవాలనుకొంది; అది దైవశక్తికి ఓడిపోయింది. ఆ దైవశక్తి శ్రీకృష్ణునిది. అందుకే శ్రీకృష్ణుణ్ణి పైవిధంగా స్తుతించింది. ఈ స్తుతిలో గీతాతత్త్వమున్నది. అదేమిటో చదవండి!

భగవంతుణ్ణి ప్రధాన పురుషడవన్నది భూమాత. పురుష శబ్దం ఇక్కడ పరమాత్మ వాచకమే గాని ఇది స్త్రీ పురుష భేదాన్ని తెలిపే అర్థాన్ని ఇవ్వదు. గీతలోని పురుషోత్తమ ప్రాప్తియోగాన్ని ఈ అర్థంలోనే అధ్యయనం చేయాలి.

"నేనును (భూమాత), వారియు (నీరు), వహ్నియు (అగ్ని), అనిలుడు (గాలి), ఆకాశము (శూన్యం), భూతతన్మాత్రలు (పంచభూతాలు, జీవుల్లు, విషయాదులు)

ఇంద్రియంబులు (కర్మజ్ఞానేంద్రియాలు - మనస్సు), దేవతలు (దివ్యములైనవి) మనంబును (మనస్సు), గర్తయు (స్త్రీతత్వము) మహత్తత్వంబు (పురుషతత్త్వము) చరాచరంబు (స్థావర జంగమాలు), విశ్వంబు (సమస్త సృష్టి), అద్వితీయుడవు (మరొకడు లేక ఒకే ఒక్కడవుగా ఉన్నవాడవు)."

ఇవన్నీ పరమాత్మలోనే పుడతాయి. విశ్వాత్మలో (universel Soul) సమస్తమూ ఉన్నప్పుడు ఏది వచ్చినా అందులో నుంచే కదా వచ్చేది! గీతలో ఆ పరమాత్మనే ఇవన్నీ నేనే అయి ఉన్నాను అన్నారు.

"భూమి రాపోఽనలో వాయుః - ఖం మనోబుద్ధి రేవచ।
అహంకార ఇతీయం మే - భిన్నా ప్రకృతి రష్టధా॥" (7-4)

నా ప్రకృతి ఎనిమిది విధాలుగా విభజితమై కనిపిస్తున్నది అన్నారు పరమాత్మ. భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం, మనస్సు, బుద్ధి, అహంకారం అనే ఈ ఎనిమిదీ పరమాత్మేనట.

కలడంభోధి, కలండు గాలి, కలడాకాశంబునన్ .... అని ప్రహ్లాదుని చేత పలికించిన భాగవతకర్త, కలడు కలండనెడు వాడు కలడో! లేడో!! అని కూడా మరోపాత్రచేత అనిపించాడు.

కలడో - లేడో అన్న సందేహాత్మక ప్రశ్నకు కలడు అనేదే కదా సమాధానం. అస్తి - నాస్తి విచికిత్సలో 'నాస్తి'కే పరిమితమై ఎవరైనా ప్రసంగించడం ప్రారంభిస్తే, నీవు ఉన్నావా అని ప్రశ్నించాలి. ఉన్నాను అంటాడు. అంటే 'అస్తి' అన్నట్టే. కనుకనే గీత "ఉన్నదానికి లేమిలేదు; లేని దానికి ఉనికి లేదు" అన్నది. అందుచేత మనమున్నాము - అన్నీ ఉన్నాయి అన్నమాట, లేని దెట్లాగూ లేనే లేదు.

అన్నీ ఉన్నాయి; మనమూ ఉన్నాము కాబట్టే మాటాడు కొంటున్నాం. పరస్పర ఆధారాదేయంగా పరస్పర పూరకంగా జీవిస్తున్నాం. సంఘర్షిస్తూ (Strougle for Existence) బ్రతుకుతున్నాం అని కొందరంటారు. కాని అది సరయింది కాదు; జీవితంలో ఏదో లోపించింది అని భావిస్తున్నాం. ఈ భావనతో అలోపాన్ని ప్రేమతో - ఆత్మీయతతో అనుబంధంతో పూరించడానికి ప్రయత్నిస్తున్నాం అంతే!

నరకాసురుడు ఓ పెద్ద కాలుష్య పుంజం (కాలుష్యందిబ్బ). ఈ కాలుష్యం, ఈ దిబ్బ మానవ ప్రశాంతికి భంగకరంగా పరిణమించింది. జీవకోటికి శాంతిలోపించింది. లోపించిన ఈ శాంతిని పూరించాలి. పూరించాలంటే ఆ కాలుష్యం పోవాలి. అది పోవాలంటే కొంత యత్నం చేయాలి. ఆ యత్నం చేసినవారినే కాలుష్యం మ్రింగడానికి ప్రయత్నిస్తుంది. ఆ ప్రయత్నం వమ్ము చేయాలంటే పురుష (ఆత్మ) శక్తి కావాలి. అదే దైవీ శక్తి.

ఆ ఎనిమిదింటిలోనూ, అన్నిట్లోనూ, అంతటనూ ఉన్న దైవం తననే కాలుష్యం మ్రింగేస్తుంటే చూస్తూ ఎలా ఉంటాడు.

చూస్తూ ఉంటే అకర్మణ్యత్వం. మరి ఆ కాలుష్యం చేస్తున్నదేమో వికర్మ. ఈ వికర్మను కర్మతో ఎదుర్కోవాలి. (భగవద్గీత జ్ఞానయోగంలోని శ్లోకాల్ని అన్వయించుకోండి)

తమాషా ఏంటంటే వికర్మా చంపుతున్నది; కర్మాచంపుతున్నది.

వికర్మ ఎవరిని చంపుతున్నది? జీవకోట్లను చంపుతున్నది! కర్మ ఎవరిని చంపుతున్నది? వికర్మను చంపుతున్నది.

స్థూల దృష్టికి ఇవి రెండూ కర్మలుగానే కనిపిస్తాయి. అయితే ఒకదాని (వికర్మ) వల్ల సృష్టి సంహారం జరుగుతున్నది. మరొక దాని (కర్మ) వల్ల సృష్టి వికాసం జరుగుతున్నది.

శ్రీకృష్ణ పరమాత్మ గీతలో ఏం చెప్పారో భాగవతంలో అది చేశారన్న మాట. మనసా వాచాకర్మణా (త్రికరణశుద్ధిగా) వ్యవహరించాలంటామే!..... అది ఇదే!

నరకవధ అంటే ఏదో "అల్లాటప్పా" పని కాదు. దాని వెనుక ఇంత గీతార్థమున్నది. శక్తి ఉండి చేదు కొన్నవారికి చేదుకొన్నన్ని మహత్తరార్థాలు లభిస్తాయి. శుద్ధి ఉండాలి; సాధన ఉండాలి; అంతే! సంస్కారాలు వాటంతట అవే పరుగెత్తుకొని వస్తాయి. దీపావళి దివ్యార్థాలు కాంతిరేఖల్లా అంధకారమానసాన ప్రసరిస్తాయి.

15. దుర్గ్గణాల్ని వదలి పెట్టాలి

ఈ మాట ఎవరంటున్నారు? ప్రతి మంచి గ్రంథమంటుంది; ప్రతి మంచి మనిషి అంటాడు.

ప్రపంచంలోనే ప్రప్రథమ గ్రంథమైన ఋగ్వేదంలోనే దుర్గుణాల్ని దూరం చేయుమని కోరుకోవడముంది.

"వియాత విస్మత్రిణమ్" (ఋగ్ : 1-86-10)

- "ప్రమాదాన్ని కలిగించే నాలోని తలంపులను దూరంగా త్రోసి వేయుమా" అని పై మంత్రం అర్థం.

"ఆరే స్యామ దురితాద్భీకే" (ఋక్ : 3-36-07)

- "దేవా! మమ్మల్ని దుర్గుణాల నుండి దూరం చేయుమా" అని పైమంత్రం అర్థం.

"పరాదుః ష్వప్న్యం సువ (ఋక్ : 5-82-47)

- "ఓ దేవా! దుష్ట తలంపులను దరికి రానీయకుమా" - అని పైమంత్రం అర్థం.

"విశ్వాని దేవ సవితర్దురితాని పరాసువ
యద్ భద్రం తన్న ఆసువ" (ఋగ్వేదం : 5-82-5)

"దురితాలను నెపుడును మా-దరిని జేరనీయకుమా"
పరమభద్ర పుంజము మా-పరముగాగనీయుమా!"

(సమూల శ్రీమదాంధ్ర ఋగ్వేద సంహిత, ద్వితీయ సంపు : 748)

ఇలా ఋగ్వేదంలో అనేక సందర్భాల్లో దురితాలను, దుర్గుణాలను దరికి చేరనీయవద్దని, ఒకవేళ అవి తమలో ఉన్నట్లయితే వెళ్లిపోవాలని ప్రార్థించడమున్నది.

ఇంతకూ దుర్గుణమంటే ఏమిటి? ఒకరికి చెరుపు కలిగించే ఆలోచన అనుకొందాం ప్రస్తుతానికి. ఆలోచన దుర్గుణమా! ఆచరణ దుర్గుణమా అన్న ప్రశ్న వెంటనే వస్తుంది.

ఆచరణ వల్ల అతనిలో ఇలాంటి ఆలోచన ఉన్నదని తెలుస్తుంది. ఆ ఆలోచన హఠాత్తుగా కలిగిందా! లేక మొదటి నుంచి ఉందా! మొదటి నుంచి అంటే ఎంత మొదటి నుంచి! అతను పుట్టినప్పటి నుండి అని చెప్పుకోవచ్చునా!

ఉదాహరణకు కామం అనేది ఒక దుర్గుణం. ఇది వదలాలి! అయితే ఎప్పుడు ఉండాలి! ఎప్పుడు వదలాలి! అధార్మిక కామం వదలాలి. ధర్మ కామం ఉండాలి.

అయితే అది దుర్గుణం కాదని కదా! దానిని ఉపయోగించేప్పుడు చేసుకొన్న చట్టానికో, నియమానికో విరుద్ధంగా వ్యవహరిస్తే అది దుర్గుణమవుతుందని తేలింది.

శివుని కంటి మంట కాముణ్ణి కాల్చి వేసింది. అది సరిగా ఈ ఫాల్గుణ పౌర్ణమినాడే జరిగింది. కామదహనం అనీ, హోలీ అనీ ఏటేటా ఆ రోజు పండుగ జరుపుకొంటున్నారు.

కాముడు చేసిందేమిటి! శివునిలో కామభావన కలిగించాలనుకొన్నాడు. శివుడేమో జితేంద్రియుడై తపస్సు చేస్తున్నాడు. ఆయన కామానికి దూరంగా ఉన్నాడు.

కామం కలగడానికి కావలసిన సంభారాలు - సామగ్రిని సృష్టించి శివుని మనస్సును పార్వతివైపుగా మళ్లించే ప్రయత్నం చేశాడు కాముడు. శివుని తపస్సుకు భంగం జరిగింది. కాముని వైపు ఆగ్రహంతో చూశాడు. కాముడు కాలిపోయాడు.

ఒకరు ఒకదారిలో నడుస్తున్నారు. ఆ దారి మంచిది. వారు ఇంకొక దారిలో నడిస్తే పది మందికి మేలు జరుగుతుందని ఆలోచించారు. అందుకని ఆయన దారి తప్పించడానికి ఒకరిని నియోగించారు. ఆ నియోగింపబడ్డ వ్యక్తి తనను దారి తప్పిస్తున్నాడని ఆయన తెలుసుకొని శిక్షించాడు.

దేవతల నియోగంతో కాముడు శివుణ్ణి దారి తప్పించాలని యత్నించాడు; శిక్షింపబడ్డాడు.

శివ పార్వతులకు కలిగే కుమారుడు తారకుడనే రాక్షసుణ్ణిసంహరిస్తాడని దేవతలనుకొన్నారు; వారికీ సంగతి బ్రహ్మ చెప్పాడు.

వేలాది మంది దేవతలకు మేలు జరగాలంటే శివపార్వతుల కల్యాణం జరగాలి. శివుడు తపస్సులో ఉన్నాడు; పార్వతి శివుని సేవలో ఉన్నది; కల్యాణం జరిగేదెట్లా! అందుకే కాముడు రంగ ప్రవేశం చేయడం కాలిపోవడం జరిగింది.

ఈ రంగ ప్రవేశాన్ని నాడైన నేడైనా రేపైనా తప్పని ఎవ్వరూ అనరు! దేవతలూ కల్యాణాన్నే కోరారు; కాముడూ కల్యాణాన్నే కోరారు. ఇక అధర్మమెక్కడ ఉంది! కామం దుర్గుణం ఎందుకవుతుంది!

అయితే అరిషడ్వర్గాలలో కామాన్ని మొదటే ఎందుకు చేర్చారు. దానిని నిగ్రహించుకోలేకపోతే అది దుర్గుణమే అవుతుందని తెలుస్తుంది కదా! ఎలా!

వేద వ్యాసులవారు చెబుతున్నారు; శిష్యుడు జైమిని వ్రాస్తున్నారు.

"బలవానింద్రియగ్రామో విద్వాంసమపకర్షతి" అన్నారు వారు. బలముగల ఇంద్రియాలు విద్వాంసుణ్ణి సైతం పట్టిలాక్కుపోతాయి అని ఆ వాక్యం అర్థం. ఇంద్రియాలు విద్వాంసులను లాక్కొనిపోవని భావించిన జైమిని అవిద్వాంసులను లాక్కొనిపోతాయి అని వ్రాశారు. విద్వాంస పదం ముందు 'అ' చేర్చాడన్నమాట. పైగా జైమిని వాదానికి కూడా దిగాడు తనను తాను సమర్థించుకోడానికి.

వ్యాసుల వారప్పుడెమీ అనలేదు. ఆ సాయంకాలం ఆశ్రమం జైమిని కప్పగించి తాను వనాంతరం వెడుతున్నానని చెప్పి వెళ్లిపోయారు.

ఆసాయంకాలం ఓ అందమైన యువతి నేరుగా జైమిని దగ్గరికి వచ్చి, తన వాళ్ల నుండి తాను తప్పిపోయానని, ఈ రోజు రాత్రి ఆశ్రమంలో ఆశ్రయమివ్వాల్సిందిగా అడిగింది. ఆశ్రమంలో అబలలకు ప్రవేశం లేదన్నాడు జైమిని.

వర్షం వస్తున్నందువల్ల, రాత్రి అవుతున్నందువల్ల తానప్పుడు ఎటూ వెళ్లలేని స్థితి యేర్పడిందని ఆ యువతి దీనంగా వేడుకొంది. జైమిని ఆశ్రమంలోని చివరి గది కేటాయించి, ఆ గదిలో నుండి వెలుపలికి రావద్దని ఆదేశించి తడిక దగ్గరకు వేసి మరీ వచ్చాడు. ఆ తర్వాత అందరితో పాటు ధ్యానానికి కూచున్నాడు. కాని ధ్యానం నిలవడం లేదు. అందమైన ఆ యువతి రూపమే కళ్ల ముందు నిలిచింది. ఎంత ప్రయత్నించినా ఆ రూపం మనస్సు నుండి మాయం కాలేదు.

ఆ రోజు మధ్య రాత్రి ఎవరూ చూడడం లేదని నిశ్చయించుకొని, ఆశ్రమంలో ఆయువతికి కేటాయించిన గది వెనుక భాగం నుండి దూరాడు జైమిని. లోనికి అడుగుపెట్టిన వెంటనే జైమిని కంట ధ్యాన నిష్ఠాగరిష్ఠుడైన వ్యాసులవారు కనిపించారు. ఆ రోజు మధ్యాహ్నం వ్యాసులవారితో తాను వాదించిందంతా గుర్తుకు వచ్చింది జైమినికి.

జైమిని వ్యాసుల వారి పాదాలపై పడి "బుద్ధొచ్చింది స్వామీ" అన్నాడు. తానా వాక్యం "విద్వాంస మపకర్షతి" అనే రాస్తాను అన్నాడు. వ్యాసులవారు శిష్యుని తలనిమిరి లేవనెత్తాడు. ఇక్కడ జైమిని కామం దుర్గుణ భూయిష్ఠమయింది. అయితే దంపతుల సాంసారిక జీవనం దుర్గుణం కాదు. గృహస్థ జీవనం అతి పవిత్రమయింది. అది లోకంలోని సర్వాభ్యుదయాలకు కేంద్రం. అందువల్ల అధార్మికమైన కామమనే దుర్గుణాన్ని వదలాలి అని గుర్తుంచుకోవాలి.

*****

౧౮. ప్రతి రాత్రీ శివరాత్రే కావాలి!

ఏటా వచ్చే శివరాత్రి వచ్చింది.

ఉపవాసాలూ - వ్రతాలూ - భజనలూ - దీక్షలూ ఎవరు పాటించాల్సినవి వారు పాటించారు. వచ్చే శివరాత్రికి కూడా పాటిస్తారు.

ఇది కాల చక్రం

ఇది శక్తి చక్రం

కాలం శక్తిని నిలుపుతుంది. శక్తి కాలాన్ని నడుపుతుంది.

అది కన్ను

ఒక కన్ను కాదు; మూడు కన్నులు.

ఆకన్ను ఈ కాలాన్ని చూస్తున్నది; ఆదేశిస్తున్నది; శక్తిని నిర్దేశిస్తున్నది.

అదే జీవకోటిలో మానసిక శక్తిని నిలుపుతున్నది.

జన సామాన్యమనుకొనే దాన్ని అసామాన్యంగా చేస్తున్నది.

ఈ మూడుకన్నులు సూర్య చంద్రాగ్ని గోళాలే?

అసలా మూడో కన్ను ఏమిటి?

అది అగ్నినేత్రమా!

జ్ఞాన నేత్రమా!

ఈ విశ్వంలో ఎవరికీ కనిపించనిది కంటూ, ఎప్పుడెప్పుడు సమతౌల్యం దెబ్బదింటే అప్పుడప్పుడు సరిజేస్తున్నదా!

అది సరిజేస్తున్నదనేది ఊహా! శాస్త్రీయ సత్యమా!

కంటికి కనిపించని ఈ పని ఆ మూడోకన్నే సరిజేస్తున్నదని అంగీకరించేదెలా! ఇలా భావిద్దామా!

శ్రమ - శక్తి - ఫలితం

సత్యం - శివం - సుందరం

ఈ మూడింటిని సాధించడానికి ఆ మూడోకన్ను త్రిశూలాన్ని పరమాధారంగా స్వీకరించిందా.

ఈ స్థూల నేత్రాలకు ఆ మూడో కన్ను గాని, ఈ త్రిశూలం గానీ కనిపించదు.

త్రిశూలం

ఆ మూడు మొనలు చూడండి!

అది ఊర్ధ్వ గమనమై వెళ్లే ఓంకారంగా దృష్టి పథంలో నిలుస్తున్నదా!

అమావాస్యనాడైనా వెన్నెలలను పూయించే మహాశక్తిగా దృగ్గోచరమవుతున్నదా!

సత్వ రజస్తమస్సులను ఆత్రిశూలమే సృష్టిస్తున్నదనే భావన కలుగుతున్నదా!

త్రినేత్రం

త్రిశూలం

త్రిగుణాలు

ఈ త్రిగుణాలెక్కడ ఉన్నాయి!

విశ్వమంతటా - సర్వ జీవకోటుల్లో ఉన్నాయి

ఉండి ఏం చేస్తున్నాయి!

ఉద్రేకాలు కలిగిస్తున్నాయి

ఉత్పత్తిని చేస్తున్నాయి

నిన్నూ - నన్నూ నిలుపుతున్నాయి.

నీవున్నావు

త్రిశూలమున్నది

త్రినేత్రమున్నది.

నీకొక రూపం కల్పించుకొన్నాం.

నేత్రాన్నీ నిర్దేశించాం.

త్రిశూలానికీ ఆకారమిచ్చాం.

ఈ ప్రతీకల్లో నిన్ను చూస్తున్నాం.

నిజం వైపుగానే పయనించాలని ప్రయత్నిస్తున్నాం. కాని ఆ త్రిశూలంలోని ఒక మొన మమ్మల్ని తమస్సులోకి ఎందుకు తోస్తున్నది.

మరొకటి ఉత్పత్తి నెందుకు చేయిస్తున్నది.

ఈ రెండింటికీ మనస్సునూ శరీరాన్ని సాధనాలుగా ఎందుకుజేస్తున్నది.

మేము ఆశకు లోనవుతున్నాం.

మాయలో పడుతున్నాం.

సత్యం (సత్వం) కనిపించడం లేదు. మాయకట్టుబాట్లలో మరణం వైపుగా ప్రగమిస్తున్నాం.

తమ సోమాజ్యోతిర్గమయ - ఇదికాదు

మృత్యోర్మా అమృతం గమయ - అసలేకాదు.

ఇది ఉత్పత్తి వినాశనాల భౌతిక రూపం మాత్రమే!

మేము ఆశిస్తున్నది అది కాదు.

నీ సత్యం - శివ - సుందరత్వాన్ని వదలి మేము రాత్రిలో అడుగుపెడుతున్నాం.

శివుడు లేని రాత్రి మాకు వద్దు

శివుడున్న రాత్రి కావాలి మాకు.

శివరాత్రి కావాలి మాకు.

17. వివేక జ్యోతి

హిందూ దేశంలో వివేకభానూదయం జరిగి ఇప్పటికి నూటముప్పయి సం॥లు గడిచిపోయినై. వేదం పుట్టిన నాడే వివేకం పుట్టింది. ఇది ఎన్నో వేల సం॥ల క్రితం మాట.

కాని చారిత్రక అసురసంధ్యలో దేశానికి దేశీయులకు అనేక ప్రమాదాలు సంభవించినై. వివేకం ఉంది; వేదం ఉంది; ఉపనిషత్తులున్నాయి; స్మృతులూ దర్శనాలూ శాస్త్రాలూ ఉన్నాయి. కథాకథనం ద్వారా వ్యక్తిలో పరివర్తనను ఆశించి పురాణాలూ వచ్చినాయి. సంస్కృత వాఙ్మయం తల్లిగా నిలిచింది. దేశభాషలపై తన అమృతాక్షర కిరణ ప్రసారం చేసింది.

అయినా ఈ దేశీయుల్లో కొందరు విదేశీయుల తొత్తులైన కారణంగా, మరికొందరు ఔదాసీన్యం వహించిన కారణంగా, ఇంకా కొందరు భోగలాలసులైన కారణంగా, శత్రుమూకలను ఎదిరించడం ఒక క్షత్రియునిపనే; మేము మా నేతపని, మా వ్యవసాయం, మా గీతపని, మా వ్యాపారం, మా సేవాకార్యం, మా కళారంగ కార్యక్రమాలు, మా వృత్తులూ, ఉత్పత్తులు - ఇవి చూచుకొంటే చాలు అని ఎందరో భావించిన కారణంగా, వేదం మీద, ఈ దేశ ఆర్ష సంస్కృతి మీద, హిందూ జాతి మీద, ధర్మం మీద కత్తిగట్టిన విదేశీయ మత సామ్రాజ్యవాద దుశ్శక్తులు ఇక్కడ పెత్తనం చలాయించి మనిషికి వివేకం అందకుండా అడ్డంగా నిలిచినై.

ఈ వివేక సంపాదనకు నిరంతరం హిందువు తపనపడుతూనే ఉన్నాడు. క్షాత్రశక్తి అంతగా తోడు లేని పీఠాధిపతులు బ్రహ్మ విద్యా ప్రచారంలో తమకు తోచిన మేరకు కిందా మీదా పడుతూ వ్యవహారం జరుపుతూనే ఉన్నారు; ధర్మ ప్రచారం చేస్తూనే ఉన్నారు.

కానీ విదేశీ ఏకపక్షమతవాద పెత్తందార్ల పద ఘట్టనల ధూళి మాటిమాటికి వివేక సూర్యుణ్ణి క్రమ్మివేస్తూనే ఉన్నది. అయినా ఈ దేశం వివేక దర్శనంతో తన ఉనికిని నిలుపుకొంటూనే ఉన్నది. ఊరిక నిలుపుకోడం కాక ప్రచండ వేగంతో ప్రపంచంలోకి చొచ్చుకుపోవాలని పరమేశ్వర సంకల్పం జరిగింది.

ఆ కారణంగానే 1863 జనవరి 12 సంక్రాంతి పుణ్యదినాన వివేక భానూదయం జరిగింది. ఆ ముద్ద గట్టిన వివేకజ్యోతి 1893 సెప్టెంబర్ 11వ తేదీన చికాగో విశ్వమత మహాసభలో హిందూ శంఖారావం వినిపించింది. అది పాంచజన్యంలా మ్రోగింది; కౌమోదకంలా మోదింది; సుదర్శనంలా తిరిగింది.

ప్రపంచాన్ని ఆవరించిన ధూళి ఎగిరిపోయింది. సందేహ మేఘపటలం పటాపంచలయ్యింది.

ఆ వాణి విశ్వమానవులకే చైతన్యాన్ని ప్రసాదించింది. ఇక హిందువుల సంగతి చెప్పాలా!

"ఈ శరీరమేమైతే యేమిటి! ప్రజానీకానికి పదిహేను వందల సం॥ల పర్యంతం ఆచరించడానికి కావలసిన సందేశమందించాను.

భారత భూమి నామహోన్నత స్వర్గం; భారత శ్రేయమే నా శ్రేయం

మాతృదేవత నారాధించని మానవుడెన్నడును ఉన్నతిని పొందడు.

ఆత్మ స్వాతంత్ర్యాన్ని అరికట్టకండి! అజ్ఞానం నుండి వెలువడండి!

కావలసింది పురుషకారమని గ్రహించండి! పురుష కార విహీనునికి పరమేశ్వరానుగ్రహం లభించడం కల్ల.

యువకులారా! ధీరులుకండి! బలాన్ని ఆర్జించండి! దుర్జనుడైనా బలోపేతుడే నాకు మాన్యుడు. ఎందుకంటే వాడు కూడా తన బలంతో దౌర్జన్యాన్ని స్వార్థ పరత్వాన్ని వదలివేసి, తత్త్వ సందర్శనం చేసే దినం వచ్చి తీరుతుంది.

ఆంగ్ల చరిత్రకారులు ఎప్పుడూ మన పతనాన్నే ప్రచారం చేశారు. అవి విన్నాం; అవే చదివాం. అవి మనకు మనోదౌర్బల్యాన్ని కలిగించాయి.

అన్నమో రామచంద్రా! అనివిలపించే ఆర్తులకు మత బోధలెందుకు?

పారమార్థిక చింత అనే పునాదులపై నిర్మింపబడినప్పుడే జాతీయ జీవనమనే సౌధం సుస్థిరంగా నిలువగలుగుతుంది.

లెండి! మేల్కొనండి! ఈ స్వప్న స్థితి చాలు! మీలో నున్న దివ్యశక్తిని ప్రకటించండి!!'

ఈ వివేక జ్యోతి కాంతులు ఆయా సందర్భాల్లో వెలువడినవే అయినా ఇవి హిందూ చైతన్యానికి నిరంతరం మూలాధారంగా నిలిచే ఉన్నాయి.

ఈ భావ సం॥ర మకర సంక్రాంతి సందర్భంగా ఇవి అధ్యయనం చేద్దాం; అనుశీలన చేద్దాం; పరిశీలన చేద్దాం; పరమార్థాల్ని సందర్శిద్దాం; వివేక జ్యోతి అంతరంగాన్ని చూద్దాం; అంతరంగంలో నిలుపుకొని మనమూ వివేకానందులమవుదాం.

☆☆☆

18. శివరాత్రి శివంకరం

"శివరాత్రికి చలి శివ శివ అంటూ పోతుంది" అని సామెత. కాలం మరి ముందుకు జరుగుతుందేమో! శివరాత్రి రాకముందే చలి శివ శివ అని వెళ్లిపోతున్నది.

"శివ శివ" అంటే మంగళం జరగాలనే అర్థం. శివ శివ అన్నా రామ రామ అన్నా, కృష్ణ కృష్ణ అన్నా దైవాన్ని స్మరించడమే. దైవస్మరణ ద్వారా వ్యక్తిలో దైవీభావాలు నిర్మితమవుతాయి.

మాఘమాస అమావాస్యకు ముందు రోజు మహా శివరాత్రి హిందువులు జరుపుకొంటారు. అంటే మాఘ బహుళ చతుర్దశినాడు శివరాత్రి అన్నమాట.

శివుడు అనాది; ఈజగత్తుకే పునాది. ఆ శివుడు "స్థాణు" రూపంతో ప్రపంచం ముందు ఆవిర్భవించింది ఈ రోజే. ఈ సృష్టిలో కదలని - చెదరని ఒక మహాతత్త్వానికి ప్రతీక శివలింగం. ఆ శివలింగమే స్థాణువు.

అయితే ఈ స్థాణువు నిత్య చైతన్యంగా వెలిగేదే. చలించదంటే అర్థం స్థిరంగా ఉంటుందనే తప్ప చైతన్యం లేనిదనికాదు. జీవుడు శివుడు కావాలంటే ఇలా స్థిరంగా ఉండాలనే అర్థం. ఇది స్థాణువైన ఆ పరమ శివుని ప్రతీకాంతరార్థం.

ఒక కాలంలో శివరాత్రి నుండే సృష్టిప్రారంభమైందని విశ్వసించారు. వసంతాగమనం ముందు వచ్చే శివరాత్రి అయినందువల్ల, వసంతం సంవత్సర ప్రారంభంలోనే వస్తున్నందు వల్ల అలా భావించడం జరిగింది. భావించడమే కాదు పాటించారు కూడా. ఇప్పుడు పాటించడం లేదు, కాబట్టి మనం భావిస్తున్నాం.

బ్రహ్మ విష్ణువులిద్దరు నేను గొప్పంటే నేను గొప్పని పోటీపడ్డారు. అప్పుడు శివుడు పరీక్ష పెట్టాడు. భూమ్యాకాశాలవరకు స్థూపాకారంగా శివ లింగరూపాన్ని ధరించి, దాని ఆద్యంతాలు కనుగొమ్మన్నాడు. ఇరువురూ కనుగొనలేకపోయారు. దైవానికి ఆద్యంతాలు లేవనే అర్థం.

ఇదేదో పురుష లింగ రూప అర్చన అని కొంత మంది వైదేశికులు, వైదేశిక భావ బానిసలు విమర్శిస్తున్నప్పుడు స్వామీ వివేకానంద వారి భావజాలాన్ని ఖండించారు. విగ్రహారాధకులైన హిందువులు స్థూపాకార స్థాణురూపాన్ని ఆరాధించేవారనీ, అదే రాను రాను శివలింగంగా పరిణమించిందని స్వామీజీ అభిప్రాయపడ్డారు. అందువల్ల లయకారుడూ శివంకరుడూ అయిన శివునికి ప్రతీక శివలింగమన్న మాట. ఆ శివలింగం శివరాత్రి నాడే ప్రాదుర్భవించింది.

ఈ రోజు భక్తులు ఉదయమే లేస్తారు. స్నానాద్యనుష్ఠానాలు నిర్వర్తిస్తారు; ఆర్వాత శివపూజ చేస్తారు. రోజంతా ఉపవాసంతో ఉంటారు. శివధ్యాన నిమగ్నులై గడుపుతారు. రాత్రంతా జాగారం చేస్తారు. శివపూజలు నిర్వహిస్తూ అభిషేకాలు చేస్తూ, శివలీలా కథనాలు వింటూ గడుపుతారు. శివక్షేత్రాల్లో ఉత్సవాలు గొప్పగా నిర్వహిస్తారు.

ఈ శివరాత్రి నాడు పూజలు తెలిసిచేసినా తెలియక చేసినా ముక్తి సిద్ధిస్తుందనే కథలెన్నో ఆయా పురాణాలూ భక్తుల కథలూ తెలియజేస్తున్నాయి. ఒక బోయవాని కథ, సుకుమారచరిత్ర, చిత్రభానుని కథ, విలసత్ అనే రాజకథ, ... ఇలా ఎన్నో కథలూ గాథలూ శివరాత్రితో ముడిపడి ఉన్నాయి. ఇవేగాక ఎన్నో శివలీలలు ఈ సందర్భంలో జంగం కథలుగా పురాణాలుగా, హరికథలుగా చెప్పుకొంటారు. పల్లెల్లో అయితే జానపదులు కొమిరెల్లి మల్లన్న కథనూ, శ్రీశైలం మల్లికార్జున స్వామి కథను వేములవాడ రాజన్న కథను చెప్పుకొంటారు.

శివరాత్రికి సంబంధించి భక్తులు ఇలా వ్యవహరించడం వెనుక, జీవుడే శివుడు కావాలనే తపనుందని గ్రహించాలి. ఈ తపన కారణంగానే జీవుని కెన్నో సంస్కారాలీ సందర్భంగా అందించడం జరుగుతోంది. లోకమంతా "శివమయం" కావాలనే కోరిక వెనుక "శివరాత్రి" సంస్కారాలందించే ప్రయత్నం అందరూ చేయాల్సి ఉంది మరి!



19. నైతిక విలువల ప్రాధాన్యం

దేశంలో నైతిక విలువలు తగ్గిపోతున్నందు వల్లనే ఇంత దుస్థితి దాపురించింది అని ధర్మాచార్యులందరు ఉద్ఘోషిస్తున్నారు. బిహార్లో గడ్డితిన్నారు; ఢిల్లీలో గృహాలు మేశారు; భూములు తినాల్సిన ఎరువుల్ని ఇంద్రప్రస్థంలో ఆంధ్రప్రదేశ్‌లోని మనుషులే కాజేశారు. విదేశీ డాలర్లకు దేశంలో ఎందరో అమ్ముడుపోతున్నారు.

ఎందుకివన్నీ జరుగుతున్నాయి? అర్థం మీద వ్యామోహం వల్ల! రెవిన్యూ, ఎలక్ట్రిసిటీ, పంచాయతీరాజ్, ఆప్కారి, పోలీసు తదితర కార్యాలయాల్లో కాగితాలు ఎంతెంత మేస్తున్నాయో లెక్కా పక్కాలేదు. అర్థ వ్యామోహం ఇంతంగా ఎందుకు పెరిగిపోయింది?

ఆదిశంకరుల నుండి మలయాళ స్వాముల వరకు ఇంతమంది అర్థకామాన్ని ధర్మమోక్షాల మధ్యన నియంత్రించాలని చెవినిల్లు గట్టుకొని పోరినా మనిషి ఈ రెండింటికి వశమై ఎందుకు నైతికంగా పతనమవుతున్నాడు. వీటి మీద అదుపు ఎందుకు సాధించలేకపోతున్నాడు.

పుట్టుకొచ్చే కోరికలన్నీ తీర్చుకోడమే బ్రతుకైతే పశువుకూ మనిషికి తేడాఏంటి! ఈ పతనం మనిషిని ఏదిశవైపు తీసుకొని వెడుతుంది!

ఒక సంప్రదాయం స్థిరపడుతుంది. దానిని విశ్వసించే ప్రజలుంటారు. నైతిక విలువలకు విశ్వాసానికి సంఘర్షణ కలుగుతుంది. అప్పుడు నైతిక విలువలకే ప్రాధాన్యమివ్వాలని చాణక్య నీతిశాస్త్రం చెబుతున్నది.

ఒక అవినీత పని వల్ల లాభం పొందే అయిదార్గురు వ్యక్తులు, అధికారిని ప్రలోభపరిచి లంచమిచ్చి తమ పని నొక్కించుకొన్నారనుకొందాం. ఆ అధికారి ఇది బాగానే ఉందే, జీతం కంటే గీతం మరీ బాగుందే అని ఆ గీతలోనే నడిస్తే, ఆ దుష్ట సంప్రదాయాన్ని ఆపవలసిందని అతనిలోని "నీతి" మనిషి పోరుపెడితే మనిషి ఎటువైపు మొగ్గాలి! అలా మొగ్గక దుష్టసంప్రదాయాన్నే అనుసరిస్తే అతనిలోని వాసనారూపి సంస్కారి మేల్గాన లేదనాలి.

"చేపలు అమ్మే మత్స్యకారులు, ఆ రోజు అక్కడక్కడ అమ్మి ఇంటిదారి పట్టారు. కొంత దూరం వచ్చింతర్వాత పెద్ద వర్షంలో చిక్కుకొన్నారు. అయ్యో! నానిపోతున్నామే అని దగ్గరలో ఉన్న ఓ ఇంటి అరుగుమీదకి చేరారు. పెద్ద వర్షం; రాత్రి సమయం. ఆ అరుగుకూడా వారిని రక్షించలేకపోతున్నది. తడిసి వణికి పోతున్న ఆ మత్స్యకారులను చూచి ఆ గృహయజమానిలోనికి వచ్చి పడుకొమ్మన్నారు.

అందరూ సంతోషంగా లోనికి వెళ్లిపడుకొన్నారు. ఆ గృహం యజమాని పూల వ్యాపారం చేస్తుంటాడు. ఇంటి నిండా పూలు కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. ఇల్లంతా రకరకాల పరిమళాలతో నిండి ఉంది. ఆ సుగంధానికి మత్స్యకారులకు నిద్ర పట్టడం లేదు. ఒకరొక్కరుగా లేచి వెళ్లి బయట అరుగు మీద పెట్టి వచ్చిన తమ ఖాళీ చేపల బుట్టలను తెచ్చుకొని ముఖం మీద కప్పుకొని పడుకొన్నారు. వెంటనే మత్స్యకారులందరు గాఢ నిద్రలోకి వెళ్లిపోయారు."

అయితే చేపల పని, చేపల వాసన తప్పనే ఉద్దేశ్యంతో ఈ ఉదాహరణ ఇవ్వలేదు "దుర్గంధం దుష్ట సంప్రదాయానికి ప్రతీక; పుష్ప పరిమళం సత్సంప్రదాయానికీ - నైతికతకు ప్రతీక". ఈ దృష్టితోనే పైసంఘటనను అన్వయించుకోవాలి.

నీతిని అంగీకరించలేనంతగా దుష్ట సంప్రదాయాలు పాతుకుపోతే ఇక అతను శిక్షార్హుడే అన్న మాట.

"అప్రణీతోహిదండః

మాత్స్య న్యాయముద్భావయతి"- దండనమే లేకపోయినట్లయితే సమాజంలో చేపల వ్యవస్థ నెలకొంటుందని ఆర్యోక్తి. అంటే పెద్ద చేప చిన్న చేపను తింటుందన్న మాట. దీనినే మాత్స్యన్యాయమంటారు. బలవంతుడు బలహీనుణ్ణి దిగమ్రింగరాదు. కారు నడిపేవాడు కాలినడకన పోయేవాని క్షేమం కోరుతూ కారు నడపాలి.

భారతీయ ధర్మశాస్త్రంలో నైతిక విలువలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. మనిషిని తీర్చిదిద్దడానికే "నీతిశాస్త్రం" ఆవిర్భవించింది. అందుకే చాణక్యుడిలా అన్నాడు.

సంస్థయా ధర్మశాస్త్రేణ - శాస్త్రంవా వ్యావహారికం।
యస్మిన్నర్థే విరుధ్యేత - ధర్మేణార్థం వినిశ్చయేత్॥

- స్థిరపడ్డ సంప్రదాయం - నైతిక విలువల మధ్య లేదా సాక్ష్యం - నైతిక సూత్రాల మధ్య వైరుధ్యం కలిగితే, సంఘర్షణ సంభవిస్తే, అప్పుడా అభియోగాన్ని నైతిక విలువల ఆధారంగానే విచారించి నిర్ణయించాలి.

భారతీయ ధర్మశాస్త్రం సజీవంగా ఉండడానికి ఇలాంటి సార్వకాలీన - సార్వజనీన - విశ్వ విశాల భావాలే కారణంగా భావించాలి. మధ్యయుగాల దుస్సంప్రదాయాల్ని అనుసరించే విదేశీ జాతులు - విదేశీమతాలు ఎప్పటికి కనుదెరుస్తాయో, ఏనాడు వాస్తవాల్ని గుర్తించి సత్యమార్గాన్ని అనుసరిస్తాయో చెప్పలేం! కాలమే తీర్పు చెప్పాలి మరి!

20. రామాయణ సంస్కృతిని రక్షిద్దాం !!

ప్రతి సంగాలాగే ఈయేడు కూడా వాడ వాడలో శ్రీరామనవమి ఉత్సవాలు జరిగినై. వైభవంగానే జరిగినై. రామాయణ సందేశాన్ని అందించినై.

శ్రీరాముడు పుట్టిన తిథి - నక్షత్రం, కల్యాణ తిథి, నక్షత్రం, ఒక్కటి కావడం విశేషం. చైత్ర శు॥ నవమి, పునర్వసు నక్షత్రం. ప్రతి పునర్వసుకు మనం శ్రీరామకోటి జపయజ్ఞాలు నిర్వహించడానికి వెనుక ఉన్న కారణం కూడా ఇదే.

వందల వేల సంగాలు గడిచిపోయినా కొన్ని తిథుల్ని మరిచిపోలేం. అందులో శ్రీరామనవమి ఒకటి.

ఎప్పుడు దేశంలో రావణాసుర జాతి నిర్మాణమై, రామునికి సంబంధించిన అన్ని అంశాల్ని తుడిచివెయ్యాలని పనులు ప్రారంభిస్తుందో అప్పుడు శ్రీరామ నవమి లాంటి ఉత్సవాలు ఆగిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. ఆ ప్రమాదం వస్తుందని సూచిస్తూ నామమాత్రపు అశుభ ఘంటికలు వినిపిస్తున్నాయని కొందరంటున్నారు.

రాముణ్ణీ, రామాయణాన్నీ, రామరాజ్యాన్నీ వ్యతిరేకించే ఆసురీశక్తులు ఇవాళ కులంపేరిట, భోగవాదం పేరిట, అధికార వాదంపేరిట, విదేశీ కుతంత్రాలకు వశమైన సామ్రాజ్యవాదం పేరిట జడలు విరబోసుకొని పైశాచిక నృత్యం చేస్తున్నాయి. దేశంలోని హైందవీ శక్తిని అణచి వెయ్యాలని బృహత్ ప్రయత్నాలు ప్రారంభించాయి. స్వదేశంలోని హైందవ వ్యతిరేక శక్తులను కూడగట్టుకొని ఈ దేశంలో రామరాజ్య సంస్కృతిని నట్టేట ముంచాలని విషవ్యూహాలు పన్నుతున్నాయి.

'ఎందుకిదంతా' అన్న ప్రశ్నకు ఒకే ఒక్క సమాధానం.

'ఎన్నో ఒనరులున్న ఈ దేశాన్ని కబళించాలని'.... అంతే !

తాము కూచున్న కొమ్మనే తాము నరుక్కొనే భారతపుత్రుల నేమనాలి! ఏమన్నా అంటే వారు వినేస్థితిలో ఉన్నారా!

రాముణ్ణీ, హిందూ సంస్కృతినీ గ్రీకు చరిత్రకారులు, అరబ్బులు, బ్రిటిషువారు, అమెరికన్లు - పాశ్చాత్య చరిత్రవేత్తలు ఇలా ఎందరో విమర్శించారు. విమర్శ ఇది సహృదయ విమర్శకాదు. ఏకపక్షంగా తిట్టడమే!

అలా తాము తిడితే తమను అభ్యుదయవాదులంటారనీ, వాళ్ల ధర్మాన్నీ, మతాన్నీ, సంస్కృతినీ వాళ్లే ఎంతగొప్పగా తిట్టుకొంటున్నారనీ ప్రశంసిస్తారనీ నిజమైన సెక్యులరిస్టులు వారే అని పది మంది పొగడతారనీ..... తమను తామే తిట్టుకొని, కించపరచుకొని విదేశాల ముందు స్వదేశీ మానభంగం చేసే దేశద్రోహుల వల్లనే హైందవానికి ప్రమాద మేర్పడుతున్నది.

ఈ ప్రమాదం ముదిరి, స్వదేశీశక్తులు కుప్పలా కూలిపోక ముందే దైవభక్తులు - దేశభక్తులు తమ అస్తిత్వానికి, తమ రామాయణ సంస్కృతి అస్తిత్వానికి కృషి చేయవలసి ఉంది. ఈ కృషి చేయడానికి తాముకొంత సమయం తీయాలి.

మేము రైతులం, వ్యాపారులం, వృత్తిపనులు చేసుకొనే వాళ్లం, మేము ఎలా ఈ రామాయణ సంస్కృతిని కాపాడగలుగుతాం అని కొందరు ప్రశ్నించవచ్చు. మనసుంటే మార్గాలు కోకొల్లలు అన్న సంగతి అందరికీ తెలిసిందే!

మీ ఊర్లో ఒక గుడి ఉంది; లేదా మీరు నివసించే బస్తీలో ఉంది. ఒకటి కాదు, రెండూ మూడు నాల్గూ ఉన్నాయి. మీరు ఆ గుడి విషయంలో శ్రద్ధ తీసుకోవాలి. అక్కడ నిత్యం పూజలు - అర్చనలు జరిగేట్టు చూడాలి. దేవుళ్ల ఉత్సవాలు పవిత్రంగా నిర్వహించడంలో సహకరించాలి. పురాణాలు, హరికథలు, భజనలు ఉత్సవ సందర్భంలో జరిపించాలి. పర్వదినాల్లో ఆధ్యాత్మిక ప్రసంగాలు నిర్వహించాలి. విద్యార్థులకు, యువకులకు, మహిళలకు ఏవైనా ధార్మిక సంబంధి స్పర్ధలు ఏర్పాటు చేయాలి. గీతా పఠన పోటీలు, దాశరథీ శతక పద్యాల పోటీలు, వేదపఠన పోటీలు, ముగ్గులపోటీలు, ఎడ్ల పందాలు .... ఇలాంటివే ఏవైనా నిర్వహించవచ్చు. డప్పు, మద్దెల, హార్మోనియం తదితర వాద్యాల మీద కూడా పోటీలు పెట్టొచ్చు. మొత్తం మీద సమాజాన్ని దేవాలయ కార్యక్రమంలో కలిసిపోయేట్టు వేయాలి.

ఇవేగాక విజయదశమి, సంవత్సరాది, దీపావళి, సంక్రాంతి, గురుపూర్ణిమ (వ్యాస జయంతి) తదితర పర్వదినాల్లో పదిమంది గుడి దగ్గర కలిసేట్టు చేయాలి. ఈ పర్వదినాల సందర్భంలో తమ తమ ఇళ్లూ - గుళ్లూ, మన ధర్మచిహ్నాలైన కాషాయధ్వజం చేత, ఓంకారం చేత, స్వస్తిక్ చేత అలంకరించాలి. ఈ అలంకారాల్లో గాని, ధర్మ ప్రచారంలో గాని ఆధ్యాత్మిక బోధనల్లో గానీ శుచి - శుభ్రత, పఠన - పాఠనాదుల్లో గాని తానేం చేయగలిగితే అది చేయాలి. తన ధర్మ రక్షణలో ఇది ఉన్నతకార్యం, ఇది అల్ప కార్యం అనే మాట లేదు. ఈ దృష్టితోనే ముందంజ వేయాలి.

మనస్సుండాలి; తగిన సమయం తీయాలి. అంతే మన సమాజానికి - మన ధర్మానికీ మనమూ ఇంత చేశామన్న తృప్తి మిగులుతుంది.

21. సంక్రాంతి చైతన్య క్రాంతి

సూర్యుడు ప్రతిమాసం ఒక రాశిలో ప్రవేశిస్తాడు 1. మేష, 2. వృషభ, 3. మిథున, 4. కటక, 5. సింహ, 6, కన్య, 7. తుల, 8. వృశ్చిక, 9. ధను:, 10. మకర, 11. కుంభ, 12. మీన - ఇవే ద్వాదశరాసులు. ధనుస్సులో ప్రవేశించిన సూర్యుని ప్రస్థానం గమ్యం చేరి మకరంలో ప్రవేశిస్తుంది. మకరంలో ప్రవేశించడమే మకర సంక్రాంతి. మేషంలో చేరితే మేష సంక్రాంతి, మీనంలో చేరితే మీన సంక్రాంతి. ఇలా సంవత్సరంలో పండ్రెండు సంక్రాంతులుంటాయి.

ధనుర్మాసానికి ఎంతో ఆధ్యాత్మిక ప్రాధాన్యముంది. జీవాత్మయైన గోదాదేవి. విశ్వాత్మయైన రంగనాయకునిలో ఈ మకర సంక్రాంతి నాడే కలిసిపోయింది. అండాళ్ రంగనాయకుల కల్యాణం జరిగిందీ రోజే.

సూర్యుని తీక్షణ కాంతి ఈ రోజు నుండే సర్వజీవ కోటికి అనుభవంలోకి వస్తుంది. ముడుచుకుపోయిన సృష్టి వికాసం మహా వేగంగా జరుగుతుంది.

ఈ రోజే యమాలయం కవాటం మూయబడింది; సురాలయం తలుపు తీయబడింది. దక్షిణాయనాధ్యాయం సమాప్తమయింది! సూర్యనారాయణుడుత్తరాయణ పరాయణుడైన శుభ సందర్భంలో ఇవన్నీ జరిగినై. ఉత్తరాయణంలో వైకుంఠ ద్వారాన్ని తెరిచి ఉంచవలసిందని బలి విష్ణువును కోరినట్టు పౌరాణికులంటున్నారు.

సంక్రాంతి సందర్భంగా మూడు రోజులు భోగి సంక్రాంతి, కనుము పేర పండుగ జరుపుతారు. ఈ మూడూ మనుష్య దేవ పశుపక్ష్యాదుల తృప్తి నిమిత్తం నిర్వహించేవిగా అర్థాలు చెబుతారు.

సంక్రాంతి పొలాల పండుగగా ప్రచారంలో ఉంది. వర్షాకాలం పంటలన్నీ ఇంటికి వస్తాయి. ఆకారణంగా ఇల్లంతా సందడిగా ఉంటుంది. అల్లుండ్రూ కూతుళ్లతో కుటుంబం పరమానందంతో వ్యవహరిస్తుంది. సంక్రాంతి లక్ష్మి హేమంత వీధిని ఇలా వస్తుందని మహాకవి తుమ్మల అంటాడు.

కొసరి నూరిన పసపు పచ్చిపూత మొగాన
గుమ్మడి పూదుమారమ్మునద్ది
కండ రేగడనారబండి కన్పండువై
పొలుచు మిర్యపు పండు బొట్టు వెట్టి
వలిపెమ్మునకు నొక్కవాసి హెచ్చయినట్టి
నునుమంచు తెరచీర నూలుకొల్పి
బంతి పూవులను చేమంతి నెయ్యము గూర్చి
కబరీభరమ్ము చక్కనగుదిర్చి
పంట కళ్లాలు మును బరాబరులు సేయ
గూడు గట్టిన తెలిమబ్బు గొడుగునీడ
కదలి వచ్చెను భాగ్యాల కడలివోలె
మకర సంక్రాంతి లక్ష్మి హేమంతవీథి" (పరిగ పంట)

మకర సంక్రాంతి లక్ష్మి గుమ్మడి పూల పుప్పొడిని పసపు పచ్చిపూతలాగా ముఖానికి పూసుకొన్నది. కండరేగడలో ఆరపండిన మిర్యపుపండు బొట్టును పెట్టుకొన్నది. నునుమంచు తెరనే చీరగా ధరించింది. కేశపాశంలో బంతులనూ చేమంతులను తురుముకొన్నది. పంటకళ్లాలు స్వాగతం పలుకుతుండగా, తెల్లటిమబ్బునే గొడుగా ధరించి, భాగ్యాల సముద్రంలాగా మకర సంక్రాంతి లక్ష్మి వచ్చింది.

పండుగ మనకళ్లముందు ఓ భావచిత్రంలా నిలిచినట్లుంది. ఇలాంటి భావచిత్రాలే ఉత్సాహాన్నిచ్చి, జీవితాన్ని చైతన్యవంతం చేస్తాయి. సంక్రాంతే ఒక చైతన్యక్రాంతి.

22. కుక్కమనస్సు - మనిషిమనస్సు

మనిషి మననం చేస్తాడు: మననం చేసేది మనస్సు. చేయకుండా మనస్సు ఉండదు. మంచి నిమిత్తం మననం చేయాలి. కాని చెడు నిమిత్తం మననం చేస్తే - అది కూడా మనస్సే.

చెడు నిమిత్తం చేయగూడదని నిర్ణయించేది కూడా మనస్సే. ఆ నిర్ణయాన్ని అమలు పరచాలని నిశ్చయాత్మక భావనను నిలిపేది కూడా మనస్సే. ఇలాంటి నిశ్చయాత్మక మానసిక భావననే బుద్ధి అంటాం.

ఇంతకూ ఈ మనస్సేమిటి! బుద్ధి యేమిటి! ఓ ఉదాహరణ ద్వారా తెలుసుకొందాం.

అదో వీధి. ఆ వీధిలో ఓ మిఠాయి దుకాణం ఉంది. మిఠాయి నేతి వాసన వీధిలోకి వస్తున్నది. ఆదారిన పోయేవారి నోరూరే విధంగా ఆ మిఠాయిలు కనిపిస్తున్నాయి.

ఆదారి గుండా ఓ కుక్క పోతున్నది. దానికి మిఠాయిని చూడంగానే నోరూరింది. అది వెంటనే మిఠాయి దుకాణంలోకి దూరి నోటి కందినంత మిఠాయి కరుచుకొని పరుగెత్తింది.

ఆ మిఠాయి దుకాణం యజమాని దొంగకుక్క!... దొంగ కుక్క అంటూ అరుస్తూ, దాని వెంటబడి ఓ కట్టె విసరేశాడు. అది కట్టె కందనంత వేగంగా పరుగెత్తి - దొరకకుండా పారిపోయి ఓ దగ్గర కూచొని, నోట్లో కరుచుకొని వచ్చిన మిఠాయిని తాపీగా తిన్నది. మళ్ళీ అలా వచ్చి ఓ చోట నిలబడి ఆ మిఠాయి దుకాణం దిక్కు చూస్తూంది. మళ్లీ తతంగం యథావిధే అనుకోండి!

ఇలాగే ఓ మనిషి ఆదారిన వస్తున్నాడు. ఒక్కడేం కర్మ ఎందరో వస్తున్నారు; వస్తుంటారు పోతుంటారు. కొందరు తమ దారిన తాము పోతారు; అక్కడ మిఠాయి దుకాణం ఉందని కూడా వారు గుర్తించరు. మరికొందరు గుర్తించినా పట్టించుకోరు. కావాలను కొన్న కొందరు కొనుక్కొని పోతారు.

ఇందరిలో అతనో వ్యక్తి. అతనికి మిఠాయి చూడగానే నోరూరింది. ఎలా ఎత్తుకపోదా మచ్చా అనుకొన్నాడు. అనుకొన్నాడంటే మనస్సే అనుకొన్నది. ఆ మనస్సు

వెంటనే దొంగతసం తప్పు సుమా అన్నది. అంతేకాదు నాలుగు డబ్బులు సంపాదించుకో! అందులో కొంతపెట్టి మిఠాయి కొనుక్కో అన్నది. నోరూరుతున్నది; ఊరేట్లు మనస్సేచేస్తున్నది; నీతి మనస్సు చెబుతున్నది.

నోరూరిన వైపు మనస్సు మొగ్గి, మిఠాయి కొట్టులో ప్రవేశించి, మిఠాయి ఎత్తుకొనిపోతే ఆ మనిషి మనస్సు కుక్క మనస్సన్నమాట. అలాకాక మనస్సు ఆకర్షణను నిరోధించి, మనిషి యేర్పాటు చేసుకొన్న కట్టుబాట్ల హద్దుల్లో ఉండగలిగితే ఆ మనిషి మనస్సు, మనిషి మనస్సన్నమాట.

ఏ విధంగా చూచినా మనిషి మనస్సే కదా అని కొందరనవచ్చు. కుక్క ఆలోచనలున్న మనిషి మనస్సన్న మాట.

మానవుడు మృగతత్త్వం నుండి మనుష్యత్వం వైపు ఎదిగి వచ్చాడు. కాని జంతువు వైపే లాక్కొని పోబడితే అతను మనిషి తోలు కప్పుకొన్న జంతువు అని అర్థం.

బంధానికి కానీ, మోక్షణానికి కాని మనిషి మనస్సే కారణం అనడంలోని పరమార్థం కూడా ఇదే.

"ఎఱుక" కలిగి మెలగాలి అని అచ్చ తెనుగులో చెప్పుకొంటామే ఆ ఎఱుక (జ్ఞానం) కలగాల్సింది మనస్సుకే. అందువల్ల శరీరంలో ప్రాణానికెంత ప్రాధాన్యమున్నా, అడుగడుగునా నుడుగునుడుగునా ఆ శరీరాన్ని కదలించేది మనస్సే.

కాబట్టి మనస్సును నిగ్రహిస్తావా! నీవిక అన్ని పాపాలకు దూరంగా ఉన్నట్లే లేక్క!

జీవితం కూడా ఓ లెక్కలో నడవాలంటే తప్పదు మరి!

"కన్నుదోయికి నన్యకాంతలడ్డంబైన మాతృభావన చేసి మఱలువాడు" అన్న పోతన్న ప్రహ్లాదుడు అచ్చమైన మనో నిగ్రహమూర్తి. ఆ ప్రహ్లాదుడు మామూలు మనస్సున్న మనిషికాదు. "తన యందు నిఖిలభూతములందు నొక భంగి- సమహితత్త్వంబున జరుపువాడు".

అలాంటి వారే బుద్ధులవుతారు; రస సిద్ధులవుతారు; మహా ప్రసిద్ధులవుతారు; నిజంగా దేవుళ్లవుతారు.

ఇక ఇప్పుడు మనిషి నిర్ణయించాలి - తనకు కుక్క మనస్సుండాలా! లేక మనిషి మనస్సుండాలా!

* * *

23. దీపావళి దివ్యార్థాలు

దీపావళికి అనేకార్థాలున్నాయి; అన్నీ నరకాన్ని నిరసించేవే! వెలుగును ఆశించేవే!

1. లోక కంటకం నరకం (పాపం-కాలుష్యం), ఆ నరకాన్ని సత్యభామా శ్రీకృష్ణులు (జీవాత్మ-పరమాత్మలు) తొలగించారు. అదీ చతుర్దశి రోజున. లోకమంతా ఆ మరుసటి రోజు దీపాలు వెలిగించుకొని పండుగ జరుపుకొంది. అందువల్లనే దీపావళి పేరు స్థిరపడింది.

2. నరకం - చీకటి రెండూ ఒకటే. చీకటి పోవాలి. వెలుతురు రావాలి. దీపాల ద్వారా చీకటి దూరం చేశారు. కాంతి ప్రసరించింది. దివ్య దీపావళి జరుపుకొన్నారు.

3. దేవతలంటే దివ్యులు. ఆ దివ్యత్వాన్ని బలి తీసుకొన్నాడు. అందువల్ల అతను 'బలి' అయ్యాడు. బలి పాతాళంలో ఉన్నాడు. పాతాళానికి వెలుతురుపోదు. వెలుతురు అక్కడికి ప్రసారించడానికి దీపాలు పెట్టారు. త్రివిక్రముని మూడోపాదం పాతాళం వరకు సాగింది. దీపావళి అహంకారాన్ని తొక్కి వేస్తుందని అర్థం.

4. లక్ష్మీదేవి అక్క జ్యేష్ఠాదేవి. ప్రతి గృహంలోనూ చీకటి కోణాల్లో దాగి ఉంటుందా తల్లి. కొందరి మొగం మీద కూడా తాండవిస్తుంది. దీపాలు వెలిగించి ఈ జ్యేష్ఠ దేవిని పారద్రోలి లక్ష్మిని ఆహ్వానించాలి. అందుకే లక్ష్మిపూజ సంప్రదాయబద్ధమైన ఆచారం అయ్యింది.

5. దీపావళీ నాడు చెల్లెండ్రు, అక్కలు తమ సోదరులకు మంగళ హారతితో ఆశీర్వదిస్తారు; అభినందిస్తారు సోదరీ సోదరులు పరస్పర నూత్నవస్త్రాలు బహూకరించు కొంటారు. తీపి పదార్థాలు పంచుకొంటారు. దీపావళి తర్వాతి రోజు చెల్లెలు యమున అన్న యమునికి ప్రాచీన కాలంలో ఈ విధంగానే హారతి పట్టి ఆదరించింది. ఆనాటి ఈ సంప్రదాయం ఇప్పటికీ పాటిస్తున్నారు.

6. శ్రీరామ చంద్రుడు రావణ సంహారం చేసి తిరిగి వచ్చాడు. అంతవరకు పాదుకా పట్టాభిషేకం చేసి 14 సం॥గా భరతుడు రాజ్య పరిపాలన చేశాడు. శ్రీరాముడు ఆ

తమ్ముణ్ని కలిసిందీ రోజే. అందుకే ఈ రోజును "భరత్ మిలాప్"గా భావిస్తారు. ఆ అన్నదమ్ముల కలయికకు గుర్తుగా దీపాలు వెలిగిస్తారు.

7. విక్రమార్కుడు (విక్రమాదిత్యుడు) విదేశీయులైన శక్తులను తరిమి శకారి - శకపురుషుడుగా కీర్తింపబడ్డాడు. ఈ విక్రమార్కుడు పట్టాభిషేకం జరుపుకొన్నదీ రోజే. ఆ పట్టాభిషేకానికి గుర్తుగా దీపాలు వెలిగించుకొంటున్నారు.

8. ముద్రారాక్షసాది గ్రంథాల్లో ఈ అమావాస్యను కౌముదీ మహోత్సవంగా జరుపుకొన్నట్లున్నది. కౌముది అంటే వెన్నెల. వెన్నెల పండుగ అన్నమాట. దీపాలు వెలిగిస్తేనే అమావాస్య కౌముదీమయమవుతుంది. ఈ ఆశ్వయుజ అమావాస్య అలా వెన్నెల పండుగ అయ్యిందన్నమాట.

9. జైనులు మహావీరుని నిర్యాణదినంగా ఈ పండుగను నిర్వహించుకొంటారు. మహావీరుడు మృతి చెందిన స్థలంలో దేవతలు దీపాలు వెలిగిస్తారని వారి విశ్వాసం. ఇలా వారికి కూడా ఇది దీపాల పండుగ అయ్యింది.

10. ఇంతకు పూర్వమే వర్షాలు పడతాయి. ఆకులూ, చెత్తా చెదరం కుళ్లి ప్రకృతిలో దుర్గంధం వ్యాపిస్తుంది. కొన్ని క్రిములూ పుట్టుకొనివస్తాయి. ఈ దుర్గంధం, ఈ విషక్రిములు హాని కలిగిస్తాయి. అందుకే పొటాష్‌తో చేయబడ్డ పటాసులు కాలుస్తారు. దాని వల్ల ప్రకృతి నిర్మలమవుతుంది; నరకం స్వర్గంగా మారిపోతుంది.

ఎన్ని చీకట్లు ముసురు కొన్నా అవన్నీ తాత్కాలికమే. వెలుతురే శాశ్వతమయింది. మన పక్కనే చీకటి ఉంది; వెలుతురు ఉంది. చీకటిదారుల్లో వెలుతురు రేఖల్ని ప్రసారిస్తూ వెళ్లిపోవడమే జీవితం. ఇదే దీపావళి సందేశం - సందేశ పరమార్థం.

24. మృత్యు భయం వీడండి!

ఈ కష్టాలనుభవించడం కన్నా చావడమే మేలు అని కొందరనుకొంటారు. అయ్యో! నేను చచ్చిపోతానా అని చాలా మంది చింతిస్తుంటారు.

పరీక్షిత్తుకు తాను చనిపోవడం తప్పదు అని తెలిసిపోయింది. అయితే ఇంకా ఏడు రోజుల సమయముంది. ఈ ఏడు రోజుల్లో తానేం చేయాలి అనుకొన్నాడు. శుకమహర్షి చెప్పే భాగవతం వినాలని నిర్ణయించుకొన్నాడు. ఈ భాగవతాన్ని వ్యాసులవారు వ్రాశారు. శుకుడు దీన్ని ప్రచారం చేస్తున్నాడు.

ఇది భగవంతుని కథ; భగవద్భక్తుల కథ; భక్తిముక్తిదాయకమైన కథ. ఈ విషయమే శుకయోగి పరీక్షిత్తుల వారికిలా తెలిపారు.

ఏనుమృతుండనౌదునని యింత భయంబు మనంబు లోపలన్
మానుము. సంభవంబు గల మానవ కోటికి చావు నిత్యమౌ
కానహరిం దలంపు. మిక కల్గదు జన్మము నీకు ధాత్రిపై
మానవనాథ! పొందెదవు మాధవలోక నివాస సౌఖ్యముల్

- నేను చనిపోతాననే భయం మనస్సులో నుండి తీసెయ్. పుట్టుక ఉన్న మానవ సమూహాలకు చావు తప్పదు. శ్రీహరిని తలంచుకో! ఈ భూమి మీద మళ్లీ మానవజన్మ కలుగదు. ఆపై నీవు వైకుంఠంలోని సుఖాలే పొందుతావు.

"జాతస్య మరణం ధ్రువమ్" అన్న గీతా వాక్యమే ఇక్కడ వివరింపబడింది. మృత్యు భయం మానవ సహజం. భయం భయంతో బ్రతికే దెందుకు! బ్రతికినన్నాళ్లు ధైర్యంగానే బ్రతుకాలి. పోయేవాళ్లను ఎవరేం పట్టుకోరు. పట్టుకొన్నా శరీరంలో ప్రాణం నిలువదు. అది శరీరం విడిచి వెళ్లిపోతుంది.

ఈ శరీరం పొందిన సుఖాలన్నీ సత్యాలే అని భ్రమించిన వ్యక్తి, ఆ సుఖాల కొరకే ఈ శరీరం ఉండాలని వాంఛిస్తాడు. అయితే చివరి దశలో ఆ సుఖాలే రోగాలుగా పరిణమిస్తుంటాయి. అది రోగమని తెలిసినా సుఖమనే భ్రాంతిలోనే ఉంటాడు.

కాళ్లు కదలకున్నా, కళ్లు చూడకున్నా, అధికార పీఠం వదలిపెట్టాలనిపించదు. శారీరిక సుఖం విషయంలోనూ ఇంతే. ఇంద్రియాలు సుఖాలవైపు పరుగెత్తుతుంటాయి. వాటి శక్తి తగ్గిపోయినా తపన మాత్రం చావదు.

అందుకే దేనికైనా పరిత్యాగ భావన అవసరం అని పెద్దలు చెబుతూనే ఉన్నారు. ఇది నాది కాదు అనే భావన పెరగడం వల్ల ఈదేహం విషయంలోనూ అదే నిర్ణయానికి రావడం జరుగుతుంది. ఈ నిర్ణయానికి రావాలంటే హరికథలు వినాలి; హరినామ స్మరణ చేయాలి.

"హరిం దలంపుమిక కల్గదు జన్మము నీకు ధాత్రిపై" అని శుకయోగి అనడంలోని ఉద్దేశ్యం ఇదే.

నవ విధభక్తుల్లో స్మరణం ఒకటి. స్మరణమే మెల్లగా ధ్యానానికి దారితీస్తుంది. నేరుగా ధ్యానంలోకి వెళ్లిపోవడం సామాన్యునికి సాధ్యం కాదు. అందువల్ల క్రమ ప్రగతిని సాధించే ప్రయత్నం చేస్తాం.

అందుకే మరోవైపు నుండి వైరాగ్యభావాన్ని పెంచుకోవాలని చెప్పడం. వైరాగ్యం కారణంగా అసంగతత్వం పెరుగుతుంది. ఆదిశంకరులు చెప్పినట్లుగా "కరతలభిక్ష - తరుతల శయనా"నికే పరిమితమైపోతాడు. అప్పుడిక ఆసక్తి, ఆకాంక్ష పెరుగదు. అప్పుడు కుదురుకొనే ధ్యానం యోగ సమాధి స్థితి వంటిదే.

దీనివల్ల తానెత్తిన ఈ మానవావతారంతో పాప పుణ్యాలు సమానమైపోతాయి. ఎప్పుడు పాపపుణ్యాలు సమానమవుతాయో అప్పుడు మరో జన్మముండదు.

అయితే ఇదంతా భాగవతం సాధించి పెడుతుందా అంటే, అధ్యయనం ఆ విధంగా చేసిన వారే అందుకు సాక్ష్యంగా కనిపిస్తున్నారు. మరి, నాకు మరో జన్మలేదని చెప్పిందెవరు! అలా చెప్పినవారు ఆగతానాగత జ్ఞాన శక్తి గల వారనే చెప్పాలా!

దానికి నిదర్శనం ఏమిటి! ఇలాంటి అనేక ప్రశ్నలుత్పన్నమవుతాయి.

- ఇక్కడ ప్రస్తావించిన విషయమంతా అతీంద్రియశక్తికి సంబంధించింది కాదని మొదట గ్రహించాలి. ఇది వ్యక్తి సంస్కారానికి - వికాసానికి సంబంధించిందనే గుర్తించాలి. వ్యక్తి వికాసమే - సమాజ వికాసం. సమాజంలో శాంతికీ, ఏకతకు, సమగ్రతకు దోహదం చేసేది ఈ వికాసమే. సమాజానికి ఇన్ని విధాలుగా నేను సహకరించానని వికాసశీల కార్యకర్త అనుకొంటాడు. అనుకోవడమే కాదు తాను అందులోనే ఆనందాన్ని పొందుతాడు.

బంధంలేని ఈ ఆనందమే ముక్తి. శరీరంతో సాధించిన ముక్తి ఇది. ఏ బంధం లేకుండా వెడుతున్నానను కొనేవారు మళ్లీ జన్మించరు. ఈ ఉద్దేశ్యంతోనే హరి నామాన్ని స్మరించవలసిందని పరీక్షిత్తుకు శుకయోగీంద్రులవారు చెప్పారు. ●

25. కామ దహనం సాధ్యమా?

ప్రపంచంలోనే అతి విచిత్రమైన పండుగ కామదహనం. భారత దేశంలోని అన్ని ప్రాంతాల్లో జరుగుతుంది. ఇటలీ, ఫ్రాంసు తదితర పాశ్చాత్య దేశాల్లోనూ ఏదో ఒక పేర దహనం జరుగుతుంది. కొన్ని దేశాల్లో మన్మథ పూజే జరుగుతుంది.

ప్రతి సం॥లో చివర వచ్చే పౌర్ణమినాడే కామదహనం నిర్వహిస్తారు. దీనినే కాముని పున్నమి అంటారు. ఇదే ఫాల్గుణ పౌర్ణమి. ఈ రోజే హోలీ నిర్వహిస్తారు.

పూర్వం హోలిక అనే రాక్షసి రోజో మనిషిని తింటుండేది. ఓ ముసలమ్మ ఓ యోగి సలహాను అనుసరించి తన మనుమణ్ణి కాపాడుకోడం కొరకు పిల్లలందర్ని సమీకరించి హోలికను సంహరించేట్లు చేసింది. ఆ హోలిక చనిపోయిన రోజు అయినందువల్ల ఈ పున్నమినాడే హోలీ పండుగ జరుపుతున్నారు.

ఇక దీనికి కాముని పున్నమి, కామదహనం అనే పేరు రావడానికి కొన్ని కారణాలున్నాయి.

శివుడు తపో నిష్ఠా గరిష్ఠుడై ఉన్నాడు. శివపార్వతుల వివాహం వల్ల జన్మించే కుమారుడు (కుమారస్వామి) లోకకంటకుడైన తారకుణ్ణి సంహరిస్తాడని బ్రహ్మదులు చెప్పారు. తపస్సులో ఉన్న శివుడు పార్వతిని పెళ్లి చేసుకొనే దెలా! దేవతలు మన్మథుని సహాయం కోరారు. మన్మథుడు శివుడు తపస్సుచేసే శ్మశానాన్ని వసంతమయం చేశాడు. కాముడు శివునిలో కాముకత్వాన్ని నింపే ప్రయత్నం చేశాడు.

శివుని కంటి నుండి మంటలెగసినై. కాముడు బూడిదైపోయాడు. ఆ రోజు నుండి లోకం కామదహనం జరుపుకొంటున్నది.

శివుడొక ధర్మ కార్యంలో ఉన్నాడు. ఆ ధర్మకార్యాన్ని కాముడు భంగపరచాలని ప్రయత్నం చేసి తానే కాలిపోయాడు. అధార్మిక కార్యం కారణంగానే కాముడు కాలిపోయాడు.

అయితే ఇప్పుడు ధర్మకాముడు లేడా!

అధర్మ కాముడు చెలరేగడం లేదా!

ఈ రెండూ ఉన్నాయి. వైవాహిక జీవితంలోని కామం ధర్మబద్ధమైంది. దానికి భిన్నమైంది అధర్మ కామం. అంటే కామం వైవాహిక ధర్మం అనే చట్రంలో ఉండాలన్న మాట.

లేకుంటే!

ధర్మమే కామాన్ని కాల్చివేస్తుంది. ధర్మమే కాల్చి వేస్తుందంటే ధర్మశాస్త్రమే కాల్చి వేస్తుందన్నమాట!

భగవద్గీతలో భగవంతుడు తానే కామమన్నాడు కదా! మరి అధర్మ కామం ఎక్కణ్ణుంచి పుట్టుకొచ్చింది అనే ప్రశ్న వస్తుంది.

"ప్రజనశ్చాస్మికందర్పః" (10-28)

- ప్రజల ఉత్పత్తికి కారణభూతుణ్ణయిన కాముణ్ణి నేనే. దేవుడే కామమైతే కామమెందుకు తప్పుదారులు తొక్కింది అనే ప్రశ్న ఎవరికైనా సహజంగానే కలుగుతుంది. ఇలాంటి ప్రశ్నపుడుతుందనే గీత ఈ వాక్యానికి వ్యాఖ్యానం లాంటి స్పష్ట వివరణ మింకొకటి ఇచ్చింది.

"... ధర్మా విరుద్ధోభూతేషు

కామోఽస్మిన్ భరతర్షభ"

- జీవకోటుల్లో ధర్మ వ్యతిరేకం కాని కామాన్ని నేనే.

ధర్మవ్యతిరేకం కానిది అంటే దాంపత్య ధర్మాను గుణమైందే అని అర్థం. దంపతులు అష్ట విధ వివాహాల్లో ఏ పద్ధతి అనుసరించి వివాహం చేసుకొని సాంసారిక జీవనంలో ఉన్నా అది ధర్మ వ్యతిరేకం కాని కామమే అవుతుంది.

ధర్మార్థకామ మోక్షాలలోని కామానికి ముందు ధర్మం ఉందని గుర్తుంచుకోవాలన్న మాట. గుర్తుంచుకోకుండా నాటి రావణుని దగ్గరి నుండి నేటి రాబందుల దాకా ఎందుకు వ్యవహరిస్తున్నారనేదే ప్రశ్న.

ఇలా వ్యవహరించే వారి కామం దహనమవుతున్నదా! దహనం చేస్తున్నశివుడెక్కడున్నాడు.

ఇంతకూ కామం భౌతిక దహనమా! భావ దహనమా!

భౌతిక దహనం జరిగితే భావ దహనం జరిగినట్టా! భావ దహనం జరిగితే భౌతిక దహనం జరిగినట్టా!

రెండూ జరుగుతాయా! జరిగినాయా!

జరిగితే కామదహనం జరిగిన వెంబడే కాముని భౌతిక రూపం ఎందుకు నాశనం కాలేదు. భావం కూడా ఎందుకు నాశనం కాలేదు.

నాశనం కాకపోగా సర్వజీవ కోట్లలో ఇది విస్తరించిపోయింది. ఒక్క కాముడు చచ్చి కోట్ల కాముకుల్ని సృష్టించాడు. ఇప్పుడు సృష్టినిండా కామమే కామము. కామం ఇంకా సృష్టిస్తూనే ఉన్నది. ఆ కోటానుకోట్ల సృష్టిలో కోటానుకోట్ల కామం పెరుగుతూనే ఉన్నది.

శివుడు కేవలం రతీదేవి భౌతిక కాముణ్ణి తొలగించి, జీవి జీవిలో భావుక - భౌతిక కాముళ్లని సృష్టించాడు.

కాబట్టి కాముడు చావలేదు!

కామ దహనం జరుగలేదు!

- అయితే ఆధునిక విజ్ఞానం దృష్ట్యా, ఆరోగ్యశాస్త్రం దృష్ట్యా కాముడు చస్తాడు. కామదహనం జరుగుతుందనే తేలుతుంది.

ఇవాళ జీవకోటిని నాశనం చేసే ఎయిడ్స్ రోగం విశృంఖల లైంగికచర్యల వల్లనే వస్తుందని తేలింది. జీవ కోటి నాశనమైతే కామం ఎక్కడ ఉంటుంది. అధర్మకామం వల్ల ఎయిడ్స్ వస్తుందన్నమాట!

ఇప్పుడిలా అన్వయించుకోండి! అధర్మ కామ నాశనమే కామదహనమని! ఆకామదహనం కేవలం ఫాల్గుణ పున్నమినాడే కాదు జరగాల్సింది - ప్రతి క్షణం జరగాలని.

26. స్వధర్మాన్ని సంరక్షించాలి

"స్వధర్మేనిధనం శ్రేయః" అనే గీతా వాక్యాన్ని మనం వింటుంటాం. స్వధర్మంలో మరణమైనా శ్రేయమే అని ఆ శ్లోకపాదం అర్థం.

స్వధర్మమంటే మతమనీ, సంప్రదాయమనీ, తన విధి అనీ, కర్తవ్యమనీ తాను చేసే పని అనీ, తన గుణమనీ.... ఇలా. అర్థాలు ఎన్నో! ఆ అర్థాలకు వ్యాఖ్యానాలు ఎన్నో! ఎందరో వ్రాశారు. అగ్నికుండే వేడి, నీటికుండే చలువ ఇవి కూడా వాటివాటి ధర్మాలనే కొందరి అభిప్రాయం.

అశోకవనంలో తనను సతాయిస్తున్న రావణాసురునితో నీవు ధర్మం తప్పి వ్యవహరిస్తున్నావు అని సీత అన్నది. రాక్షసులకు పరధనాపహరణం, పరదారాపహరణం స్వీయధర్మమే అవుతుంది: అందువల్ల నేను నా ధర్మాన్ని నిర్వర్తించానే తప్ప ధర్మం తప్పి వ్యవహరించలేదు అన్నాడు రావణుడు.

రావణుడన్న ఈ మాట రాక్షసులందరి (ఆజాతి) సమష్టిధర్మమే అని భావిస్తే, రాక్షసుల్లోనూ మహాత్ములైన బలిచక్రవర్తులు, ప్రహ్లాదులు మిగిలేవారు కారు; చరిత్ర నిర్మాణకర్తలుగా ఈనాటికీ మార్గదర్శకులుగా ఉండేవారు కారు. అందువల్ల ఆనాడు రావణుడన్న ఆ మాట రావణుని స్వీయధర్మమే గాని జాతి సమష్టి ధర్మంకాదని తెలుస్తూనే ఉంది.

సమష్టి ధర్మం చట్టం లాంటిది. అయితే ఒక్కోసారి స్వీయ (వ్యక్తి) ధర్మం చట్టం కన్నా శ్రేష్ఠంగా కనిపించవచ్చు. అది యెలా ఉంటుందో ఒక ఉదాహరణ ద్వారా పరిశీలిద్దాం.

ఒక యువతి సినిమాలో నటిస్తున్నది. హావభావ విలాస ప్రదర్శనంలో ఏనాడూ ఆమె వెనుకంజ వేయలేదు. నటనతో జీవిస్తున్నది.

ఖోస్లా కమీషన్ మన సినిమాల్లో నటులు ముద్దులు పెట్టుకోవచ్చు అని తీర్మానించింది. అది చట్టమయ్యింది. ముద్దు పెట్టుకోవడం తన కిష్టం లేదన్నది నటి. తప్పదు నటించాల్సిందే అన్నాడు దర్శకుడు. ఇది భారతీయ సంస్కృతి విరుద్ధం అన్నది ఆ యువనటి. సినిమా సంస్కృతికి (చట్టం) ఇది అంగీకరించింది; అందువల్ల మీరు, మేము చెప్పిన విధంగా నటించాల్సిందే అన్నాడు దర్శకుడు.

"నా మనస్సు ఇలాంటి నటనకు అంగీకరించడం లేదు; ఇది నా స్వధర్మం; నా స్వధర్మాచరణంలో నేను మరణాన్నయినా అంగీకరిస్తాను; అదే నాకూ నా సమాజానికి శ్రేయస్సు కలిగిస్తుందని భావిస్తాను; నేను భావించినదాన్ని ఆచరిస్తాను; నలుగురూ ఆచరించాలని ఆశిస్తాను. నేను ఆశించే ఈ స్వీయధర్మం జాతిహిత కారకమనీ దేశహిత కారకమనీ నేను భావిస్తాను. ఎయిడ్ రోగమనే భయంకర మహమ్మారి విశ్వాన్ని కంపింపజేస్తున్న ఈ తరుణంలో నా స్వీయధర్మమే విశ్వధర్మం కావాలని కోరుకొంటున్నాను..." అని ఆ యువనటి గట్టిగా వాదించింది.

ఆ దర్శకుడు తన వాదనను అంగీకరించకపోతే నటి వృత్తి ధర్మాన్నే తాను వదలివేస్తానన్నది. ఇలాంటి ఉదాహరణలెన్నయినా ఇవ్వచ్చు.

సమష్టి అంగీకరించిన వృత్తి ధర్మం కన్నా వ్యక్తి ధర్మమే గొప్పదని యువనటి ఉదాహరణ తెలిపింది. పరధనాపహరణం పరదారాపహరణం సమష్టి ధర్మం కాదని, అది వ్యక్తి ధర్మంగా ప్రచారించుకొన్న ఇంద్రియ లౌల్యమనీ, అందువల్ల పదిమందికి మేలు కలిగించే సమష్టి ధర్మమే గొప్పదని రామాయణంలోని పాత్రల ప్రవర్తనల ద్వారా అర్థమవుతుంది.

ప్రజాస్వామ్యంలో అధిక సంఖ్యాక ప్రజానీకం అభిప్రాయమే సమష్టి ధర్మమవుతుంది. భారతదేశం లాంటి దేశంలో పాలకులు మొదటి నుండి అల్ప సంఖ్యా కుల సంతృప్తినిమిత్తం అధిక సంఖ్యాకుల హక్కులను బలిపెట్టడం జరుగుతుంది. విదేశీయులైన ముస్లిం పరిపాలకులకాలంలో అణచబడ్డది అధిక సంఖ్యాకులే. ఇవాళ కూడా అణచబడుతున్నది అధికసంఖ్యాకులే. ఆ నాడేమో మతం పెత్తందారీ తనాన్ని ఈ దేశీయుడు భరించాల్సి వచ్చింది. ఇవాళనేమో కుహనాసెక్యులరిష్టుల ధాష్టీకాన్ని భరించాల్సి వస్తుంది. వాస్తవాలు అణగదొక్కుతూ శివ, రామ, కృష్ణతత్వాన్ని మతవాదంగా ప్రచారం చేయడానికి కూడా ఈ కుహనా సెక్యులిరిస్టులు వెనుకంజ వేయడం లేదు.

ఈ మట్టి మీద ప్రేమ కలిగించేది మన ధర్మం. స్వీయధర్మానికి సమష్టి ధర్మానికి అద్వైతాన్ని సాధించే శక్తి మనకున్నది. హిందూ ధర్మమే మానవ ధర్మమని నిరూపించే శక్తి, ఈ ధర్మం అంతరాంతరాల్లో ఉన్నది. అదే ఏకాత్మతత్త్వం, ఈ తత్త్వం ఈనాడు భాషా, ప్రాంత, కుల, వర్ణ, వర్గభేదాలకు అతీతంగా భారతీయులందరినీ సంఘటనా పథంపై నడిపిస్తుంది. అయితే అది అర్థం చేసుకోవడానికి పరిశ్రమించాలి. ధ్యానం అనుష్ఠానం రెండింటికి మధ్య అంతరం దూరం కావాలి. ధ్యాన సిద్ధి ఫలం అనుష్ఠానం ద్వారా అర్థం కావాలి. ఈ దిశలో ధర్మానికున్న విశాలార్థాల్ని సమాదరించాలి. ధర్మమే మానవుడు సుమా అని నిరూపించాలి. ధర్మాన్ని రక్షిస్తే నిన్నా ధర్మం రక్షిస్తుందని ప్రచారం చేయాలి. ●

27. వీరశైవ సిద్ధాంత ప్రవక్త క్రాంతి వీరుడు బసవేశ్వరుడు

హిందూ జాతిలో మహా సంస్కర్తలెందరో అవతరించారు. ఆ వరుసలో బసవేశ్వరుణ్ణి ప్రముఖంగా చెప్పుకోవాలి. శైవత్వానికి వీరత్వాన్ని సమకూర్చి పెట్టింది ఆయనే.

చారిత్రక సామాజిక పరిస్థితులు

13వ శతాబ్దం. ఆంధ్ర దేశంలో కాకతీయ రాజ్యం కాషాయకాంతులు విరజిమ్ముతున్నది. అప్పటికే బ్రహ్మనాయని వైష్ణవం చాపకూటి సిద్ధాంతంతో, వర్ణాంతర వివాహాలతో, దేవాలయాల ప్రవేశంతో, స్వరమానవ సమానత్వాన్ని మరోసారి ప్రయోగాత్మకంగా చూపించింది. ఆ ప్రయోగాలకు వ్యతిరేకత లేకున్నా ఆ సంస్కరణల్ని మనసారా ఇంకా అందరు అభినందించడంలేదు; పట్టుబట్టి ఆచరించడానికి పూనుకోవడం లేదు.

జాతిలో కులభేదాలున్నాయి; వర్ణభేదాలున్నాయి; అస్పృశ్యత ఉన్నది; స్త్రీల విషయంలో వివక్షత ఉన్నది; కొందరికి దేవాలయాల్లో ప్రవేశం లేదు. మత భేదాలున్నాయి; రాజుల్లో భోగలాలసత ఉన్నది; ఆయా వృత్తుల్లో ఉన్నవారికి దేశం విషయంలో పెద్ద పట్టింపులేదు; పైగా మతాల (శైవ, వైష్ణవ, బౌద్ధ, జైన, గాణాపత్యాదులు) మధ్య వైషమ్యాలున్నాయి.

దేశం వాయవ్య దిశ నుండి విదేశీ ఇస్లాం మతోన్మాదులు దైవీతత్వానికే వ్యతిరేకంగా దాడులు సాగించారు. వారి దృష్టిలో వారి మతం, జాతి, సంస్కృతి తప్ప, మరొక మతం- జాతి - సంస్కృతులు ప్రపంచంలో ఉండకూడదు. ఇస్లాంను అనుసరించని వారిని వారు నీచాతి నీచంగా చూస్తారు. వారిని చంపుతారు; స్త్రీలనెత్తుకపోతారు; ఆస్తులు దోచుకొంటారు. అన్యమతస్తుల గుళ్లూ-బళ్లూ- పవిత్ర చిహ్నాలేవైనా నాశనం చేస్తారు. వారు ఉత్తరభారతంలో ఇలాంటి నాపాక్ (అపవిత్ర) కార్యాలెన్నో చేసి దక్షిణం వైపు చొచ్చుకొని వస్తున్నారు.

దక్షిణ హిందూదేశంలోని హిందువుల్లో ఉన్న లుకలుకలు, ఇది అసంఘటిత జాతి అని చాటుతున్నాయి. ఏ జాతి అసంఘటితంగా ఉంటుందో, దాన్ని జయించడం చాలా సులభం. ఈ బలహీనతలు వారికి సందివ్వగా, మతోన్మాదమే బలమివ్వగా హిందూ సంస్కృతి వినాశకారులై సైతానుల్లాగా చొచ్చుకొని వచ్చిన దైవ ద్రోహకజాతులవారిని ఎదిరించి నిలబడాలంటే, హిందువుల్లో వీరత్వాన్ని పూత్కారం చేయాల్సిన ఆవశ్యకత

ఏర్పడింది. ఆ సంక్లిష్ట పరిస్థితుల్లో ఖడ్గధారియై, తత్త్వవేత్తయై వీరశైవ సిద్ధాంత శంఖా (శంకర ఆరావాన్ని) రావాన్ని దిశలకు ఒత్తిన మహావీరుడు క్రాంతి పురుషుడు బసవేశ్వరుడు.

చాళుక్య రాజులు బలహీనులయ్యారు. అది ఆసరాగా తీసుకొని కలచూరి చాళుక్య బిజ్జలుడనే సామంతరాజు (మహా మండలేశ్వరుడు) స్వతంత్రాన్ని ప్రకటించుకొన్నాడు. కల్యాణ పట్టణానికి చక్రవర్తిగా ప్రకటించుకొని రాజ్యం చేస్తున్నాడు. ఆ బిజ్జలుని ఆస్థానంలోనే బసవన్న మహామంత్రిగా ఉన్నాడు; దండనాయకునిగా ఉన్నాడు. ఆయన వీరశైవ మతతత్త్వాన్ని సమానతా పథం మీద నడిపించాడు.

బసవన సంస్కరణలు

దేవదాసీ పద్ధతుల్ని నిర్మూలించాడు; స్త్రీకి స్వాతంత్ర్యం ప్రసాదించాడు. పురుషునితో స్త్రీ కూడా సమానురాలే అని చాటించాడు. కులమత వివక్ష అక్కరలేదన్నాడు. అందరినీ సమానంగా తమ ప్రభుత్వం చూస్తుందని చాటించాడు. హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పింలచాడు. కళలూ-సాహిత్యం-ఇవన్నీ మానవుణ్ణి ఉద్ధరించాలనిచాటాడు. కన్నడంలో వేలకొలది వచనాలు (పదకవితలు) వ్రాసి వ్యక్తి ధర్మాన్ని, రాజధర్మాన్ని, మానవధర్మాన్ని, దైవీతత్త్వాన్ని వివరించాడు. ప్రజలందరూ కాయకులు (దైవభక్తితో నిష్కామకర్మ చేసేవారు) కావాలన్నాడు. కాయకమే కైలాసమన్నాడు. సోమరిపోతుల్ని నిరసించాడు. పనిలోనే పరమాత్ముడున్నాడని చాటాడు. హిందువుల్లోని కులాలన్నీ ఒకటేననిచాటి పెద్ద కులం - చిన్నకులం వారికి పెళ్లిళ్లు చేయించాడు. ఈ వివాహాల్ని కొందరు వ్యతిరేకిస్తే అనుభవమంటపాన్ని నిర్మాణం చేయించి అక్కడే జరిపించాడు. అక్కడి నుండే తన బోధలు కొనసాగించాడు.

ఈ సంస్కరణల్ని చక్రవర్తి బిజ్జలుడు వ్యతిరేకించాడు. బసవేశ్వరుణ్ణి బంధించి చెరసాలలో వేయించాడు. బసవేశ్వరుడు తన పదవులన్నీ వదలిపెట్టాడు. సంస్కారప్రియులైన ప్రజలకు ప్రభువు మీద కోపం వచ్చింది. ప్రభువు బిజ్జలుడూ, అతని రాజ్యం పతనమైపోయింది. ఆ తర్వాత అనుభవ మంటపం దివ్యంగా వెలిగింది; దివ్య బోధలు చేసింది.

కాని ఇంకా కొందరు బసవేశ్వరుని సంఘటన సమానతాతత్త్వాన్ని అర్థం చేసుకోలేదు. బసవన విసిగిపోయాడు. కూడల సంగమం వైపుగా సాగిపోయాడు. ఆ కూడల సంగమంనీటిలో లీనమైపోయాడు.

బసవేశ్వరభవ్య పదాలు

మహాసంస్కర్త, మహావీర, క్రాంతిపురుష, సమానతా ప్రతిపాదక, వీరశైవ సిద్ధాంత నిర్మాత బసవేశ్వరుడిప్పుడు లేడు; కాని ఆయన కన్నడంలో అల్లిన పదాలెన్నో ఉన్నాయి. అవి దేశంలోని అన్ని భాషల్లోకి వచ్చి ప్రపంచాన్ని పారమార్థిక పథంవైపుగా పయనింపజేస్తున్నాయి. స్వేచ్ఛగా తెలుగులోకి అవతరించిన ఆపదాల్లో కొన్నిటిని చూద్దాం. మనమూ మన జీవితాల్ని పారమార్థిక పథం మీదుగా ప్రస్థానింపజేద్దాం.

★ శివభక్తుడుండేటి తావే కైలాసం
భక్తునింటికి ముందు ప్రాంగణం వారణాసి
కాయకమై కైలాసమిది సత్య మగును సంగమేశ్వరా!

★ కొమ్మమీద కోతిలాగుంది నా మనసు
మనసు తిరిగినదిక్కు ఎదతిరుగుతున్నాది
ఇంకనీ పాదాలు నాఎదలో తుమ్మెదలాగ నిల్పుతా

★ మద్యమాంసమ్ములను మరిపుచ్చుకొంటారు
దొంగవేషాలతో లింగాలు కడతారు
కాంక్ష నాశము కావలెగద సంగమేశ్వరా!

★ నమ్మకనే కొంత మంది నిను పిలుస్తుంటారు
నమ్మితె నీకైనీవే కనబడీ పల్కుతావు కద
కొమ్ములతో నినాదాలు చేస్తే ఒట్టిదేకదా!

★ పరిపూర్ణ మనస్సు నిలుపక పూజలెందుకు
బుద్ధీ శుద్ధీలేకుంటే పూజలు వ్యర్థంకదా
చిత్రం మీద బొమ్మ వల్ల మోజులు తీరుతాయా!

★ కులగుణాలు ఎవ్వరినీ అడగరాదు
లింగధారులయి కూడల సంగుని భక్తులు కావాలి
భక్తకాయమే మమకాయ మనగ సమాదరించాలి

ఈవిధంగా వేలకొలది భావ పదాలున్నాయి బసవేశ్వరునివి. ఆపదాలు వ్యక్తిలో భక్తినీ శక్తినీ నింపుతాయి. సమాజంలోని అందరిపైన ప్రేమ కలిగిస్తాయి. సత్య ధర్మ పదాల మీద నడిపిస్తాయి. అందుకే బసవేశ్వర దివ్య పదాలు పాడుకొందాం. బసవేశ్వరుని దివ్యపాదాలను తలచుకొందాం. పారమార్థిక మానవులమవుదాం.

28. గీతాజయంతి - జ్ఞాన యజ్ఞం

గీతనంతా నిత్యపారాయణం చేసేవారు నేటికీ కొందరున్నారు. కొన్ని అధ్యాయాలను చదివేవారున్నారు. కొన్ని శ్లోకాలను చదివేవారున్నారు. ఒకటి రెండు శ్లోకాలుమాత్రమే చదివి వాటి అర్థాలు మననం చేసుకొనే వారున్నారు. గీతార్థాలను మనస్సున పెట్టుకొని అనుష్ఠించే వారున్నారు. ప్రతి సంవత్సరం గీతా జయంతి సామూహికంగా నిర్వహించి గీతా ప్రచారం చేసేవారున్నారు.

అలాంటి గీతా జయంతి ప్రతిన సం॥ మార్గశిరశుద్ధ ఏకాదశినాడు నిర్వహించుకొంటున్నారు. ఈ రోజే శ్రీకృష్ణుడు అర్జునునకు రణరంగంలో గీతోపదేశం చేశారు. మనమందరం రోజూ పోరాటం (struggle) చేస్తూనే ఉన్నాం. ఉనికి కొరకు మనికి కొరకు పోరాటం తప్పదు. అయితే ఈ పోరాటం ఆత్మీయతతో చేస్తాం. అనురాగంతో చేస్తాం. "వర్గపోరాట సిద్ధాంతవాదుల్లో ద్వేషమే ప్రబలంగా ఉంటుంది. ద్వేషం వల్ల ద్వేషమే పెరుగుతుంది. ప్రేమ వల్ల ప్రేమే పెరుగుతుంది."

అర్జునుణ్ణి ధర్మరక్షణ నిమిత్తం శ్రీకృష్ణుడు పోరాటం చేయుమన్నాడు. అర్జునుడు కౌరవుల మీద ద్వేషంతో చేయలేదు పోరాటం. ధర్మం మీద ప్రేమతో చేశాడు.

గీతాజయంతి సందర్భంగా మనమూ ధర్మం మీద ప్రేమతోనే పోరాటం సాగిస్తామని దీక్ష స్వీకరించాలి.

మనది హిందూజాతి, హిందూధర్మం, హిందూ సంస్కృతి, హిందూ దేశం.

ఈ దేశధర్మ సంస్కృతుల ఉనికికీ, అస్తిత్వానికీ ప్రమాదం కలిగించే ప్రయత్నాలు ఏనాడో - ఎన్ని యేళ్ల క్రిందనో పాకిస్థాన్ లాంటి విదేశాలు ప్రారంభించాయి. ISI లాంటి విద్రోహక తీవ్రవాద విషవిద్వేషక సైతాన్ సంస్థలను దేశంలో ప్రవేశపెట్టి హిందూ ధర్మ చింతనాపరుల నెందరినో అవి సంహరించాయి.

అధికార పీఠాల మీద ప్రభుత్వాలకు చీమకుట్టినట్లయినా లేదు. ISI నీ, దాని పంచమాంగ దళాలనూ మూల మట్టంగా పెరికివేస్తే, వాటి భక్తులై వాటి కార్యకలాపాలను

ప్రోత్సహిస్తున్న ఇక్కడి ముస్లింలకు కోపం వస్తుందేమోనన్న, వాళ్ల ఓట్లు పడకుంటే తమ సింఘాసన పీఠాలు కదలిపోతాయేమోనని కపాల సింఘాసన సంతృప్తీకరణ రాజకీయ కుటిల సిద్ధాంతాలను అనుసరిస్తున్నారు.

ఇక్కడి భూమిపుత్రులైన హిందువులు, హిందుత్వం ఏమయిపోయినా సరే తమ సింహాసనం భద్రంగా ఉంటే చాలు అనుకొనే అన్నిరకాల పార్టీల వాళ్లు, వారికి వత్తాసు పలికే కుహనా సెక్యులరిస్టు కమ్యూనిస్టు మేధావులు (మేతావులు) మేము విదేశీ విద్రోహక శక్తులకు సాయం చేస్తున్నామని ఏనాడన్నా తలవంచుకొని, లెంపలు వాయించుకొని, ముక్కునేలకు రాసి పశ్చాత్తాపపడతారనే నమ్మకం ఎంతమాత్రం లేదు.

అటువంటి వారిని చరిత్ర ఏనాటికీ క్షమించదు. ఇలా అనుకొని చేతులు ముడుచుకొని కూర్చుంటే ధర్మరక్షణ జరుగదు.

భగవద్గీతాతత్వాన్ని తెలుసుకొని కూడా ఇంకా విషాదయోగంలోనే పడితే నీవేమి తెలుసుకొన్నట్లు! నరుడు విషాదంలో పడితే నారాయణుడేమన్నాడో ఒకసారి మళ్లీ గుర్తుకు తెచ్చుకోండి!

అథచేత్త్వమిమం ధర్మ్యం - సంగ్రామం నకరిష్యసి।
తతస్స్వ ధర్మం కీర్తించ - హిత్వా పాపమవాప్స్యసి॥
అకీర్తించాపి భూతాని - కథయిష్యన్తి తేవ్యయామ్।
సంభావితస్య చాకీర్తిః - మరణాదతిరిచ్యతే॥" (గీత - II 33, 34 శ్లోకాలు)

- "ఓ అర్జునా నీవీ ధర్మయుద్ధం చేయాలి. చేయకపోతే నీవు నీస్వధర్మాన్ని నిరసించిన వాడవవుతావు. కీర్తి పోగొట్టుకొంటావు. పాపం అనుభవిస్తావు.

అంతేకాదు ప్రజలు నీ అపకీర్తిని చాలాకాలం చెప్పుకొంటారు. గౌరవంగా బ్రతికిన వారికీ అపకీర్తి చావుకంటే అధికమయిందే".

నిన్ను, నీ కుటుంబాన్ని, నీ గ్రామాన్ని, నీ ప్రాంతాన్ని, నీ దేశాన్ని, నీ ధర్మాన్ని, నీ జాతిని, నీ సంస్కృతిని, కాపాడుకొనేశక్తి ఉండి కూడా ఊరుకొంటే నీదైనదేదీ' నీది కాకుండా పోతుంది.

నీవే నీవు కావు; నీ భూమి నీది కాదు; నీ దేశం నీదికాదు - అనుకోవడం విశాల భావనే.

నిజమే! ఇవేవీ నీవికావు. అన్నీ ఈశ్వరునివే. మరినీవో! వాటిని రక్షించే ధర్మకర్త ధర్మరక్షకునివి!

నీవు చేసేది కూడా ఈశ్వరీయ నీ కార్యం కాదు.

నీవుపుట్టిన చోటి నుండి నిన్ను వెళ్లగొట్టారు (కాశ్మీరు నుండి) ఆయా బస్తీల్లో తాము అధిక సంఖ్యాకులై నీ ధనమాన ప్రాణాల అస్తిత్వానికి ప్రమాదం కలిగిస్తున్నారు. ఇంకా ఉదాసీనతనా! కరుణశ్రీ గారి మాటల్లో ఈశ్వర ప్రబోధాన్ని వినండి!

ఔదాసీన్యము నుజ్జ గించుము వయస్యా! కర్మవీరుండవై
పాదమ్మూంచుము యుద్ధరంగమున నీ స్వాతంత్ర్య శంఖధ్వనుల్
వేదవ్యాస జయ ప్రబంధ కవితావేశమ్ములో మ్రోగు, ని
న్నాదర్శమ్ముగ జెప్పకొందరు భవిష్యద్భారతీయ ప్రజల్

నీవు ధర్మ రక్షకుడవైతే అక్షరుడవవుతావు - అని ఆశపెట్టడం కాదిది. ఈశ్వరీయ కార్యం చేయడానికి నీవీలోకంలోకి వచ్చావు. కాబట్టి చేయాలి. జయ (భారతం) ప్రబంధంలో అక్షరాకృతి ధరించడమనేది ఫలితం. ఆ ఫలితం ఎవరాపినా ఆగదు. వస్తుంది అంతే! ఆ ఫలితం ఈనరలోకానికి స్ఫూర్తినిస్తుంది. ఈశ్వరీయ మార్గంలో మేమూ నడవాలనే భవ్య దివ్య కర్మావేశ పరులనుగా ఈ మానవలోకాన్ని తీర్చిదిద్దుతుంది.

ప్రస్తుత హిందూ దేశంలోని సంక్లిష్ట - సంక్షుభిత పరిస్థితుల దృష్ట్యా గీతాజయంతి నాడు, గీత పరమార్థాలెన్నో చెప్పకొంటూ - ఈ దివ్య సందేశాన్ని కూడా పది మందికి మనం పంచిపెడదామా! గీతా జయంతి జ్ఞానయజ్ఞాన్ని సార్థకం చేద్దామా!



29. తమసోమాజ్యోతిర్గమయ

నీలో అగ్ని, నాలో అగ్ని, అంతటా అగ్నే అగ్ని. లోనున్నది సూక్ష్మాగ్ని, బయటున్నది భౌతికాగ్ని. లోని అగ్ని నిన్ను నిలుపుతుంది. బయటి అగ్ని అందరిని నిలుపుతుంది; జనంలో కలుపుతుంది; జనార్దనునిలో కలుపుతుంది.

పృథ్విలో అగ్ని, జలంలో అగ్ని, తేజస్సులో అగ్ని, ఎటు చూచినా అగ్నే అగ్ని.

కన్నుల్లో విద్యుదగ్ని, ఉదరంలో జఠరాగ్ని, సముద్రంలో బడబాగ్ని, అరణ్యంలో దావాగ్ని (దావానలం)

అలం(చాలు) అలం అనదు ఇది, అనలం (చాలదు-కావాలి) అనలం అంటుంది.

అలా అన్నా ఆ అనలంలో ఎంత సంయమం!

ఎప్పుడన్న జఠరాగ్ని నిన్ను కాల్చిందా! ఎన్న డన్న బడబాగ్నిని సముద్రం ఉమిసిందా! ఏ రోజన్న దావాగ్ని చెలరేగిందా!

అరే మనిషి! నీ మనస్సెంత చంచలంరా! ఆ అగ్ని ఉన్నచోట ఉన్నదే. నిత్య చైతన్యశీలమై కారు చీకటిలో కాంతిరేఖలు ప్రసరిస్తున్నదే!

నిద్రపోతున్నట్టేఉంది; నిత్య చైతన్య శీలంలోనే ఉంది. కాని నీవు నిద్రపోనివ్వవే! నిత్య చైతన్య శీలంతో సంయమనంతో దానిని సాగనివ్వవే!

అవని గర్భకుహరంలో, ఆకాశపుటంచుల్లో, అబ్ధి అంత రంగంలో అణువిస్ఫోటనం చేస్తావే! జగత్తు అతలా కుతలమై హాహాకారం చేస్తుంటే ఆనందిస్తావే!

"అగ్నిమీళే పురోహితం యజ్ఞస్య దేవమృత్విజమ్ । హోతారం రత్నధాతమమ్॥
అగ్నిః పూర్వేభిర్ఋషిభిరీడ్యో నూతనైరుత॥ సదేవాగ్ం ఏహవక్షతి॥
అగ్నినారయి మశ్నవత్ పోషమేవ దివేదివే॥ యశసం వీరవత్తమమ్॥
అగ్నేయం యజ్ఞమధ్వరం విశ్వతః పరిభూరసి । సఇద్ దేవేషు గచ్ఛతి॥
అగ్నిర్హోతా కవిక్రతుః సత్యశ్చిత్ర శ్రవస్తమః॥ దేవోదేవేభిరాగమత్॥
యద్గ దాశుషే త్వమగ్నే భద్రం కరిష్యసి । తవేత్ తత్ సత్యజ్గమ రః॥
ఉపత్వాగ్నే దివేదివే దోషావస్తర్ధియా వయమ్ । నమో భరన్త ఏమసి॥
రాజన్త మధ్వరాణాం గోపామృతస్యదీ దివిమ్ । వర్ధమానం స్వేదమే॥
సనః పితేవ సూనవేగే ఽగ్నే సూపాయనోభవ॥ సచస్వానః స్వస్తయే॥"

(ఋగ్వేదం, మం-1 అను-1 సూ-1, దేవతా- అగ్నిః, ఛన్దః - గాయత్రీ)

"ఈ అగ్ని విద్యాంసులచే పొగడబడింది. దివ్యశక్తులు ప్రయత్న పూర్వకంగా హవ్యాన్ని అందిస్తున్నాయి. అగ్ని దిన దినాభివృద్ధి చెందుతుంది. అధికారికి (అర్హత గలవానికి) ధనరాశి నిస్తుంది. సుతులను భృత్యులను సమకూరుస్తుంది. నాల్గుదిక్కుల్లో నాల్గు రూపాలతో అగ్ని హోత్రుడు వెలుగుతున్నాడు. ఇక యజ్ఞాలకు విఘ్నాలుండవు. దివ్యులకు యజ్ఞమే తృప్తినిస్తుంది. ఈ అగ్నికవి. హోత. సత్యవంతుడు. హవిస్సుతో సంపదతో ఉన్నవాడు. నవ్యదీప్తితో వెలుగువాడు. ఎక్కడ యజ్ఞం చేసినా విచ్చేసేవాడు. ఓ అగ్నిహోత్రా! నీకు సమర్పించే ద్రవ్యాలతో నీవే పెరిగిపోతున్నావు. ప్రతిరోజు రెండు పర్యాయాలు నిన్ను మేము అర్చిస్తాం. నీకు మేము సన్నిహితులమవుతాం. నీవు మాకు అఖిల యజ్ఞ కర్మఫలాల్ని అందిస్తున్నావు. యజ్ఞం జరిగే ప్రదిమందికి మేలు జరిగే కార్యం) స్థలాన్ని వికసింపచెయ్; వృద్ధి పొందింపజెయ్; మా స్తుతులను అందుకో. తండ్రి చుట్టు తిరిగే పిల్లలకు తండ్రి ఎలా మేలు చేస్తాడో నీవు కూడా అదే విధంగా కష్టాలు దూరం చేసి మాకు శుభాలిస్తుంటావు."

ఋగ్వేదంలోని ప్రథమ సూక్తమిది. ఇది అగ్ని సూక్తం. నాడు. నేడు, రేపు ఎవరైనా 'అగ్నిమీళే పురోహితం' అంటూ ఈ విధంగా అర్చించాల్సిందే. అది భౌతికాగ్ని కాని ఆంతరికాగ్ని కాని ఈ అర్చనలో పేట్రేగమని కోరడం లేదు. నాడైనా నేడైనా రేపైనా ఇదే ఆచరణీయం.

వంట చేసే అగ్ని ఇంటిని తగల బెట్టడానికి ఉపయోగించేవాడు. ఇది ఆలోచించాలి. కాష్ఠాగ్నిని ఊళ్లు కాల్చడానికి ఉపయోగించేవాడు- ఇది ఆలోచించాలి. అణ్వాస్త్రాగ్నితో దేశాలకు దేశాలనే భస్మీపటలం చేయాలనుకొనేవాడు. ఇది ఆలోచించాలి- భౌతికాగ్నికి కిరసనాయలు జోడించి వధువు దహనానికి పూనుకొనే ఆధునిక ఆర్థిక పిశాచం- ఇది ఆలోచించాలి.

భౌతికాగ్ని వాడడంలో మనిషి సంయమనం! పాటించకపోతే "సత్య శివ సుందరాత్మకమైన ఈ సృష్టి బుగ్గిబుగ్గిగా మారుతుందన్న నగ్న సత్యం ఈ నాటికీ గుర్తించని నర పిశాచాలు ఆదిమానవుని అగ్ని సూక్తం వెనుకవున్న అంతరార్థాన్ని గ్రహించక. వేద మంత్రాలు పశువులు కాచే గోపాలకుల తొక్కు పలుకులు అనడం వెనుక ఎంత అజ్ఞానం ఉందో ఆధునిక ప్రపంచం గుర్తించాలి.

సరిగా ఇవే మాటలను ఆంతరికాగ్నికి అన్వయించుకోవాలి. నీ కన్నులు మండితే నీ కడుపు మండితే దావాగ్నినో. బడబాగ్నినో. విద్యుదగ్నినో రెచ్చగొట్టినట్లుగానే భావించాలి. భౌతికాగ్ని ఆర్పేస్తే ఆపుతుంది కాని అంతరికాగ్ని కేవలం సంయమం వల్ల మాత్రమే ఆరుతుంది. ఆరుతుంది అంటే ఆరిపోవడం కాదు కల్లోలం సృష్టించకుండా చైతన్య శీలంతో ఉండి నీవు నేను అందరం బ్రతికే బాటలో వెలుగులను వెదజల్లుతుందని అర్థం. ఇదే 'తమసోమా జ్యోతిర్గమయ'.

అగ్నిని ముట్టుకొంటే చురుక్కుమంటుంది. చురుకుమన్నప్పుడు కూడా జ్ఞానం రాకపోతే అజ్ఞానాంధకారంలో ఉన్నట్టే. అందుకే మరో సారి 'తమసోమా జ్యోతిర్గమయ'.

౩౦. శ్రీరామచంద్రుడు

శ్రీరామచంద్రుడు వసంత ఋతువులో. చైత్రశుద్ధనవమి నాడు, పునర్వసు నక్షత్రయుక్త చతుర్థ పాదమందు, మిట్ట మధ్యాహ్నం 12 గం.కు అయోధ్యలో జన్మించాడు. ఆ జన్మించిన స్థలమే అయోధ్యలో రామజన్మభూమిగా ప్రఖ్యాతమయ్యింది.

ఆ రామచంద్రుని కల్యాణం కూడా చైత్రశుద్ధ నవమి నాడే జరిగింది. అది కూడా పునర్వసు నక్షత్రయుక్త కర్కాటక లగ్న సుముహూర్తం.

గత మాసంలోనే ఆ సీతారాముల కల్యాణ గుణాల్ని మనమందరం గానం చేశాం. భక్త రామదాసైతే భండన భీముడా రామచంద్రుడంటూ రెండవ సాటి దైవమికలేడని గడగట్టి చాటాడు.

వాల్మీకి మునిచంద్రులు రామాయణంలోని అనేక పాత్రల చేత రాముని గుణగానం చేయించాడు. మరి మనం లోకాభిరామాయణంలో కూడా అవన్నీ గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

రాముడు మూర్తీభవించిన ధర్మమూర్తి. పరాక్రమ తేజోమూర్తి. దేవతలకు ఇంద్రుని లాగానే సర్వలోకారాధ్యుడు. ఈ అర్థమున్న ఈ క్రింది శ్లోకం చూడండి!

రామోవిగ్రహవాన్ ధర్మః - సాధుస్సత్య పరాక్రమః
రాజా సర్వస్యలోకస్య - దేవానాం మఘవా నివ॥"

అంతేకాదు ఆ రామచంద్రుడు బుద్ధిమాన్. మధురభాషీ. పూర్వభాషీ. ప్రియంవదుడు. అహింసను పాటిస్తాడు. దయగలవాడు; శాస్త్రం తెలిసినవాడు. సచ్ఛీలమున్నవాడు శమదమాది (చిత్త ప్రశాంతి, ఇంద్రియ నిగ్రహం) షడ్గుణాలున్నవాడు. శ్రీరాముడు కల్యాణ గుణాభిరాముడు.

ఆ శ్రీ రామచంద్రుని ఆంతరిక రూపమదైతే, ఆయన భౌతికరూపం కూడా తక్కువదేమీ కాదు. ఆజానుబాహుడు, అరవింద దళాయతాక్షుడు. సరస్వతీ రామాయణకర్త శ్రీ రామచంద్రుణ్ణి ఈ విధంగా వర్ణిస్తాడు.

నల్లని మేనివాడు. చిఱునవ్వులు చిల్కెడి మోముతోడ శో
భిల్లెడివాడు. చక్కనగుపీవర వక్షమువాడు. సొగలొ
పుల్ల సరోజ పత్రముల బోలుకనుంగవవాడు. లోకమున్
జల్లగ నేలువాడు. కరుణానిధి శ్రీ రఘురాముడమ్మరో!

అలాంటి శ్రీరామచంద్రుని శ్రీరామనవమి సందర్భంగానే స్మరించడం కాదు; గుణ గానం చేయడం కాదు; ఇది నిరంతరం మననం చేయవలసిన అంశం. నిత్యమననం వల్ల మనమూ ఆ గుణాల్ని అలవరచుకొనే అవకాశముంది.

31. మన ఉత్సవాలు-సంఘటన సందేశాలు

శ్రావణం వచ్చింది., శ్రవణానందకరంగా జీవలోకం పలికింది., పిట్టలు కిచకిచమన్నాయి., కోకిలలు కూకూ అన్నాయి. సర్వజీవులూ ఆనందకేళీ తాండవం చేశాయి.

మనిషి విత్తులు నాటాడు. ఎదుగుతున్న మొక్కల పక్కన పెరుగుతున్న కలుపు మొక్కలను పెరికి అసలుసిసలైన మొక్కల ఎదుగుదలకు దోహదం చేశాడు. అయినావసుంధర తన శక్తిని చూపిస్తూనే ఉంది. సృష్టివైచిత్ర్యాలెన్నింటినో ఆహ్వానిస్తూనే ఉంది. ఎండాకాలపు ఎండలకు ఎండి బీటలు వడ్డ భూమి ఆవురావురుమంటున్నది. రోహిణికార్తిలో రోకళ్లే పగిలిపోయినై. కర్షకునికి హర్షం కలిగే విధంగా వర్షం పడింది. ఆషాఢ మాసమంతా నీరే-బురదే. ఎంతగాకాలం వైపరీత్యాన్ని చూపించినా, శ్రావణంలో పుడమి పులకించింది: పంటచేలను బరాబరులుగా నిలిపింది.

చైత్రశుద్ధ పాడ్యమితోనే మనిషి పండగలు మొదలైనా, వైశాఖ- జ్యేష్ఠ, ఆషాఢాలవరకు ఆయాపనులల్లోనే మునిగి పోయి ఉన్నాడనిచెప్పాలి. శ్రావణం ప్రవేశించిన వెంటనే రెట్టించిన ఉత్సాహంతో ఉత్సవాలకంకితమయ్యాడు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా దీక్షాధారణం చేశాడు. యజ్ఞోపవీతాలువేసుకొన్నాడు. ఆర్యసమాజం వారైతే యజ్ఞోపవీతం అందరూ ధరించాల్సిందే అన్నారు. స్త్రీలు వ్రతాలు ప్రారంభించారు. నోములు నోచారు. వరలక్ష్మి వ్రతాలు చేశారు. శ్రావణమంతా తీరికలేని నియమనిష్ఠలతో-ఆచారాలతో, వ్రతధారణలతో గడిచిపోయింది.

శ్రీగణేశాయనమః అంటూ భాద్రపదం వచ్చింది. గణపతిచవితి (వినాయకచతుర్థి) ఉత్సవం ఉరకలు వేస్తూ జరుపుకొన్నారు. వ్యక్తిగతంగా గణపతిని ప్రార్థించారు. సామూహికంగా గణపతిని అర్చించారు. పందిళ్లు వేశారు. మంటపాలు నిర్మించారు.చవితి ఒకరోజు కాక తొమ్మిదిరోజులవరకు వెళ్లింది. గణపతినవరాత్రి ఉత్సవాలే జరిగాయి.

సృష్టిలో ఆద్యక్షరం ఓం(ॐ) కారం. గణపతిది ఓంకార రూపమే. దేవుని నామాలలో ఓంకారమే అన్నిటికి మొదటిది. కనుకనే హిందూసమాజం గణపతి పూజ సర్వదేవతల పూజగానే భావించింది. లోకమాన్యతిలక్ ఈ ఉత్సవాలను జాతీయోద్యమం వైపు మలిపారు. భారతీయుల పండుగలకున్న ప్రాధాన్యం ప్రప్రథమంగా సంఘటనే సుమా అని నిరూపించారు.

వరలక్ష్మి ఉత్సవాలు స్త్రీ జనసంఘటనకు నాంది పలికాయి. విజయదశమి, దీపావళి పండుగలు రెండూ స్త్రీ పురుషుల సంఘటనను నిర్మిస్తున్నాయి. దేవీనవరాత్రి ఉత్సవాలు దేశంలోని కొన్ని ప్రాంతాలలో ప్రధానోత్సవాలే అయ్యాయి. పండుగల్లో ఉండే తిండీ-తాగుడు బాగా తగ్గడం సంతోషదాయకం. సాంకేతికవిజ్ఞానం కారణంగా టేపురికార్డుల కెక్కించిన పాటలే ప్రధానంగా వినిపిస్తున్నా, ఈ మధ్యకాలంలో కొంత సంస్కారం పెరిగి.

బూతుపాటలు తగ్గించి భక్తిగీతాలు వేస్తుండడం సమాజంలో ఆరోగ్యకరచిహ్నాలు నాటుకొంటున్నాయనడానికి నిదర్శనం.

గ్రామ దేవతల పండుగల్లోని కొన్ని దేశీయాచారాలు పూనకాలు, సోది(ఎరుక) చెప్పడం, రంగమెక్కడం, వెంట్రుక లివ్వడం, అంగాలుకోసుకోవడం-మొదలైన దురాచారాలు కూడా కొంతామేరకు తగ్గినై. కొన్ని సంస్కరింపబడినై. జానపదుల దేశీయాచారాలైన ఇవి కొనసాగనివ్వాలని కొందరి ఆలోచనకాగా, ఇందులో అశాస్త్రీయమైనవి, హేతువుకు నిలవనివి ఏవేవి ఉన్నాయో వాటిని తొలగించాల్సిందేనని మరికొందరి వాదన. ఆధునిక యుగ వాతావరణానికనుగుణంగా వాటిలోనూ మార్పులు వస్తున్నాయి.

ఏకాదశి, శివరాత్రి, కృష్ణాష్టమి, సంక్రాంతి మొదలైన పండుగలు ఏటా ఆయాసమయాల్లో వస్తూనే ఉన్నాయి. వీటికితోడు ఇప్పుడు దేశ నాయకుల జయంతులూ-వర్ధంతులూ జరుపుకొంటూనే ఉన్నారు. స్వాతంత్ర్య(15వ ఆగష్టు) గణతంత్ర(26వ జనవరి) దినోత్సవాలనూ జరుపుకొంటున్నారు.

శైవ, వైష్ణవ, గాణాపత్య, సౌర, కాపాలికాది మతసంప్రయోత్సవాలు అవిచ్ఛిన్నంగాకొనసాగుతూనే ఉన్నాయి. కన్నడ, తెలుగు తమిళ, మలయాళ, మరాఠి, ఒరియా, బెంగాలి, గుజరాతి, పంజాబి, అస్సామి, హిందీతదితర భాషాభాషీయులు తమ తమ ప్రాంతాలలో భాషాదినోత్సవాలు జరుపుతూనే ఉన్నారు. పిల్లల పండుగలు, ఉద్యోగుల పండుగలు, వృత్తుల ఉత్సవాలు, కులాల పుట్టుపూర్వోత్తరాలను తెలిపేపండుగలు, గృహ జీవనంలోని ఆచారాలు- ఉత్సవాలు, దేవుళ్ల కొలుపులు, సిక్కు జైన, బౌద్ధ, మహమ్మదీయ, క్రైస్తవాదుల పండుగలు, ఇలాఎన్నో జరుగుతున్నాయి. ఆరాధనోత్సవాలు, బ్రహ్మోత్సవాలు జరుగుతూనే ఉన్నాయి.

నిత్య కల్యాణం పచ్చతోరణం అన్నట్లు దేశమంతట అన్నికాలాల్లో అన్నీజరుగుతూనే ఉన్నాయి. కాని ఇవన్నీ ఒక సాంస్కృతిక ఏకసూత్రంక్రింద జరిగితే ఎంతబాగుండును అనిపిస్తుంది. ప్రతి పండుగా హిందూ ధార్మిక సాంస్కృతికాత్మ గా నిర్మాణంచేసుకోవాల్సిన అవసరం ఉంది. "సర్వేశ్వరా! కరుణాకరా" అంటూ సద్గురు మలయాళ స్వాముల వారు ఉదయం లేవగానే, రాత్రి పడుకోబోయే ముందు ప్రార్థన చేసుకోవలసిందిగా కోరారు. దీనివల్ల సంకల్ప శుద్ధి ఏర్పడుతుందని వారాశించిన ఫలం నెరవేరింది. ఇదేవిధంగా దేశంలో ఏ ప్రాంతంలో ఉన్నా, నేను ఏభాషమాటాడుతూ ఉన్నా, ఎటువంటి ఆచారాన్ని పాటిస్తూ ఉన్నానాది అవిచ్ఛిన్న సంప్రదాయం, ఈ సంప్రదాయాచరణలో నేను అవిభాజ్యమైన అంగాన్ని అనే దృక్పథం అలవరచుకొన్ననాడు అఖండ భారతం అఖండంగా ఉంటుంది. విచ్ఛిన్నకారులు ఈ అధ్యాత్మిక సంప్రదాయశక్తి ముందు నతమస్తకులవుతారు. అప్పుడే మన ఉత్సవాలు సంఘటన ప్రతీకలు అనిభావించే అవకాశం కలుగుతుంది.

32. వేసవి సంస్కార కేంద్రాల ఆదర్శాలు

ప్రతి వేసవిలో ఎందరో బాల సంస్కార కేంద్రాలు నిర్వహిస్తున్నారు. సరస్వతీ విద్యాపీఠం, రామకృష్ణమఠం, ఆర్య సమాజం, చిన్మయాబాలల మిషన్ ఇలా ఎన్నో సంస్థలు నిర్వహిస్తున్నాయి. ద్వైతాద్వైత విశిష్టాద్వైత సిద్ధాంతాల ఆశ్రమాలు నిర్వహిస్తున్నాయి. కొన్ని విదేశీ సంస్థలూ నిర్వహిస్తున్నాయి. కొన్ని ప్రయివేటు పాఠశాలలూ నిర్వహిస్తున్నాయి.

దాదాపు అన్నీ ఎంతో కొంత శుల్కం తీసుకొని 10 రోజులు, 20రోజులు, 30 రోజులు తమ వీలునుబట్టి శిక్షణ నిస్తున్నాయి. కంప్యూటర్, వీడియోగేమ్సు నేర్పిస్తామంటూ కొన్ని సంస్థలైతే 2 వేలనుండి 5 వేలవరకు వసూలుచేస్తున్నాయి.

ఎండాకాలంలో ఎండలకు తిరిగి తమ పిల్లలు పాడైపోతారని కొందరు, ఎంతో కొంత నేర్చుకొంటారని కొందరు, బడుల్లో చెప్పని భారతీయ సంస్కృతి-ఆధ్యాత్మిక విషయాలు ఇలాగైనా తమపిల్లలు నేర్చుకొంటారని మరికొందరు-ఇలా భిన్న భిన్న ఉద్దేశ్యాలతో పంపిస్తున్నారు. వారి వారి ఉద్దేశ్యాలు ఏ కొద్ది ఫలించినా సంతోషిస్తున్నారు. ఫలించకుంటే మళ్లీ ఆ సంస్కార కేంద్రానికి పంపొద్దురా బాబూ అంటూ తిట్టిపోస్తునారు.

ఇది లోకసహజం. తల్లిదండ్రులూ, సంరక్షకులు ఇలా అనుకొంటే సంస్కారకేంద్రాలు నడిపించే వారే మనుకొంటున్నారో చూద్దాం.

సూర్యనమస్కారాలు, యోగాసనాలు, ధార్మిక సాంస్కృతికగీతాలు, భారతీయసంస్కృతిలోని వీరగాథలు, సేవాదృక్పథంతో వ్యవహరించాల్సిన పద్ధతులు, సంస్కృతభాషా వైశిష్ట్యం బాలబాలికల్లో అంతర్నిహితమైన శక్తులను బహిర్గతంచేయడం, స్వదేశీయత-జాతీయత నాటడం, దేశభక్తి నిర్మాణంచేయడం, ఆటలుపాటలు... ఇవన్నీ భారతీయ సంస్కృతిపై అభిమానం పెంచడం...... ఈ ఉద్దేశ్యాలను బట్టి ఫలితాలుంటా యనేది సత్యం.

అయితే దేశభక్తికి, సంస్కృతికి, జాతీయతకు, వ్యక్తిత్వవికాసానికి పెద్దపీట వేయాలనేది ఎవరైనా అంగీకరించేదే. వ్యక్తిహిత దృష్టి నుండి సమాజహిత దృష్టివైపుగా

బాలబాలికల్ని నడపాల్సిన అవసరం ఉందని ఎవరైనా ప్రకటించేదే.

వ్యక్తి-కుటుంబం- ప్రాంతం-విశ్వం- సత్యం వైపుగా క్రమోన్నత పరిణామాన్ని ఎవరైనా కోరుకొంటారు. వ్యష్టి-సమష్టి -సృష్టి-పరమేష్ఠి వైపుగా పయనించాలని ఎవరైనా ఆకాంక్షిస్తారు.

శారీరక, మానసిక, బౌద్ధిక ఆత్మిక వికాసం జరుగాలని ప్రతి తల్లీ తండ్రి కోరుకొంటారు. జడ, జల, వృక్ష, మృగ, మానవ జగత్తులనుండి దైవీజగత్తు వైపుగా ఈ మానవుడు నడవాలని ఎవరైనా కోరుకొంటారు. మనిషిలోని మృగాన్ని దూరంచేయడానికే ఈ సంస్కారకేంద్రాలుపకరించాలి.

తనసంస్కృతినీ, తన దేశాన్నీ, తన ఉనికినీ, పటిష్ఠ పరచుకొనేభావజాలం, ఈ బాలబాలికల హృదయాల్లో నాటుకోవాలి. ఆదిశలో ఈ సంస్కార కేంద్రాలన్నీ పనిచేసినప్పుడు, దేశంలో త్యాగులూ- వీరులూ నిర్మాణమవుతారు. భోగవాదం, హింసావాదం అణిగిపోతుంది. ఈ దేశం శక్తిమంతంగా ప్రగతిశీలదిశలో పయనిస్తుంది. ప్రపంచానికే శాంతి సందేశాన్ని అందిస్తుంది.

వేసవి సెలవుల సంస్కారకేంద్రాల వెనుక ఇంతటిమహోద్దేశ్యం ఉంటే అందులో కొంతన్నా విజయవంతమవుతుంది. పిండికొద్దిరొట్టె - శ్రమకొద్ది ఫలితం.



33. శ్రీముఖ సందేశం

ప్రపంచచరిత్రలో వేల-లక్షల సం॥లు దొర్లిపోయినై. మనకు మళ్లీ ఓ కొత్త సంవత్సరం వచ్చింది. శ్రీముఖ. ఈ సంవత్సరం పేరు. ఎంత బాగుంద ఈ పేరు! రుధిరోద్గారి, రక్తాక్షి, క్రోధన అన్న భయంకరమైన పేర్లూ ఉన్నాయి! ఇంతమంచి పేరూ ఉంది!

ప్రభవ నుండి అక్షయవరకున్న అరవై సంవత్సరాల్లో శ్రీముఖ ఒకటి. శ్రీ అంటే లక్ష్మి. ముఖం అంటే ముఖమే. "ఆమె ముఖంలో లక్ష్మి కళకళలాడుతుంది..... అతని ముఖంలో లక్ష్మికళ తాండవిస్తుంది...." అని అంటుంటే వింటుంటాం. మంచిమాటవిన్నప్పుడు కలిగే సంతోషం కలుగుతుంది.

ఈ పదానికున్న నానార్థాలు చూడండి! లక్ష్మి, అంబు జానన, అబ్ధిజ, అమల, ఇందిర, ఈశ్వర, బుద్ధి, కమలాలయ, కలిమిగుబ్బెత, కలిమిచెలి, చపల, చల, జగముతల్లి, జలధిజ, దాక్షాయణి, నారాయణి, పద్మ, పద్మకర, పద్మగుణ, పద్మగృహ, పద్మలాంఛన, పద్మవాస, పద్మాలయ, పద్మిని, పాల్కడలి ముద్దులపట్టి, పైడినెలఁత, మంగళ దేవత, మరునియంబ, మా,మాత, మాధవి, మున్నీటికన్నె, రమ, రామ, లక్ష్మి, లచ్చి లిబ్బుల జవరాలు, లోకమాత,విష్ణువల్లభ, విష్వక్సేన ప్రియ, సంపద, సనాతని, సింధుకన్య, సింధుజ, సిరి, సీత, స్త్రీ రత్నము, హరిప్రియ, హీర"

ఇక ముఖమున కున్న నానార్థాలు చూడండి! "ముఖము, ఆననము, చుబ్రము, తుండము, మూతి, మొకము, మొగము, మోము, మోర, మ్హోరము, లపనము, వదనము"శ్రీకి ముఖానికి ఇన్ని అర్థాలా అంటే ఒక్క తెలుగులోనే కాదు, సంస్కృతసాహచర్యమున్న ప్రతిభారతీయ భాషలోనూ ఇన్ని అర్థాలున్నాయి, ఇంకా దేశీ అర్థాలున్నాయి, అచ్చతెనుగు అర్థాలున్నాయి అని పరిశోధించ వలసివస్తుంది.

ఏవి ఉన్నాలేకున్నా ఇవాళ మనం కోరుకొనేది మన తల్లి భారతి(భారతమాత) శ్రీముఖయై వెలుగొందా నే! అందుకే మనమంతా శ్రమించాలి. శ్రమలోనే దైవమున్నాడు. ఈ శ్రమ ద్వారా వైభవాన్ని (లక్ష్మని) మనం సాధించగల్గుతాం. అప్పుడా తల్లిని ఈ విధంగా ప్రార్థించుకొంటాం.

లక్ష్మీం క్షీర సముద్రరాజతనయాం శ్రీరంగధామేశ్వరీం
దాసీభూత సమస్త దేవవనితాం లోకైక దీపాంకురాం
శ్రీమన్మంద కటాక్ష లబ్ధ విభవ బ్రహ్మేంద్ర గంగాధరాం
త్వాం త్రైలోక్య కుటుంబినీం స్తరసిజాం వందే ముకుంద ప్రియామ్॥

ఆ తల్లి విష్ణుప్రియ, త్రిలోకమాత, కమలజ. పాలసముద్రం పుత్రిక. శ్రీరంగధామరాజ్ఞి. సమస్తదేవ వనితలు ఆమె పరిచారికలు. ఆ తల్లి లోకానికేజ్యోతి. ఆమె మెల్లని చల్లని కరుణామయమైన చూపువల్లే బ్రహేంద్ర శివులకు వైభవాలు సిద్ధిస్తాయి. అలాంటి తల్లికి వందే!

ఈ తల్లి భారతమాతకు శ్రీముఖ. మరి ఆ భారతమాతను మనమెలా అర్చిస్తామో చూడండి!

కల్యాణీం మనుసంతతేర్జగతితాం ఛందోమయీాం జ్ఞానదాం
తత్త్వజ్ఞాన సుసంప్రదాయ జననీం సర్వాత్మికాం హైందవీం
చైతన్యాధిక రూపిణీం వసుయుతాం సేవే సదా భారతీం
మాతర్మాం సుతయోగ్య మాశిషశతం దేహీతి సంప్రార్థయే॥

మనమంతా మనుసంతతికి చెందినవారం. అందువల్ల మనుష్యుల మయ్యాం. వేదం కూడా "మనుర్భవ" (మనుష్యుడవు కమ్ము) అని ఆదేశిస్తున్నది. మనుష్యులమైన మనకు మనతల్లి భారతి కల్యాణములు సమకూరుస్తుంది. సక్రమబద్ధంగా జ్ఞాన మందిస్తుంది. ఆ తల్లి తత్త్వజ్ఞాన సుసంప్రదాయానికే మాతృక. అందరిలో ఒకే ఆత్మగా ఉన్న హైందవి. అందరిలోని చైతన్యం ఆ తల్లే. ఆమెవసుంధర. ఆ తల్లి భారతి యోగ్యపుత్రులను తీర్చిదిద్దడానికి ఆశీస్సులందివ్వవలసిందని ప్రార్థిద్దాం (ప్రార్థిస్తాను).

ఆ తల్లికి నిజమైన పుత్రులముగా మనం వ్యవహరించినప్పుడు- ఆయమ ఇవన్నీ మనకే అందిస్తుంది. తల్లికే ద్రోహంచేస్తే పుట్టగతులుండవు! అస్తిత్వానికే ప్రమాదం ఏర్పడుతుంది.

ఇంతకూ ఆభారతమాత (పృథ్వి) ఎక్కడ! భారతీయు లెవరు! ఈ ప్రశ్నలకు సమాధానం ఈ క్రింది శ్లోకంలో చూడండి.

ఉత్తరం యత్సము ద్రస్య - హిమాద్రేశ్చైవ దక్షిణమ్॥
వర్షం తత్ భారతం నామ - భారతీయత్ర సంతతిః"

సముద్రానికి ఉత్తరంగా, హిమాలయాలకు దక్షిణంగా ఉన్న దేశమే భారతం. ఆ దేశంలో ఉన్నవారే భారతీయులు.

మనం భారతీయులం. మన తల్లి ఈ ధాత్రి. ఈ ధాత్రిని కబళించడానికి విదేశీయులు, విధర్మీయులు తమ షడ్యంత్రాల్ని పన్నుతూనే ఉన్నారు. మనం శ్రీముఖులం కావాలంటే భారతి శ్రీముఖం కావాలంటే, ఆ తల్లిని మనం కాపాడాలి; మనల్ని ఆ తల్లి కాపాడుతుంది. ధర్మాన్ని రక్షిస్తే ధర్మం మనల్ని రక్షిస్తుంది కదా!

34. వేదాల్లో వ్యవసాయ విజ్ఞానం

అన్నీ మా వేదాల్లోనే ఉన్నాయి, అని హిందువులు ప్రగల్భాలు కొడుతుంటారని కొంతమంది అజ్ఞానులు హేళన చేస్తుంటారు. వేదాలు అటువంటి తెక్కు పలుకులని విదేశీయుల విమర్శిస్తున్నప్పుడు, 'పోవోయ్‌పో. నీకేం తెలుసు అన్నీ మా వేదాల్లోనే ఉన్నాయి' ఆగ్రహించిన హిందువు అన్నకాలమున్నది.

ఒకవ్యక్తిని కాని, ఒక సమాజాన్నిగాని, ఒక జాతిని గాని ఎప్పుడూ అణచడానికే ప్రయత్నిస్తే ఆ వ్యక్తీ ఆ సమాజం, ఆజాతి తప్పకుండా తిరగబడి తగిన శాస్తి చేస్తుంది. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వాధికారాన్ని చేపట్టిన వారందరూ, హిందూ మనోభావాలను అణగద్రొక్కారు. అల్పసంఖ్యాకుల పేరిట కొందరిని బుజ్జగించి వారు కోరిన కోరికలన్నీ తీరుస్తూ, వారికి ప్రత్యేక చట్టాలు చేస్తూ, ప్రత్యేక వనరులు కలిగిస్తూ హిందువులు ధర్మాగ్రహప్రదర్శకులయ్యేవిధంగా వ్యవహరించారు. ఆ ఆగ్రహ ప్రదర్శన ఫలితమే 1992 డిసంబర్ 6వ తేది అయోధ్యసంఘటన.

ఇక కుహనామేధావులు, విదేశీబానిస బుద్ధులు ఇప్పటికీ వేదాల మీద అక్కసు కక్కుతూనే ఉన్నారు. వేదాల్లోని ఏ ఒకటి రెండు మంత్రాలమీదనో పరిశోధన చేసి పిహెచ్.డీలు సంపాదించే వారు విదేశాలో దినదిన ప్రవర్ధమాన మవుతుంటే, తన సాహిత్యం మీదనే విషవమనం చేసే - తల్లి కడుపు చెడబుట్టిన ఈ కొడుకులకెపుడు బుద్ధివస్తుందో తెలియదు. వ్యవసాయ విజ్ఞానానికి సంబంధించిన ఈ క్రింది ఋక్కు-దాని అనువాద పద్యం పరిశీలించండి.

"ఉతో సమహ్యా మిందుభిః
షడ్‌యుక్తాగ్ం అను సేషిధత్
గోభిర్యవం నచర్ కృషత్॥"

(సమూల శ్రీమదాంధ్ర ఋగ్వేద సంహిత, 1-23-15)

"తలకొని సేద్యగాడు తన ధర్మము దప్పక వడ్లు జల్ల కా
వలసిన భూమి దున్ని కడు వర్ధిలు నట్టులు కాంతి యుక్తుడై
మెలగెడు పూషయిష్టులకు మేలగు సోమలతా ప్రపంచముం
గలిగెడు షడ్ ఋతూత్తముల కల్పన చేయుచునుండె చూడుడీ!"

(సమూలశ్రీమదాంధ్ర ఋగ్వేద సంహిత, 53వ పుట 35వ పద్యం)

వేదాలు ప్రపంచంలోనే మొట్ట మొదటి వాఙ్మయ గ్రంథాలని నిర్ద్వంద్వంగా అందరూ అంగీకరించారు. ఆ వేదాల కాలం ఇదీ అని చెప్పలేనంత అతి సనాతనకాలంలో అవి అవిర్భవించాయి. యుగాల పేరిట కాలాన్ని కొలిచి పాత రాతియుగమని - కొత్తరాతియుగమని లెక్కగట్టే మనిషి వేదకాలాన్ని గుర్తించే కొలతబద్ద నిర్మించకోలేదనే చెప్పాలి. వేదాలు మానవుని ఆటవిక జీవన దశలోనివి అని ఇంకా అనేవారు పై అర్థాన్ని పరిశీలించాలి. వేదాలు పుట్టకముందే వ్యవసాయ విజ్ఞానమీ దేశంలో ఉందనీ, ప్రపంచానికే వ్యావసాయిక విజ్ఞానాన్ని వేదధర్మాను యాయులమైన మనం అందించామని మహర్షి దయానందులు, డా॥ రాయల్ ప్రభృతులు సత్యార్థ ప్రకాశనం చేశారు.

"కర్షకుడు తన ధర్మం తప్పకుండా వ్యవహరిస్తాడు. అందుకని కావలసిన భూమిని కావల్సినవిధంగా దున్ని తీర్చిదిద్దుతాడు. ఈ తర్వాత వడ్లు చల్లుతాడు. అప్పుడు ప్రపంచాన్నే తన కాంతిచేత అభివృద్ధి పొందించే సూర్యుడు (పూషుడు) ఈవరిచేనును వృద్ధి పొందిస్తాడు. సోమలత(అమృతం వంటి బలవర్ధక ఔషధాన్ని ఇచ్చే ఒక తీగ)లతో నిండియున్న ఈ ప్రపంచంలో ఆరు ఋతువులను సృష్టించే ఆ సూర్యుడు ఇష్టపడినవారికి (ఆహారం-ఔషధం ఇచ్చి) అలా మేలుచేస్తాడు.

ఇందులో ప్రస్తావించ బడ్డ సోమలత సోమరసాన్ని ఇచ్చేదని, సోమరసమంటే సుర లేదా మద్యమని విదేశీయులు కొందరు తప్పుడు రాతలు రాశారు. వేదసాహిత్యాన్ని- వేద సంస్కృతినీ-దాన్ని అనుసరించే హిందువులను కించపరచాలనే ఉద్దేశ్యంతోనే ఆ కుహనా మేధావులు ఇంత దుర్మార్గానికి ఓడిగట్టారు. వారి దారినే నడిచే బానిస భారతీయ చార్వాకుల కళ్లు ఇంకావిచ్చుకోలేదు.

ఇక కర్షకుడు భూమిని బాగా దున్నడం, పంటకు యోగ్యంగా తీర్చిదిద్దడం, వడ్లుచల్లడం అనే తన ధర్మాన్ని నిర్వర్తించడం- అనే ఈ మాటలు అలవోకగా చెప్పినవి కావు.

ఇందులో శ్రమ తత్త్వబోధనమున్నది. వృత్తి ధర్మనిర్వహణమున్నది. పదిమంది కడుపు నింపే సేవాభావమున్నది. దీనికంతటికీ సూర్యుడే అంటే ప్రకృతే సహకరిస్తుందన్న ఆశావాదప్రేరణమున్నది. ఆరు ఋతువుల కాల తత్త్వాన్ని పరిశీలించి వ్యవహరించే అనుభవమున్నది. బలహీనమైన మొక్కనూ - జీవుణ్ణీ శక్తిమంతంచేసే సోమలతా(అమృతలత) పరిత్రాణ తత్త్వమున్నది. ఒక్క వ్యవసాయాన్ని అల్లుకొని ఇలాంటి మహత్తర విజ్ఞానాన్ని గుప్పించిన ఈ వేదఋక్కు అంతరంగంలోకి వెళ్లినా కొద్ది మరెన్నో అర్థాలు వచ్చే అవకాశమున్నది.

35. ఆలయాల పవిత్రత- అందరికర్తవ్యం

మన ఆలయాలు మానవతా వికాస కేంద్రాలు. అందుకే ప్రతి సంవత్సరం సాధ్యమైనన్ని సుదూరమందిరాల్ని దర్శించాలి.

అర్చామూర్తియైన భగవానుని దర్శించి ఆ మూర్తి మీద తదేక ధ్యాస నుంచి ధ్యానం చేయాలి. ధ్యానం కొరకు అక్కడే ప్రశాంత స్థలంలో కూచోవాలి. ఆధ్యానం ద్వారా మనస్సు నిర్మలం కావాలి.

ఆ విగ్రహమూర్తి పుట్టుకకో పురాగాథ ఉంటుంది. ఆ గాథ అంతరార్థాల్ని గ్రహించాలి. ఆ పరిసర వాతావరణంలో లీనమైపోవాలి. దేశంలోని విభిన్నప్రాంతాల వారక్కడికి వస్తారు. వారి భాషతెలియకున్నా భక్తితత్త్వం అందరినీ కలుపుతున్నదని గ్రహించాలి. ఈ విధంగా ఆలయం కూడా ఏకతకు దోహదం చేస్తుందనీ, అందరం ఒక్కరమే అన్న భావన ద్వారా సామాజిక సంఘటన నిర్మాణం జరుగుతున్నదనీ తెలుసుకొని, సమరసతకు భంగం కలగని విధంగా వ్యవహరించాలి.

అది ఏ ఆలయమైనా మనదే. దానిని పవిత్రంగా ఉంచడం మన అందరి కర్తవ్యం.

అక్కడ గొలుసులు, పూసలు, దండలు, రక్షరేకులు, పసుపు, కుంకుమలు, విభూతి ఉంగరాలు, గాజులు, మొలత్రాళ్లు, వివిధవిధాల మధుర పదార్థాలు, టోపీలు, బెల్టులు, రుద్రాక్షలు, ముత్యాలు, పగడాలు, గవ్వలు, గురుగులు, బొమ్మలు, టేపులు, టేపురికార్డులు, రకరకాలబొట్లు, జెడదండలు, పిన్నీసులు, లోలకులు, ముక్కెరలు, సవరాలు, అంగీలు, లాగులు, రిబ్బన్లు, గుండీలు , పెన్నులు, పెన్సిళ్లు, దువ్వెనలు, పుస్తకాలు, పప్పులు, కారపప్పాస, బజ్జీలు, బొప్పడాలు, చక్కిలాలు...... ఇదీ అదీ అని కాదు; వందల వేల వస్తువులు ఆ దేవుణ్ణి ఆశ్రయించి అమ్ముకొనేవారు కనిపిస్తారు.

దర్శనం, అర్చనం, ధ్యానం, కథాగ్రహణం, పరిసరాల పరిచయం వీటి మీదనే దృష్టి పెట్టిన సాధారణ భక్తుడు ఈ అమ్మకాల వారిని చూచి అవాక్కయి పోతాడు.

ఒక అమ్మకందారు చాయ్.... చాయ్... అంటూ అరుస్తాడు. మరొకరు 'చనేగరం గరంచనే' తినిచూడండి బాబూ అని అరుస్తాడు. పళ్లవాళ్లు, కొబ్బరికాయలవాళ్లు, ప్రసాదాల

వాళ్లు, పూలదండల వాళ్లు ఎవరిగోలవారిది. భక్తిపాటలు, నీతిపాటలు, సినిమాల భక్తి పాటలంటూ చిన్నచిన్న పుస్తకాల వాళ్లు; ఇకతన ఆడియో కేసెట్లు అమ్ముడు కావలని కేసేట్ల దుకాణదారులు చెవులు గింగురు మనేంత పెద్దచప్పుడు పెట్టి నానాహంగామా చేస్తుంటాడు. భక్తి పాటలతో పాటుగా "ధం మారో దమ్ము"లు గుమ్మున గుప్పిస్తుంటారు. ఎవరు అడిగేవాడు పడేసి కడిగేవాడు లేకపోతే పరమ బూతు ద్వంద్వార్థాల పాటలు వినిపిస్తారు. గదులు కావాలా సార్....' ఒక్క రాత్రికి వందరూపాయలే సర్' అంటూ ఒంటరిగా నిలబడ్డ వాడిదగ్గరికి వచ్చి ఎవడో అతి మర్యాదగా విన్నవించుకొంటాడు.

మనం ఏ దర్శనానికి, ఏ అర్చనానికి, ఏ ధ్యానానికి, ఏ పుణ్యక్షేత్రతీర్థమూర్తి కథా గ్రహణానికి, ఏ పరిసరాల పరిచయానికి అక్కడికి వచ్చామో అదంతా ఎక్కడికి పోతుంది! ఈమధ్యన మన ఆలయాల దగ్గరికి మరోప్రమాదంవచ్చిపడింది.

ఈ ఆలయాలంటే నమ్మకం లేని కొంతమంది విదేశీయులు, కేవలం అమ్మకాల కొరకు, తమ స్మగ్లింగు వస్తువులు నిల్వచేసి దేశంలోకి సరఫరా చేయడంకొరకు ఆలయ పరిసరాలను ఉపయోగించుకొంటున్నారు. తిరుపతి, శ్రీశైలం, షిర్డి, పుట్టపర్తి, తదితర ప్రాంతాల్లో పూసలు-బొమ్మల అమ్మకాల వెనుక దైవవిద్రోహకమైన దేశద్రోహకరమైన ఇలాంటి కార్యకలాపాల్లో వీరు పాల్గొంటున్నారని తెలుస్తుంది. ఆయా క్షేత్రాధిపతులు మేల్కొన్నప్పుడు వీరెప్పుడో చెట్లుపట్టక తప్పదు. వాళ్లపాపం పండేంత వరకు కొన్ని అనర్థాలు జరగాల్సిందేనా అలోచించాలి!

మనం ఇక్కడ పుట్టి పెరుగుతున్నవాళ్లం. ఈ దేశంలో ఈ మన హిందూ సమాజసేవయే, భక్తితత్త్వ పరివ్యాప్తియే ఈశ్వరీయకార్యంగా భావించి మనకర్తవ్య నిర్వహణలో మనమున్నాం. ఆలయాల చుట్టూరా ఉన్న చెడును దూరంచేయడంలో మనం మనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాల్సిన అవసరముంది. అదీ దైవీకార్యంగానే భావించి వ్యవహరించాల్సి ఉంది.

36. కాలాన్ని అతిక్రమిద్దాం !

"రాముస్ బోలిన పతియున్
సౌమిత్రిని బోలు మఱది సమకూరియు నీ
భూమీ పుత్రిక యీగతి
బాముల పడుటెల్ల కాల వశతం గాదే"

(శ్రీయడవల్లి వీరరాఘవ కవి, శ్రీరామకథా కందమునుండి)

కాలాన్ని దాటడం ఎవరికైనా సాధ్యం కాదు గదా! అని ఆంజనేయుడు అనుకొంటున్నాడు. సీతా దేవి దుస్థితి తలచుకొని ఇదంతా కాల మహిమ అనిభావిస్తున్నాడు.

భగవంతుడు నేనే కాలాన్ని అన్నాడు. ఈ కాలంలో కూడా వసంత ఋతువును అన్నాడు. ఈ గాలి, ఈ ఎండ, ఈ నీరు, ఈ నిప్పు, ఈ ఆకాశం, ఈ జీవుల్లలోని చైతన్యం ఇవన్నీ భగవత్తుల్యాలే గదా! వీటిని సాధించడం సాధ్యం కానప్పుడు, దుర్మార్గానికి మంచి బలి అయిపోయినప్పుడు, ఇదంతా కాలమహిమ అనుకోవడం మానవ సహజం.

ఇప్పుడూ మానవునిలోని ఈ ప్రాణమే లేదా ఈ ఆత్మే పరమాత్మగా భావించినప్పుడు ఈ ఆత్మనెందుకు కాలమహిమకు భగవానుడు వశంచేస్తున్నాడనిపిస్తుంది! అయితే వేద వేదాంతాలను అధ్యయనం చేసినప్పుడు అనుభవజ్ఞులైన పెద్దల మాటలు విన్నప్పుడు మనంచేస్తున్న ఆలోచన సరి అయింది కాదని తెలుస్తుంది. వశమయ్యేది అత్మో-ప్రాణమోకాదు. ప్రాణం ఆయనది, శరీరం మాత్రం మనదే. మనదే ఎలా! అంటే మనకర్మ పరిపాకం వల్లకలిగిందే అని. ఆ కర్మ పరిపాకం కారణంగానే మంచి చెడ్డకు లొంగిపోవడం జరిగింది. మనం చేసిన కర్మే మనకు ఫలితాలనిస్తుందన్నమాట.

సీతమ్మతల్లి విషయంలో ఆంజనేయుడనుకొన్న సంగతిలో కూడా ఇదే కర్మ పరిపాకమున్నది. ఆ రోజు ఆ తల్లి మాయలేడిని చూచి భ్రమచెందకపోతే అపహరణం జరిగేదే కాదు.

ఈభ్రమచెందమని ఎవరికైనా చైతన్యంగానీ ప్రాణంగానీ అత్మగానీ (ఈ మూడొకటేగానీ) చెప్పవు. ఏది చెప్పింది. మనస్సు చెప్పింది. మనకున్న సంస్కారాల్ని బట్టి

మనస్సు ప్రవర్తిస్తుంది. అసలు మనస్సు మనస్సుకే సంస్కారం ఇచ్చుకోవాలి. ఈ సంస్కారం సాధన వల్లనే సాధ్యమవుతుంది. ఇది సాధ్యంకాక, సంస్కారం ఏదీపొందక మనస్సు వ్యవహారానికి మంచి బలి అయిపోయినప్పుడు ఇదంతా "కాల మహిమ" అని త్రోసివేసి నిశ్చింతగా ఉండడం జరుగుతున్నది.

అయితే అలా ఒకరిమీదికి నెట్టి వేసి చేతులు ముడుచుకొని కూచోకూడదు. మంచిని బలి తీసుకొన్న దుర్మార్గాన్ని త్రొక్కి వేసే శక్తిని సంపాందించాలి. చివరికి మంచికే విజయం సిద్ధిస్తుందని నిరూపించాలి. రామాయణ, భారత, భాగవతాల్లోని చాలా కథలు ఈ మంచిని ప్రస్థాపించడానికే ప్రచారం చేయబడుతున్నాయి.

కాలం దురతి క్రమమైందని తాత్కాలికంగా అనుకొన్నా, అది అనుకొన్నంత దురత్రికమంకాదని తేలుతున్నది. కాలాన్ని జయించడమంటే మంచిని ప్రతిష్ఠాపించడమే అనిభావించాలి. ఆ మంచి పరివ్యాప్తికే సభలూ, సద్గోష్ఠులూ, సత్సంగాలు, ఆలయాలు, మఠాలు, ఆశ్రమాలు, సద్గ్రంథ పఠనాలు, సాంస్కృతిక ప్రదర్శనలు-ఇవన్నీ. వీటిని నిర్వహించినవారు కార్యకర్తలు-క్రియాశూరులు. వీటిని పోషించి ప్రోత్సహించిన వారు దాతలు. మరి ఇందులో మనం కూడా ఏదో ఒకటి అవుదాం. ఈ హిందూ సమాజ సేవలో మనవంతు బాధ్యత మనమూ నిర్వర్తిద్దాం.

37. భజన సేయనతడు భక్తుండు కాడయా!

వేమన మూడవపాదం త్రివిక్రముని మూడవ పాదం లాంటిదే. ఆయన ఆటవెలదిలోని ప్రతిమూడవపాదం వేదనాదమే. దాపరికం ఎంత మాత్రం లేదు. సూటిగాచెప్పడమే. అయితే భజనంటే ఏమిటి?

ప్రార్థించడం, పూజించడం, జపించడం, సేవించడం, ధ్యానించడం, పాడడం,చదువడం - ఇవన్నీ భజన క్రిందనే కనిపిస్తాయి. అయితే ప్రధానంగా రాగతాళాలతో కీర్తించే అంశానికే భజనపదం రూఢిపడింది. సంకీర్తనం అనే పదం కూడా ఉంది. సమ్యక్ కీర్తనమే సంకీర్తనం.

శ్లో॥ తేషాం సతతయుక్తానామ్-భజతాం ప్రీతి పూర్వకమ్।
దదామి బుద్ధియోగం తం యేనమా ము పయాన్తి తే॥

(భగవద్గీత - 10-10)

ఎప్పుడూ నాపైన్నే (విశ్వాత్మపైన్నే) మనస్సుండాలి. ప్రీతితో నన్ను భజించాలి. అలాంటి వారు దేనివల్ల నన్ను పొందుతారో అట్టి జ్ఞాన(బుద్ధి) యోగాన్ని నేను ప్రసాదిస్తున్నా.

ప్రీతితో నన్ను భజించే వారు జ్ఞానులవుతారనే కదా శ్రీభగవానులంటున్నది! అంతేగాదు అలా కీర్తించే వారి హృదయంలో నేనుంటాను అంటారు పరమాత్మ.

శ్లో॥ నాహం వసామివైకుంఠే-యోగినాం హృదయేరవౌ।
మద్భక్తా యత్రగాయంతి-తత్రతిష్ఠామినారద॥

(పద్మపురాణం)

-నేను వైకుంఠంలోలేను. యోగుల హృదయాల్లోలేను. సూర్యునిలోలేను. నాభక్తులు ఎక్కడ నాగురించి గానంచేస్తున్నారో అక్కడే నేనున్నాను.

అంతేగాదు సంసార దుఃఖాన్ని పోగొట్టుకోడానికి భగవన్నామ స్మరణ కంటే మంచింది లేదంటారు. "నామ స్మరణాదన్యోపాయం నహి పశ్యామో భవతరణే"

ఈ కలికాలంలో అదిమరీ తప్పదంటారు. ఈ క్రింది శ్లోకం అ విషయాన్నే గట్టిగా చెబుతున్నది.

శ్లో॥ హరేర్నామ హరేర్నామ- హరేర్నామైవ కేవలమ్।
కలౌ నాస్త్యేవ నాస్త్యేవ - నాస్త్యేవ గతిరన్యథా॥

-కలికాలంలో భగవన్నామ స్మరణాన్ని మించిందిలేదు. జీవలోకం తరించాలంటే నామ సంకీర్తనం తప్ప మరో ఉపాయంలేదు. లేదు, లేదు. ఆ కీర్తనం ఎంత మధరమందో చూడండి!

శ్లో॥ మధురం మధురే భ్యోఽపి-మంగలేభ్యోఽపి మంగలం।
పావనం పావనేభ్యోఽపి-హరేర్నామైవ కేవలమ్॥

-మధురమైన వాటికన్నా మధురమైంది. శుభమైన వాటికన్నా శుభమైంది. పవిత్రమైన వాటికన్నా పవిత్రమైంది. అదికేవలం శ్రీహరినామమే.

ప్రాచీన కాలంలో భగవన్నామాన్ని స్మరిస్తూ కీర్తించి తరించిన వారిని గురించిన ఒక శ్లోకార్థం ఈ విధంగా ఉంది.

"తాళం వాయించే భక్తుడు - ప్రహ్లాదుడు.
వాద్యాన్ని మ్రోగించే భక్తుడు - ఉధవుడు
వీణ వాయించే భక్తుడు - నారదుడు
పాట పాడే భక్తుడు -అర్జునుడు
మద్దెల మ్రోగించే భక్తుడు - ఇంద్రుడు
జయజయధ్వానాలు చేసే భక్తులు - సనకాదులు
భగవత్తత్వాన్ని బోధించే భక్తుడు శుకుడు."

నిజంగా వాళ్లందరూ తమజన్మలు ధన్యంచేసుకొన్నారు. అప్పుడప్పుడూ సాంసారిక జీవనంలో ఆటూపోట్లకు గురైనా వారు మాత్రం భగవంతుణ్ణి వీడలేదు. పాడినవారు, ఆడినవారు, దూకినవారు, ఓడినవారు, గెలిచినవారు...... ఇలా అన్ని విధాలుగా జీవించిన ఈ పై వారందరు కీర్తనం మాన లేదు.

మనం కూడా ఊళ్లల్లో ఆలయాలు కడుతున్నాం. మంటపాలు నిర్మిస్తున్నాం. మంటపాల్లో భజనలు చేస్తున్నాం. కేవలం పాటకన్నా పాటతోపాటే వాద్యం ఉంటే బాగుంటుందని మద్దెల పెట్టుకొంటున్నాం. ఏక్‌తారా తాళాలు ఉడాలంటున్నాం. తాళాలు సమయానికి లేకపోతే చేతులే తాళాలుగా ఉపయోగిస్తున్నాం. ఉంటే వీణ లాంటివి కూడా వాడుతున్నాం. భావరాగతాళాలతో భజన చేస్తున్నాం. ఉత్సాహం ఉరకలు వేస్తే చిరుతలు, కోలలు, భజన చెక్కలు తీసుకొని ఆలయ ప్రాంగణంలో దూకుతున్నాం. ఇంటి ముందర ఆడుతున్నాం. చౌరస్తాలో ఆడుతున్నాం. బుక్క గులాల్ పసుపు కుంకుమలు చల్లు కొంటున్నాం. "మధురం మధురం మాధవ స్మరణం" అనిపరవశించి పోతున్నాం.

ఇవన్నీ భక్తి ప్రదర్శనం క్రిందికి రావు. భక్తి అసలు ప్రదర్శితం కాదు. మనలోని జీవుడు పడుతున్న తపనను బాహ్యంగా ప్రదర్శిస్తున్నాం. మేము ఒక్కరం కాదు. సామాజికాత్మలం అని సంఘటితంగా ఉంటున్నాం.

భజన పదిమందిని కలిపినిలుపుతుంది. భజన నిన్నొక్కణ్ణే శుద్ధాత్మునిగా జేయడం లేదు. నీతో పాటు నీ కుటుంబాన్ని, నీ సమాజాన్ని, నీ దేశాన్ని పవిత్రీ కృతంచేస్తున్నది. ఇవాళ

విశ్వానికి కావల్సింది ఇటు వంటి భజనే.

ఊరూరా భజన సంఘాలు సంఘటితంగా ఉంటే. ఆ ఊరిలో కాలుష్యముంటుందా! రాజకీయ దుష్టశక్తులు జెడలు విరబోసుకొని నర్తిస్తాయా! సైతాన్‌లు ఇండ్లు కాలుస్తాయా! నక్కలు ఊళలు వేస్తాయా! గోముఖ వ్యాఘ్రాలు కపటంగా నటిస్తాయా! అసలు మనిషి మనసులో వికారాలు పుట్టుకొనివస్తాయా! మరి భజన సమాజానికి ఒక వాచ్‌డాగ్(కాపలాకుక్క) లాంటి దందామా! పోలిక బాగా లేదనిపిస్తుంది కదా! ఏం.. కుక్కకున్న విశ్వాసం మనిషికుందా! ఇలాంటి భావనే రారాదు. చెడు నీలోనికి నాలోనికి. అందరిలోనికి రాకుండా అడ్డుగానిలబడేది భజన. ఎంతశక్తి ఉందో భజనకు అర్థమైంది కదా! అందుకే "రామ" పదం భజనలో వాడితే ఏం జరుగుతుందో బెబుతాడు భక్తరామదాసు ఈ క్రింది విధంగా.....

'రా' కలుషంబులెల్ల బయలం బడద్రోచిన 'మా' కవాటమై
ధీకొని ప్రోచునిక్కమని ధీయుతులెన్న తదీయ వర్ణముల్
గైకొని భక్తిచే నుడు వగానరు గాక విపత్పరంపరల్
దాకొనునే జగజ్జనుల దాశరథీ కరుణాపయోనిధీ!"

భజనలో రామ రామ అనండి! రా అన్నంతట్లోనే పాపాలన్నీ వెలుపలికి పోతాయి. 'మ' అనంగానే వెలుపలికి వెళ్లినవి మళ్లీలోనికి రాకుండ పెదాలు మూసుకొని పోతాయి. వెలుపలికి వెళ్లడం, లోనికి రాకపోవడం అనేవివన్నీ భావనా మాత్రాలు. అసలు పాపాలే లేకుంటే వెలుపలికి పోయే వేమిటి అని ప్రశ్నించవచ్చు. పాపాలంటే క్రియలతో చేసేవేకావు. మనస్సుతో చేసేవి కూడా పాపాలే. ఉప్పు పప్పు తింటూ. ద్వంద్వాలతో ఉన్న ప్రపంచంలో జీవిస్తూ మానసిక పాపాలు చేయకుండా ఉండాలంటే మామూలు మాటలు గావు. ప్రతివ్యక్తి తన రంగంలో పైకి పోవాలనుకొంటాడు. పైకి పోవాలంటే ఏంచేయాలి అనుకొన్నప్పుడు పిచ్చి పిచ్చి ఆలోచనలు వస్తాయి. ఈ పిచ్చి ఆలోచనల్ని 'రా' బయటికి పంపిస్తుంది. అవి మళ్లీలోనికి రాకుండా 'మ' కవాటంగా ఉపకరిస్తుంది. సులభంగాచెప్పుకోవాలంటే 'రామ' భజన ఇదేచేస్తుంది.

భజన వల్ల వ్యక్తికే ఇంత శ్రేయస్సు కలిగితే కుటుంబాలకు, సమాజానికి కలిగే శ్రేయస్సు ఇక అపూర్వమైందే కదా! అందుకే వ్యక్తి శ్రేయస్సు నుండి విశ్వ శ్రేయస్సు వైపు నడిపించే 'భజన' ను మనమూ చేద్దాం, భక్తుల మవుదాం, శుద్ధ భక్తులమవుదాం. ముక్తికి బాటలు వేద్దాం. 'భజన సేయనతడు భక్తుండు కాడయా' అన్న వేమన్న మాట పరమార్థమిదే అని ప్రచారం చేద్దాం.

+++

38. దీర్ఘాయువే అమరత్వం

అమరుడు, అమరులు, అమరత్వం, అమరజీవులు అనే మాటలు మాటి మాటికి వింటుంటాం. అంటే లోకంలో తాము అమరులు కావాలనుకొనే వాళ్లు ఉన్నారనేకదా! అమరులు ఎవరు! ఎవరు దివ్యులో వారు అమరులు. దివ్యులెవరు! కాంతి ఉన్నవారు. కాంతి ఎవరికి ఉంటుంది! అమరులకు.

భూమి గుండ్రంగా ఉంది అన్నట్టుగా చుట్టూ తిరిగి మళ్లీ అక్కడికే వచ్చాం. తీరా ఇది మానవులకు సంబంధించింది కాదు అనీ, వారిలో కొందరు మాత్రమే దివ్యులవుతారనీ, వారు మాత్రమే అమరులవుతారని తీర్మానించుకొని నిరాశపడాల్సిన మాటనే ఈ అమరత్వం అని తేల్చిపారవేసే ప్రమాదం ఉంది. సంస్కృతంలో అమరకోశం అని ఓ నిఘంటువు ఉంది. అది ఒక్క పదానికి ఎన్నో పాఠాంతరాలను సూచించే గ్రంథం.

అమరభాష ఉన్నంతకాలం, ఆ అర్థాలు కావాలనీ, ఆ పదాల పరమార్థాలు తెలుసుకోవాలని ప్రజలు అనుకొన్నంత కాలం ఆ అమరకోశం ఉంటుంది. ఇప్పుడు ముద్రణలో అది దొరుకుతుంది కాబట్టి అది ఎప్పటికీ ఉన్నట్టే కదా అని కొందరనవచ్చు. అదినిజమే కాని ప్రయోగంలో లేని దానికి 'సజీవత్వం' తక్కువ కదా! భౌతికవాదుల దృష్టిలో 'చేతన' ఉంది అంటే కదలాలి కదా! కదలకపోతే అది జడమనే అభిప్రాయం ఉంది కదా!

అయితే అణుపదార్థం ప్రేలుతుంది. అది ప్రేలడానికి కొన్ని దోహద క్రియలు కావాలి. అందులో ఋణశక్తినీ, ధన శక్తిని, జడశక్తిని కొన్ని పాళ్లల్లో కదలించాలి. ఈ కదలికలవల్ల అవికలుస్తాయి. ఈ కలయిక విస్ఫోటనమైనప్పుడే దానిలో ఆశక్తి ఉందనీ, అంతకు పూర్వం అందులో ఆశక్తి లేదని ఎవరమైన అనగలుగుతామా! అదేవిధంగా 'చేతనను' గూర్చి కూడా ఇట్లాగే ఆలోచించాలి.

మొత్తంమీద నిరంతర చైతన్యం, సుప్తచైతన్యం, ఏదైనా అమరమే అని తేలింది కదా! అమరులు అనంగానే దేవతల వైపు చూచేదృష్టి వదలి పెట్టి మానవుడు అమరుడయ్యేదెట్లో ఆలోచిద్దాం. ఈ విషయంలో వేదమాత ఏమంటుందో చూద్దాం.

"తేజోఽసి శుక్రమమృత మాయుష్పా ఆయుర్మే పాహి!!(యజు. 22-1)

-మనుష్యుని తేజోవంతునిగా, వీర్యవంతునిగా జేసి అయుర్వృద్ధి పరచుగాక! (మానవుడు) దీర్ఘాయువుగా జీవించాలి. ఇదే మనుజునికి కల్గే అమరత్వం!

అయితే తేజోవంతుడు కావడానికి. వీర్య వంతుడవడానికి అతడేంచేయాలి! అంటే వేదంలోనే దీనికి ఆధారముంది.

ప్రయ ఆరుః శిత పృష్ఠ స్యధాసేరా
మాతరా వివశుః సప్తవాణీః।
పరిక్షితా పితరా సంచరేతే ప్రసర్స్నాతే
దీర్ఘమాయుః ప్రయక్షే॥ (ఋక్ : 3-7-I)

-యజ్ఞము చేసి ప్రజ్వలించు అగ్నిలో యోగ్యమగు హవన సామగ్రిని హవనము చేయుట వలన శుద్ధమగు వాయువు పుడుతుంది. అటువంటి శుద్ధ వాయువు శరీరము నందు ఉండుటచేత అంటే పీల్చుటచేత మనుష్యునకు దీర్ఘాయువు కటుగుతుంది.

దీర్ఘాయువే అమరత్వమన్నవేదం, అటువంటి దీర్ఘాయువు యజ్ఞం వల్ల సిద్ధిస్తుంది అంటున్నది. ఈ క్రింది మంత్రం కూడా పరిశీలించండి.

"ఆయస్మిన్మనా హవీం ష్యగ్నె
అరిష్టరథః స్కబ్నాతీ శూషై॥ (ఋక్, (9-8-2)"

- యజ్ఞంలో ఎవరు శుద్ధ హవిస్సులను అర్పిస్తారో వారికి పరిపూర్ణ ఆయువు లభిస్తుంది.

ఆధునిక కాలంలో పర్యావరణ కాలుష్యం కారణంగా జీవకోటి ఆయుః పరిమాణం తగ్గిపోతున్నదని శాస్త్రవేత్తలు ఘోషిస్తున్న అంశం అకారాత్మక దృష్టితో చెప్పిన సత్యం కాగా, మంత్ర ద్రష్టలైన వేదఋషులు యజ్ఞాలు చేసి ఆయుస్సు వృద్ధి అయ్యేట్టు చూచుకోండి అనడం సకారాత్మక దృష్టితో చెప్పిన అంశమనిపిస్తుంది. రెండూ సత్యాలే. దీర్ఘాయువు ఉండాలి. జీవకోటి సేవచేయాలి. మంచిని వ్యాపింప జేయాలి. అందుకే నూరుసంవత్సరాలు పరిపూర్ణ మానవునిగా మనిషి బ్రతకాలనే అంటుంది యజుర్వేదం.

"ఇన్ధానాస్త్వా శథం హిమా ద్యుమన్తం సమిధీమహి॥
వయస్వన్తో వయస్కృతం సహస్వన్తః సహన్కృతమ్॥" (యజు : 3-18)

- మనం నూరు సం॥లు జీవించాలి. యజ్ఞాగ్నిని ప్రదీపనంచేసి, దానిలో ఋతుకాలాను సారంగా హవన సామగ్రిని హవనంచేయాలి. దీనివల్ల మన ఆయుష్షు వృద్ధి చెందుతుంది.

మనిషి తనచుట్టూ కల్మషాన్ని వ్యాపింపచేస్తున్నాడు. దానివల్ల వాతావరణం ప్రదూషితమవుతున్నది. ధ్వని కాలుష్యం, జలకాలుష్యం, వాయుకాలుష్యం, భూమి కాలుష్యం ఏర్పడుతున్నది. అన్ని కాలుష్యాల్ని దూరం చేసే శక్తి ఒక్క అగ్నికి మాత్రమే ఉన్నది. ఆ అగ్నిని ప్రజ్వలింప జేసేదీ యజ్ఞం. అయితే కేవలాగ్నిని ప్రజ్వలింపజేయడం కాదు ఇప్పుడు కావలసింది. అగ్నిలో హోమద్రవ్యాలు వేయాలి. ఆ ద్రవ్యాల కారణంగా వెలువడ్డ వాయువు గాలిలోని కాలుష్యాంశాలను అంతంచేసి పరిశుద్ధ వాతావరణాన్ని నిర్మిస్తుంది. ఈ వాతావరణంలో జీవించే సర్వప్రాణుల ఆయుష్షు పెరుగుతుంది. ఈ పెరగడమే అమరత్వమని వేదమాత అంటున్నది.

జీవకోటి - యజ్ఞం - దీర్ఘాయువు - అమరత్వం.

మనస్సునెల్లప్పుడు ఆనందంగా ఉంచుకొనేవారికి కూడా దీర్ఘాయువు ప్రాప్తిస్తుందని ఋగ్వేదమంటున్నది.

యత్రానందాశ్చ మోదాశ్చ ముదః ప్రముద ఆ సతే।
కామస్య యత్రాప్తాః కామాస్తత్ర మామమృతేకృధి॥ (ఋగ్వేదం 1-113-11)

ఎక్కడ మనస్సు ఆనందంతో ఉంటుందో అక్కడ అమరత్వం ఉంటుంది. అంటే దీర్ఘాయువు సంప్రాప్తిస్తుంది. అందుకే మనస్సును ఎప్పుడూ ఆనందంలో ఉంచుకోవాలి. అలా ఉంచుకొన్న వారికే దీర్ఘాయువు ఉంటుంది.

"శతంజీవ శరదోవర్ధ మానః।"

- వర్ధిల్లుతూ వర్ధిల్లుతూ నూరేళ్ల బ్రతుకు అని అధర్వణ వేదమంటున్నది. ఈ వర్ధిల్లడం భౌతికంగా కాదు. భావనామయంగా ఉండాలి. ఇదే అమరత్వం, వేదార్థ భావనామయంగా ఉండాలి. ఇదే అమరత్వం: వేదార్ధ ప్రతిబోధితామరత్వం.

39. శ్రీరామనామం

శ్రీరామనామ ప్రాదుర్భావానికి సంబంధించి పండిత ప్రకాండులెందరో అనేక విధాలుగా ప్రవచించారు. అభినయ నన్నయ భట్టారక బిరుదాంచితులైన శ్రీ పశర్లపాటి వాసుదేవశాస్త్రి తమ వాసుదేవ రామాయణంలో ఈ విధంగా వ్యాఖ్యానించారు.

దశరథేశునికి సంతానం కలిగింది. ఆయన అపూర్వామృతాబ్ధి మధ్యమునిగి-పోయాడు. వశిష్ఠ మహర్షి ఆజ్ఞానుసారం జాతకర్మ మహోత్సవాన్ని నిర్వహించాడు. ఈ క్రింది పద్యాలా సందర్భంలోనివే.

నరనాథుండు వశిష్ఠునాజ్ఞగొని తానారాయణాష్టాక్షరీ
వరమంత్రాంతర పంచమాక్షరము, దీవ్యచ్ఛైవ పంచాక్షరీ
వర మంత్రాంతర మంగళాత్మకలసద్వర్ణ ద్వితీయాక్షరం
బు, రహింపన్ జత గూర్చి 'రామ' యని సంబోధించె స్వజ్యేష్ఠునిన్"

- దశథుడు వశిష్ఠుని ఆజ్ఞ తీసుకొన్నాడు. "ఓం నమోనారాయణాయ" అన్న అష్టాక్షరీ మంత్రంలోని అయిదవ అక్షరమైన 'రా' గ్రహించాడు. ఆ తర్వాత దివ్యమైనటువంటి "నమశ్శివాయ" అనే శివపంచాక్షరీ మంత్రంలోని రెండవ అక్షరమైన 'మ' గ్రహించ్ాడు. ఈ రెండక్షరాలను జతచేసి తన పెద్ద కొడుకును 'రామ" అని పేరు పెట్టి పిలిచాడు.

ఇందులో స్థితి (విష్ణువు) ఉన్నది. లయము (శివుడు) న్నది. ఇక సృష్టి (బ్రహ్మ) చేరవలసి ఉన్నది. ఈ అంశాల్ని ఆ తర్వాతి పద్యం ఇలా ప్రతిపాదిస్తున్నది.

సృష్టి నొనరింపకుండియు సృష్టి కల్ల
పరమకారణ మగుదాని బ్రహ్మమండ్రు,
బ్రహ్మశబ్దాంత రాత్మమై పరగునండ్రు
'రామ' యని చెప్పబడు నక్షరద్వయంబు

- సృష్టి చేయకున్నా సృష్టికి పరమకారణమైన దానిని బ్రహ్మయే అని పిలుస్తారు. ఆ బ్రహ్మ శబ్దాంతరాత్మగా 'రామ' నామమనే రెండక్షరాలు ఉన్నాయని అంటారు.

బ్రహ్మ అనే రెండక్షరాల్లో 'బ్ర' లో 'ర' ఉన్నది, 'హ్మ' ల 'మ' ఉన్నద. అందుకే బ్రహ్మలో రాముడున్నాడనడం.ఇంతకూ రామ శబ్దాంతరాత్మగా సృష్టిస్థితిలయాలున్నాయన్నమాట. అంతేకాదు ఈ రామ పదంలో యోగులు నిరంతరం రమించడం వల్లకూడా రామనామం పరమార్థ ప్రబోధకం అయ్యిందంటారు

శ్రీమద్వాసుదేవరామాయణ కవివర్యులు.

యోగులల చిన్మయానందయుత, మనంత
మగు పరబ్రహ్మమంచు దామనవరతము
హాయిగ రమించుచుండుదు రందు వలన
నది తదర్థక రామాఖ్యనలరుచుండు

- అతి చిన్మయానందయుతం; అనంతమగు పరబ్రహ్మం; ఇలా భావించి ఆ రామనామంలో యోగులు నిరంతరం రమిస్తుంటారు.

యోగి కోరేదిచిన్మయానందం, పరబ్రహ్మానందం. భోగి కోరేది లౌకికానందం. ఒకటి ఆత్మకు సంబంధించింది. మరొకటి శరీరానికి సంబంధించింది. ఒకటి శాశ్వత సుఖాన్నిస్తుంది. రెండోదిచ్చే క్షణిక భౌతిక సుఖంవల్ల కూడా దుఃఖమే మిగులుతుంది. అందువల్ల రామనామమొక్కటే శాశ్వతానంద రమణాన్నిస్తుందని భావించాలి.

కవి ఇంతటితో ఆగలేదు. ఇది అద్వితీయమే అయినా ద్వివిధాకృతితో ఉన్నదని తెలియజేస్తున్నారు.

"రామపదవాచ్యమగు పరబ్రహ్మమద్వి
తీయమయ్యును ద్వివిధాకృతిన్ వహించె,
చెలగి నారాయణుండంచు 'శివు' డటంచు
తదుభయాత్మక తేజమిత్తరిని వెలసె."

- ఆ రామ పదం శివకేశవాద్వైత ప్రతిపాదకమే అయినా నారాయణా శివా అని ద్వివిధాకృతిని ప్రజ సమ్మానిస్తూనే ఉంది. ఇప్పుడు ఆ ఉభయాత్మక తేజస్సును ప్రజలు రామునిలో సందర్శిస్తున్నారు.

మహాకవి శ్రీ పశర్లపాటి వాసుదేవశాస్త్రి రామ పద వ్యాఖ్యానాన్ని ఇంతటితో ఆపలేదు. రామునికి శ్రీని ఆదిగా చేర్చడంలోని అంతరార్థాన్నీ వివరించారు.

"శ్రీయనగ లక్ష్మి లక్ష్మియే 'సీత' యగుచు
రాముని వరించునని ముని రాజు తలచి
పిలిచె ' శ్రీరామ' యనుచు, దీవించె బాలు
శిరము పై సేసలిడి ' చిరంజీవ ' యనుచు".

- శ్రీ అంటే లక్ష్మీదేవి. ఆ లక్ష్మియే సీతగా జన్మిస్తుంది. రాముణ్ణి వరిస్తుంది, అని వశిష్ఠుడు భావించాడు. అందుకే శ్రీరామ అని బాలుణ్ణి దీవించి శిరస్సుపై అక్షతలు చల్లి "చిరంజీవ" అన్నాడు.

లోకంలో సీతారాములనే వాడుకనే ఎక్కువ. సీతా శ్రీరాములని ఎవరూ పిలువరు. శ్రీరాములన్నా సీతారాములనే అర్థమన్నమాట. కవి ఎంత గొప్పగా పర్థమార్థ ప్రబోధంచేశారో చూడండి! ఆ తర్వాత భరత లక్ష్మణ శత్రుఘ్నుల పేర్లూ సార్థకాలుగానే కవి వ్యాఖ్యానించారు.

శ్రీరామ పాదారవింద భక్తి భరితుడవుతాడని 'భరతు' గన్నారట. సూక్ష్మబుద్ధి - సులక్షణ స్ఫూరితుడు లక్ష్మణుడని పిలిచారుట. శత్రువులను జయించే దోర్బలాఢ్యుడవుతాడని శత్రుఘ్న నామధేయం ప్రసాదించారట.

ఆ .... పేరులో ఏముంది పెన్నిధి అనే వాళ్లు ఊ...... పేరులోనే ఉంది పెన్నిధి అనే వాళ్లు ఎప్పటికీ ఉంటారనే అనుకోండి!

అయినా రామనామం మధురం కదా! మరా మరా అన్న వాల్మీకికే ఆ మధురత్వంలోని బ్రహ్మానందమందిందికదా! ఆ మహర్షి ఆశ్రమమే రామమయమంటారు. అయోధ్యాకాండలో ఓ సందర్భాన్ని కల్పించుకొని కవి శ్రీ వాసుదేవశాస్త్రి.

"వ్యత్యస్తరామనామప్రత్యయు జపసిద్ధి బడసి ప్రాచేతసు, డ
ప్రత్యక్షపరాత్మను దా ప్రత్యక్షమొనర్చుకొనియె ప్రాజ్ఞులు మెచ్చన్.

"రామతారక మంత్ర పురశ్చరణము
రామ భగవత్పదాంబుజారాధనంబు
రామ పావన నామ పారాయణంబు
రామమయ. మల్ల నాకుజాశ్రమ పదంబు.

"కోకిలంబులు చిల్కలు గోరువంక
పక్షులును, చెట్లకొమ్ములపైన నిల్చి
మాటిమాటికి రామ! రామా యటంచు
సుధలొలుక గూయునవ్యక్త మధురముగను."

"సాంద్రశాఖోప శాఖా విశాల వృక్ష
మూలతల సన్నివిష్టులై మునికుమారు
లుల్లములు పల్లవింప జేయుదురు మధుర
గీతికల రామ నామ సంకీర్తనంబు."

(వాసుదేవ రామాయణము, పద్యములు, 414, 15, 16, 17,)

రామనామ పరమార్థ జపసాధనా సకుశలుడైన మహాకవి శ్రీ పశర్లపాటి వాసుదేవశాస్త్రి 2500 పై చిలుకు పద్యాలలో వాసుదేవ రామాయణాన్ని రామభక్తుల కందించి ధన్యులైనారు. ఇది సంగ్రహరామాయణమే అయినా శ్రీరామనామ - చరిత ప్రాశస్త్యానికి హిమాలయోత్తుంగ శిఖర పీఠిగా నిలిచింది.

★★★

40. శ్రీరామ భక్తుల మవుదాం

"శ్రీరామనామం మరువాం మరువాం
సిద్ధము యమునకు వెరువాం వెరువాం
గోవిందు నేవేళ గొలుతాం కొలుతాం
దేవుని గుణములు తలుతాం తలుతాం॥
విష్ణుకథలు చెవుల విందాం విందాం
వేరె కథలు చెవుల మాన్దాం మాన్దాం
భద్ర గిరీశుని కందాం కందాం
భద్రముతో మనముందాం ఉందాం॥"

శ్రీరామనామం మరువకుండా ఉంటే మృత్యువుకు మనం భయపడాల్సిన అవసరం లేదు. శ్రీరాముని సేవ-ధ్యానం నిరంతరం సాగితే, ఆయన భద్రాలయాన్ని మనం నిరంతరం చూస్తూ ఉంటే, (అంటే కాపాడుతుంటే) మనం భద్రంగా ఉంటాం.

ఈ భావన లెవరివి! భద్రాచలం భక్తకవి రామదాసులవారివి. తాను గోలకొండ నియంతల చెరసాలలో ఉన్నప్పుడు - ఒక్కరోజు కాదు. పంద్రెండు సంవత్సరాలు అష్టకష్టాలు పడుతూ ఆ చెరసాలలో ఉన్నప్పుడు ఆ భక్తకవి నోట ఇలాంటి పదాలు ఎన్నో వచ్చినై. ఇవి ఆ భక్తుని భావనలే కావు. విషాదంలో పడ్డ ఎవరికైనా ఈ భావాలు సంయమనాన్నీ- శక్తినీ ప్రసాదిస్తాయి.

శిథిలమైన ఆ ఆలయాన్ని, ఆ ప్రదేశం తహసిల్దారైన కంచెర్ల గోపన్న కట్టించాడు. అంతకు పూర్వం తమ్మల దమ్మక్క అనే భక్తురాలు ఈ ఆలయం కట్టించింది. అయితే భద్రాచలం వర్ణన వేదవ్యాసవిరచితమైన బ్రహ్మాండపురాణంలోని గౌతమీ క్షేత్రమాహాత్మ్యంలో ఉంది. అంటే భారత కాలం నాటికే గౌతమి భద్రగిరి- (గోదావరి భద్రాచలం) తీర్థ క్షేత్రాలుగా ఎంతో ప్రసిద్ధి పొందాయన్న మాట. అంత ప్రాచీన కాలంలోనే భద్రగిరికే ఇంత ప్రసిద్ధి ఉంటే అయోధ్యలో మరి రాముడు పుట్టిన జన్మభూమి దేవాలయానికి ఎంత ప్రాశస్త్య ముండాలో ఆలోచించండి.

హిందువులందరికి పుణ్యక్షేత్రంగా అయోధ్యమారింది. అందుకే మన సప్త పుణ్యనగరాల్లో అదిమొట్ట మొదట చేరింది.

"అయోధ్యా మధురామాయా - కాశీకాంచీ అవంతికాః
పురీ ద్వారావతీ చైవ - సప్తైతే మోక్ష దాయికాః॥"

ఇవీ ఆ సప్త పుణ్యనగరాలు. ప్రాచీన కాలంలో దేశమంతా తిరిగి తీర్థయాత్రలు చేసే వారుగానీ, ఇప్పుడూ యాత్రలు చేసే వారుగానీ అయోధ్యను దర్శించకుండా ఉండడం లేదు. అయోధ్యను దర్శించడం మంటే సరయూనదీతీరంలోని రాముని జన్మస్థానాన్ని దర్శించడమే.

ఆదిశంకరులు దేశంలో మఠమందిరాలెక్కువగా స్థాపించడం వెనుక దేశ రక్షణ అనే ఒక పవిత్ర భావన ఉంది. మఠ మందిరాలు దేశంలోని విభిన్న ప్రాంతాల్లో ఉన్నందువల్ల, వాటిని చూడ్డానికి దేశీయలు వెడతారు. అవిచూడ్డమేగాక వాటిని రక్షించాలనే దృఢబావన కూడా వారికి కలుగుతుంది. తద్వారా రాజులు కళ్లు మూసుకొన్నా, ప్రజలు మాత్రం చైతన్యంతో నిలబడి శక్తిని ప్రదర్శించి రక్షించుకొంటారు.

దీనిని బట్టి మనకేం తెలుస్తున్నది, భక్తిగానీ, ముక్తిగానీ అది వ్యక్తి వికాసానికి చెందిందే అయినా దురాక్రమణ శక్తులకు లొంగి పొమ్మని ఏనాడూ ఎప్పలేదనేకదా! అందుకే భక్తి, ముక్తితోపాటు వ్యక్తి శక్తి పూజారి కూడా కావాలనే కదా సందేశం. అలనాటి భద్రగిరి భక్తరామదాసులవారిని కూడా ఇదే విధంగా అర్థం చేసుకొంటే, ఆ భక్తుని పద సంకీర్తనల్లోని అంతరార్థం సులభంగా అర్థమవుతుంది.

41. విజయీ భవ!

ఏటావచ్చే విజయదశమి(దసరా) మళ్లీ వచ్చింది. (ఈ ఏడు అంగిరస సం॥ర ఆశ్వయుజ శుద్ధదశమి) దానికన్నా ముందు జరిగే నవరాత్రి ఉత్సవాలూ జరిగాయి. దుర్గాదేవి కొలుపులూ జరిగాయి. మహర్నవమి కోలలూవెళ్లాయి. భజన పరులు చిందులు వేశారు. వీథుల్లో -అక్కడక్కడ కొన్ని గ్రామాల్లో యక్షగానాలు-చిఱుతలరామాయణాలు ఆడారు-పాడారు. చాలా ప్రదేశాల్లో ఎడ్లపందాలు-కోళ్లపందాలు- బండ్ల పందాలు జరిగాయి. చిఱ్ఱగెన, కోలాటం. ఆ ఆటా-ఆపాటా-అంతటా సంరంభాలు జరిగాయి- సంబరాలు జరిగాయి. హరికథలు- పురాణ ప్రవచనాలు అంతటా వినిపించాయి.

ఇది ఈ ఒక్క సంవత్సరమే కాదు. ఏటా జరుగుతున్నదే! పిండివంటలు, కొత్తబట్టల కంటే పై కార్యక్రమాలన్నీ మనిషికెంతో ఉత్సాహాన్నిస్తాయి.

అయితే పండుగ సందేశం కూడా ప్రతి వ్యక్తి తప్పకుండా తెలుసుకోవాలి. ఉదాహరణకు ఈ నవరాత్రి ఉత్సవాల్లో దుర్గా పూజలు జరుగుతాయి. ఎందుకు జరుగుతాయో తెలుసుకోవాలి.

ఆ దుర్గా దేవే ఆదిశక్తి, ఆ తల్లె మహామాయ. ఈ తల్లికే మహాకాళి అని పేరు. ఈ అవతారంలోనే తల్లి మధుకైటభులనే రాక్షసులను సంహరించింది.

ఈ తల్లి రెండవ అవతారం మహిషాసురమర్దని. సింహవాహనయైన ఈ తల్లికి మహాలక్ష్మి అని పేరు. ఈ తల్లే మహిష ముఖుడైన అసురుణ్ణి సంహరించింది.

మూడవ అవతారంలో ఈ తల్లికి మహాసరస్వతి అని పేరు. ఈ అవతారంలోనే అమ్మవారు శుంభ నిశుంభులను, రక్త బీజుణ్ణి చంపి వేసింది.

నాల్గవ అవతారంలో తల్లి నందునింట నందగా(యోగమాయగా) జన్మించి, కంసుణ్ణి హడలగొట్టి అదృశ్యమైపోయింది.

అయిదవ అవతారంలో రాక్షస సంహారానికి అమ్మవారు దంతాలనే ఉపయోగించినందువల్ల, అప్పటి నుండి రక్తదంతిగా ఆ తల్లికి పేరు వచ్చింది.

లోకంలో కరువుకాటకాలెక్కువైపోవడంతో తల్లి అంతటా శాకాలు సృష్టించి కరువు తొలగించింది. అందువల్ల ఆ తల్లి ఆరవ అవతారంలో శాకంభరిగా పిలువబడింది.

దుర్గుడనే రాక్షసుణ్ణి అమ్మవారు ఏడవ అవతారంలో సంహరించింది. ఆకారణంగానే తల్లికి దుర్గ అని పేరు వచ్చింది.

ఎనమిదవ అవతారంలో తల్లి మతంగుని యింట పుట్టింది. అందువల్లనే మాతంగి అని పిలువబడింది.

తొమ్మిదవ అవతారంలో రాక్షస సంహారం నిమిత్తం అమ్మవారు భ్రమరాలను సృష్టించి విజయం సాధించింది. అందువల్ల తల్లికి ఈ అవతారంలో భ్రామరి అనే పేరు వచ్చింది.

జగదీశ్వరి, జగజ్జనని, లోకపావని అయిన ఆదిశక్తి లోకంలోని మాతృజీవశక్తికి మూలాధారం. సర్వసృష్టికి మాతృశక్తే మూలాధారం.

తెలంగాణా ప్రాంతంలో ఎక్కువగా జరుపుకొనే పండుగైన 'బ్రతుకమ్మ' వెనుక కూడా ఇదే తత్త్వముంది. ఈ పండుగలో స్థానిక కథలు, స్థానిక సంప్రదాయాలు ఎన్ని కలిసినా ఈ ఉత్సవం వెనుక కూడా ఆదిశక్తి తత్త్వమే ఉంది. ఆ తల్లి బతుకునిచ్చే తల్లి అనీ, అందరినీ బతుకుమని ఆ తల్లి కోరుతుందని ఈ పండుగ వెనుక ఉన్న అంతరార్థం.

ఆ తర్వాత జరిగే విజయ దశమి ఉత్సవం వెనుక కూడా ఇవే అంతరార్థాలున్నాయి. రావణ సంహారం, విజయుని ఆవుల మళ్లింపు, హిందూ రాజుల జైత్రయాత్రలు- ఇలాఎన్నో విజయదశమి వైశిష్ట్యాన్ని మరీ పెంచాయి. విజయదశమి మన విజయ సంకేతం. అన్ని రంగాల్లో మనం. మనదేశం, మనజాతి, మన సంస్కృతి విజయాలు సాధించి, జ్ఞాన భిక్షనూ, అన్నభిక్షనూ పెట్టె స్థితికి ఎదగాలనే ఈ పండుగ పరమార్థంగా భావించాలి.